అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 11 -01-2019 సమగ్ర తెలుగు దినపత్రిక


సంపుటి : 5 సంచిక : 14 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 6.50

సీబీఐ చీఫ్ ఔట్

డైరెక్టర్ పదవి నుంచి అలోక్‌వర్మ తొలగింపు







- అత్యున్నత కమిటీ 2-1 తీర్మానం మేరకు..
- నూతన డైరెక్టర్ నియమించేదాకా మళ్లీ నాగేశ్వరరావు..
- సీబీఐ ఆఫీసులో హైడ్రామా

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన సమావేశమైన అత్యున్నత కమిటీ సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను పదవి నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నది. అదనపు డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావుకు తిరిగి బాధ్యతలు అప్పగిస్తున్నట్టు కేంద్రం ఓ ప్రకటనలో తెలిపింది. నూతన డైరెక్టర్‌ను నియ మించేవరకూ నాగేశ్వరరావు కొన సాగుతారని తెలిపింది. అలోక్‌వర్మ తొలగింపు నిర్ణయాన్ని అత్యున్నత స్థాయి కమిటీ తీసుకున్నది. కమి టీలో ప్రధాని మోడీతోపాటు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే, జస్టిస్ ఎకె సిక్రీ సభ్యులుగా ఉన్నారు. జస్టిస్ సిక్రీని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌గొగోయ్ నామినేట్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మ బుధవారం బాధ్యతలు చేపట్టగా ఆ మరుసటి ...9లో

మళ్లీ పైపైకి..


పెట్రోల్ పై రూ. 0.40, డీజిల్ పై రూ. 0.31 పైసలు పెంపు



న్యూఢిల్లీ: పెట్రో ఉత్పత్తుల ధరలు మళ్లీ ఎగబాకుతున్నాయి. రెండు రోజుల విరామం తర్వాత గురువారం దేశవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగాయి. అంతర్జాతీయంగా క్రూడా యిల్ ధరల పెరుగుదలను కారణంగా చూపుతూ ఆయిల్ కంపెనీలు చమురు ఉత్పత్తుల ధరలను మళ్లీ పెంచాయి. దేశం లోని ప్రధాన నగరాలతో పాటు పలు ప్రాంతాలలో లీటరు పెట్రోల్ రూ. 0.40, డీజిల్ రూ. 0.31 పైసలు ...9లో

వర్సిటీలలో ఎస్సీ, ఎస్టీ కోటాపై ఆ వేగమేది..?

ఐదువేల అధ్యాపకుల పోస్టులు ఖాళీ



- పట్టించుకోని మోడీ సర్కార్
- ఈ పార్లమెంట్ సమావేశాలలోనూ మొండిచేయి

వివరాలు 12లో

అమ్మఒడి నుంచి..

చిన్నారులను పెంచలేమంటున్న గిరిజనులు

వారు పుట్టుకతోనే అభాగ్యులవుతున్నారు.. తల్లి పొత్తిళ్లకు దూరమవుతున్నారు. పుట్టినప్పటి నుంచే ఆ పసికందులను భారంగా భావిస్తున్నారు తల్లిదండ్రులు. తప్పు వారిది కాదు.. పేదరికానిది. పిల్లలను పెంచడం, విద్యాబుద్ధులు నేర్పడం, పెండ్లిళ్లు చేయడం వారికి తీరని వ్యథ. వారు ఒకపూట తిండికే నానాయాతన పడుతున్నారు. అందుకే పిల్లల్ని సాకడం కష్టంగా భావించి శిశువిహార్, బాలసదన్ స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తున్నారు. మరికొందరైతే గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకుంటు న్నారు. పేగు బంధాన్ని తెంచుకోలేక.. పసికందులను పస్తులతో ఉంచలేక తల్లులు కుమిలిపోతున్నారు. పాలకుల నిరాదరణ వల్ల నల్లమల గిరిజనుల దుర్భర జీవనం పిల్లలకూ శాపమైంది.

- ఆర్థిక భారంతో శిశువిహార్‌కు..
- ఆడ బిడ్డలైతే మరింత భారమనే భావన
- గుట్టుగా విక్రయాలు
- ఇదీ నల్లమలలో గిరిజనుల దుర్భర జీవన పరిస్థితి

నవతెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రతినిధి

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో ఎక్కువగా గిరిజనులు, చెంచులు, ఆర్థికంగా వెనుకబడిన వారే ఉన్నారు. 95గిరిజన తండాల్లో 13 ఏజెన్సీ గ్రామ పంచాయతీలున్నాయి. వీటితో పాటు 75చెంచుపెంటలు నల్లమలలో ఉన్నాయి. రెండు లక్షల జనాభా ఉన్న నియోజకవర్గంలో గిరిజనులు, చెంచులు 25వేలకు మించి ఉంటారు. వీరిలో 80శాతం గిరిజనులకు వ్యవసాయ భూములు లేవు. 90శాతం మంది నిరక్షరాస్యులే. కొంతమందికి పోడు భూములున్నా సాగునీటి సౌకర్యం లేదు. దీంతో వేలాది మంది గిరిజనులు వలసెళ్తున్నారు. ఈ క్రమంలోనే ఆర్థిక భారంతో గిరిజనులు మూడేండ్ల కాలంలో ...9లో



శిశువిహార్‌కు శిశువును అప్పగిస్తున్న వెల్టూర్ గ్రామం, మున్యతండాకు చెందిన దంపతులు ముడావత్‌పద్మ, సేవ్య



సగం కంటే తక్కువే..

సర్కారు అంచనా రూ.65,487 కోట్లు



- వచ్చింది రూ.58,651 కోట్లు
- నవంబరు నాటికి ప్రభుత్వ ఆదాయం తీరిది
- ఓటాన్ అకౌంట్ వేళ రూపాయి రాకపై చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



టీఆర్ఎస్ సర్కారు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు యోచిస్తున్న తరుణంలో.. ఇప్పుడు ఆర్థిక నిపుణుల దృష్టి రాష్ట్ర ఆదాయంపై పడింది. ఖజానాకు రూపాయి రాక.. రూపాయి పోకపై వారిప్పుడు చర్చోపచర్చలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2018-19) సంబంధించి సర్కారు వేసుకున్న అంచనాలను అందుకోలేకపోయింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను సర్కారు ప్రవేశపెడితే.. మరో నెల, నెలన్నర రోజుల్లోనే కొత్త పద్దు వచ్చే వీలుంది. ఇదే సమయంలో పాత పద్దుకు సంబంధించి 2018 నవంబరు నాటి లెక్కలను పరిశీలిస్తే.. ఆర్థికంగా కొంత ఇబ్బందికర పరిస్థితే కొనసాగుతున్నట్టు విదితమవుతున్నది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రగతి పద్దు, నిర్వహణ పద్దు రెండింటికీ కలిపి ప్రభుత్వం రూ.1,74,453 కోట్లను ప్రతిపాదించింది. ఇందులో గత నవంబరు నాటికి రూ.1,30,975 కోట్లు (రెవెన్యూ రశీదుల ద్వారా) వస్తాయని అంచనా వేసుకుంది. అందుకు భిన్నంగా రూ.58,651 కోట్ల ఆదాయం మాత్రమే లభించింది. అంటే సర్కారు వేసుకున్న అంచనాలో సగం (రూ.65,487 కోట్లు) కూడా రాలేదన్నమాట. 2017 నవంబరుతో పోలిస్తే.. 2018 అదే నెలలో ఆదాయం తగ్గిపోయినట్టు కాగ్ లెక్కలు తేల్చి చెబుతున్నాయి. 2017 నవంబరులో సర్కారు వేసుకున్న అంచనాల్లో 46.63 శాతం ఆదాయం లభిస్తే.. 2018లో ...9లో

సీఎల్పీ నేతగా భట్టి..!

ఎన్నిక లాంఛనమే



నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

శాసనసభ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ శాసనసభా పక్షనేత ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈనెల 15 లేదా 16న జరగనున్న సీఎల్పీ సమావేశంలో ప్రతిపక్ష నేతగా మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క ఎన్నికయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం. సీఎల్పీ నేత ఎన్నిక లాంఛనమేనని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. అందులో భాగంగానే భట్టిని అధిష్టానం ఢిల్లీకి ఆహ్వానించింది. ముందస్తు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 19 సీట్లను గెలుచుకుంది. పార్టీ తరుపున గెలిచిన ఎమ్మెల్యేల్లో మాజీ మంత్రులు, కొంత మంది సీనియర్లు గెలిచారు. అందులో టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గత కాంగ్రెస్ హయాంలో మంత్రులుగా పని చేశారు. మునుగోడు నియోజకవర్గం నుంచి గెలుపొందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గతంలో ఎంపీగా, ఎమ్మెల్సీగా ఉన్నారు. ఎస్టీ సామాజికవర్గం నుంచి ...9లో

సంక్రాంతి కి పస్తులేనా?

ఎయిడెడ్ సిబ్బందికి ఐదు నెలలుగా జీతాల్లేక అవస్థ

- రూ.103 కోట్ల కోసం ఎదురుచూపు
- సర్కారుకు పట్టని గోస

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది జీతాల్లేక మనోవేదన చెందుతున్నారు. ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు ఐదు నెలలుగా టీఆర్ఎస్ ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి అద్దె, పిల్లల చదువులకు ఫీజులు, వైద్యం కోసం ఖర్చులు, నెలవారీ జీవనానికి కావాల్సిన అవసరాలు తీర్చుకోవడానికి అప్పులపాలవు తున్నారు. కుటుంబాలను పోషించేందుకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే పరిస్థితి తలెత్తింది. ముందస్తు ఎన్నికలు పూర్తయ్యాక జీతాలొస్తాయని ఎంతో ఆశగా ఉన్నారు. కనీసం సంక్రాంతికైనా జీతాలు అందుతాయని ఆశించారు. తీరా సంక్రాంతి సెలవులు ప్రకటించినా ఎయిడెడ్ సిబ్బందికి జీతాలు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఎయిడెడ్ సిబ్బందిలో సం'క్రాంతి'



కనిపించే అవకాశం లేదు. జీతాలు రాకపోవడంతో గతంలో వచ్చిన దసరా, దీపావళి, క్రిస్టమస్ పండుగలను ఎలాగోలా నెట్టుకొచ్చారు. అప్పులతో ఇంటిల్లిపాది అవసరాలను తీర్చారు. ఇప్పుడు సంక్రాంతి పండుగ అవసరాలనె ఎలా తీర్చాలన్నది ఎయిడెడ్ సిబ్బందికి మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఇప్పటికే తెలిసినవారు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేశారు. కొత్త అప్పు దొరకాలంటే కొంచెం కష్టంగానే మారింది. సంక్రాంతి పండుగ ఎలా చేసుకోవాలని ఎయిడెడ్ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ...9లో

జేఎన్‌యూ వీసీ రాజీనామాకు డిమాండ్


హెచ్‌ఆర్డీ మంత్రికి 49మంది ఎంపీల లేఖ



న్యూఢిల్లీ: న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)లో వివాదాలకు కేంద్ర బిందువైన వైస్‌చాన్స్‌లర్(వీసీ) ఎం. జగదీశ్ కుమార్ తొలగింపునకు రాజకీయంగా ఒత్తిడి పెరుగుతు న్నది. వీసీ రాజీనామాను కోరుతూ 49 మంది ఎంపీలు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి (హెచ్‌ఆర్డీ) శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు ఇటీవల ఓ లేఖ రాశారు. జేఎన్‌యూలో పరిపాలనకు సంబంధించిన అనేక సమస్యలను వారుఎత్తి చూపారు. జేఎన్‌యూను నాశనం చేస్తున్న ప్రస్తుత వీసీ నుంచి ...9లో

విపత్తు నుంచి తేరుకోనేలేదు

జీఎస్టీ కౌన్సిల్‌లో కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్



నవతెలంగాణ - న్యూఢిల్లీబ్యూరో

ఇటీవల కేరళ రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తా యని, ఆ విపత్తు నుంచి రాష్ట్రం ఇంకా తేరుకోలేదని ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్ చెప్పారు. వరదలు సృష్టించిన విధ్వంసం కారణంగా పెద్ద ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లడంతో ఆర్థికంగా ఇబ్బం దులు తలెత్తుతున్నాయని అన్నారు. గురువారం 32వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న థామస్, అనంతరం కేరళ భవన్‌లో ఏర్పాటు చేసిన ...9లో



తెలుగురాష్ట్రాల రాజకీయంపై ఆరా

ప్రధాని మోడీతో గవర్నర్ నరసింహన్ భేటీ

నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ తన ఢిల్లీ పర్యటనలో గురువారం బిజీబిజీగా గడిపారు. ఈ పర్యటనలో భాగంగా ఉదయం ప్రధానమంత్రి నరేంద్రమోడీతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని తాజా రాజకీయ పరిస్థితులను ప్రధానితో చర్చించినట్టు సంబంధిత అధికారులు వెల్లడించారు. అదేవిధంగా కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో కూడా గవర్నర్ నరసింహన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హోంమంత్రికి రెండు రాష్ట్రాల్లోని రాజకీయ, పరిపాలన పరిస్థితులపై గవర్నర్ నివేదిక ఇచ్చారు. అంతేకాకుండా తెలుగు రాష్ట్రాల్లోని తాజా పరిస్థితులపై రాజ్‌నాథ్‌తో కూడా గవర్నర్ చర్చించారు. ఇరువురితో విడివిడిగా దాదాపు నలభై నిమిషాల పాటు గవర్నర్ మంతనాలు జరిపారు. తెలంగాణలో టీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గవర్నర్ ఢిల్లీ పర్యటనకి రావడం ఇదే మొదటిది కావడం విశేషం.


విద్యుత్ కంపెనీల మాయాజాలం

దివాలాకు దగ్గరైన మూడు కంపెనీలు. అదానీ గ్రూప్‌నకు బదిలీకి బ్యాంకుల అంగీకారం..?



- కంపెనీల అప్పుల విలువ రూ.31,500 కోట్లు
- అదానీ విద్యుత్ కంపెనీలు అప్పుల ఊబిలో : పార్లమెంటరీ కమిటీ నివేదిక

న్యూఢిల్లీ:అప్పుల ఊబిలో కూరుకుపోయి దివాలా ప్రక్రియకు చేరువైన విద్యుత్ కంపెనీలు ఆస్తుల్ని అమ్ముకునేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. వీటిలో 7 కంపెనీల అప్పుల విలువ రూ.74,000 కోట్లు. కాగా, రుణదాతలకు నేతృత్వం వహిస్తున్న ఎస్‌బీఐ మూడు ప్రాజెక్టుల్ని అదానీ గ్రూప్‌నకు బదిలీ చేయడానికి అంగీకారం తెలిపినట్టు అధికార వర్గాల సమాచారం. అదానీ గ్రూప్ ద్వారా రుణపరిష్కారానికి అంగీకరించిన కోస్టల్ ఎనర్జెన్ ప్రయివేట్ లిమిటెడ్ రూ.6132 కోట్లు, కెఎస్‌కె మహానది పవర్ లిమిటెడ్ రూ.17,194 కోట్లు, జీఎంఆర్ ఛత్తీస్‌గఢ్ ఎనర్జీ లిమిటెడ్ రూ.8174 కోట్లమేర బ్యాంకులకు ...9లో



నేటినుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

14,15 తేదీల్లో జూనియర్ కాలేజీలకు...

వివరాలు 9లో

కేజ్రీవాల్‌ను కలిసిన ప్రకాశ్‌రాజ్

- ఎన్నికల్లో పోటీపై ఆప్ మద్దతు



ఢిల్లీ: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బెంగళూరు సెంట్రల్ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ఇటీవల ప్రకటించిన ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ అందుకు తగిన కార్యచరణను సిద్ధం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను ఆయన కలిశారు. కేజ్రీవాల్ నివాసంలో భేటీ ఆయిన ప్రకాశ్‌రాజ్.. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంపై తన అభిప్రాయాలను ఆయనతో పంచుకున్నారు. అనంతం రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేయనున్న ప్రకాశ్‌రాజ్‌కు ఆప్ తన పూర్తి మద్దతును ప్రకటించింది. 'మీలాంటి (ప్రకాశ్‌రాజ్)వారు పార్లమెంటులో ప్రవేశించాల్సిన అవసరం ఉన్నది. ఆప్.. మీకు పూర్తి మద్దతునిస్తుంది. ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలనుకున్న మీ నిర్ణయాన్ని మేము అంగీకరిస్తున్నాం' అంటూ కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. కేజ్రీవాల్‌తో పలుఅంశాలపై చర్చించినట్టు, తన రాజకీయ రంగప్రవేశంపై ఆప్ మద్దతు కోరినట్టు అనంతరం ప్రకాశ్‌రాజ్ ట్వీట్ చేశారు.

ఆర్మీలో గే లను అనుమతించం

ఆర్మీచట్టాల ప్రకారమే శిక్ష: ఆర్మీ చీఫ్ జనరల్ రావత్

న్యూఢిల్లీ : భారత ఆర్మీ ఇంకా పాశ్చాత్య దేశ ఆర్మీలా తయారు కాలేదని ఆర్మీ ఛీఫ్ జనరల్ బిపిన్ రావత్ అన్నారు. ఆర్మీలో స్వలింగ సంపర్కం జరుగుతున్నాయన్న ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన తీవ్రంగా స్పందించారు. అలాంటివేమీ ఆర్మీలో జరగవని ఎవరో అసత్య ప్రచారాలు చేస్తున్నారని వెల్లడించారు. అలాంటివి జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇదిలా ఉంటే 2018 సెప్టెంబరులో స్వలింగ సంపర్కం నేరం కాదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన విషయం విదితమే.. ఆర్మీలో ఉన్న చట్టాలు దేశ చట్టాలకంటే ఎక్కువ కాదని అయితే మన ఆర్మీ పాశ్చాత్య పోకడలకు పోదని ఆర్మీజనరల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంలో మాత్రం భారత ఆర్మీకి వందకు వంద మార్కులు ఇవ్వొచ్చన్నారు. స్వలింగసంపర్కం నేరం కాదని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ... ఆర్మీ చట్టాలను తాము అనుసరిస్తామని వాటి ఆధారంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు రావత్. ఆర్మీలో పనిచేసే వారెవరైనా సరే 1950 ఆర్మీ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని వెల్లడించారు.ఎవరైనా క్రమశిక్షణ తప్పి ప్రవర్తించినా, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వారికి ఆర్మీ చట్టం కింద ఏడేండ్ల పాటు జైలు శిక్ష ఉంటుందని రావత్ వివరించారు. ఆర్మీచీఫ్ చేసిన వ్యాఖ్యలు ఇపుడు దుమారం రేపుతున్నాయి.

ఈవీఎంలు విశ్వసనీయం కావు

- వీటిపై పున:సమీక్ష అవసరం: శ్యాం పిట్రోడా

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)ల పనీతీరుపై ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మెన్ శ్యాం పిట్రోడా స్పందించారు. ఈవీఎంలకు సంబంధించిన మొత్తం ప్రక్రియ విశ్వసనీయం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. 'టెక్నాలజీ అనేది మొత్తం గొలుసు ప్రక్రియలో ఒక అంశం. ఒక యంత్రం మరొకదానితో సరిపోలుతుందా లేదా విభిన్నమైనదా అనేది ఎవరికీ తెలీదు. ఈవీఎంలకు సంబంధించిన మొత్తం ప్రక్రియ ఫూల్‌ప్రూఫ్ కాదు. దీనిపై పున:సమీక్ష అవసరం' అని ఆయన అన్నారు. '10-15 ఏండ్ల క్రితం వచ్చిన ఈవీఎంల సాంకేతికత గొప్పదే. కానీ ఇప్పుడు కూడా అది గొప్పదే అని చెప్పలేము. ప్రతి ఐదేండ్లకు ఈవీఎంలపై పబ్లిక్ రివ్యూ ఎన్నడూ చేయలేదు' అని తెలిపారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల పైనా ఆయన స్పందించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు కాంగ్రెస్, దాని అధినాయకత్వంపై ప్రజలకు నమ్మకం కలిగేవిధంగా గట్టిగా పనిచేస్తున్నామన్నారు. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు రాహుల్‌గాంధీ చాలా కాన్ఫిడెంట్, ఆమోదయోగ్యుడని అన్నారు. ఎన్నికల్లో రాహుల్ తన శక్తిమేర పనిచేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని, బీజేపీకి మాత్రం ఆరెస్సెస్ క్యాడర్ ఒక అడ్వాంటేజ్ అని అన్నారు.

నేల పైనే ప్రసవం

- యూపీ కమ్యూనిటీ ఆరోగ్యకేంద్రంలో ఘటన
- డాక్టర్లు లేకపోవడమే కారణం

లక్నో: యూపీలో ప్రభుత్వ ఆస్పత్రుల తీరు మారడం లేదు. ఆస్పత్రిలో మౌళిక సదుపాయాలను కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. తాజాగా ఉత్తరప్రదేశ్‌లో ఓ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో మహిళ నేలపైనే ప్రసవించింది. ఇద్దరు మహిళలు సహాయం చేయడంతో ఆస్పత్రిలోని ఒక చెత్తకుప్ప దగ్గరే ప్రసవించింది. కాగా డాక్టర్లు అందుబాటులో లేకపోవడం, ఆస్పత్రుల్లో మౌళిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. తరెండేండ్ల నుంచి మౌళిక సదుపాయాల కొరత ఉన్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ...ఆ ఘటనపై విచారణకు ఆదేశించామని తెలిపారు.ఈ ఘటనకు కారకులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా అసోంలో కొనసాగుతున్న నిరసనలు

గువహతి : కేంద్రం ఇటీవల తీసుకుని వచ్చిన పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా అసోంలో నిరసనలు కొనసాగుతున్నాయి. దీంతో గురువారం కూడా రాష్ట్రంలో సాధారణ జనజీవనం స్తంభించింది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా విద్యార్థులు, న్యాయవాదులు, డాక్టర్లు గళమెత్తారు. గౌహతి మెడికల్ కాలేజ్ ఆసుపత్రి వైద్యులు నల్ల బాడ్జీలతో విధులను నిర్వహించారు. ముఖ్యమంత్రి సర్బానంద సోనావల్ స్వగ్రామంలోని ఆయన నివాసం వద్ద నిరసనకారులు అందోళనకు దిగారు. వాహనాలకు నిప్పుపెట్టారు. దీంతో నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. రాష్ట్రంలో అనేక విద్యా సంస్థల్లో విద్యార్థులు తరగతులను బహిష్కరించారు.

ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్‌గా షీలా దీక్షిత్

న్యూఢిల్లీ : ఢిల్లీ రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్‌గా షీలా దీక్షిత్‌ను గురువారం ప్రకటించారు. కొన్ని రోజుల క్రితం ఆ పదవి నుండి అనారోగ్య కారణాలతో అజయ్ మాకేన్ రాజీనామా చేశారు. దీంతో షీలా దీక్షిత్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఢిల్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పిసి చాకో తెలిపారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా షీలా దీక్షిత్ మూడు పర్యాయాలు పనిచేశారు. లోక్‌సభ ఎన్నికలకు మూడు నెలల వ్యవధి ఉండగా ఢిలీ కాంగ్రెస్ చీఫ్‌గా షీలాను ఎంపిక చేయడం ఆసక్తికరంగా మారింది. కాగా, షీలా ఎంపికపై అజయ్ మాకెన్ హర్షం వ్యక్తం చేశారు. షీలాకు శుభాకాంక్షలు తెలిపారు.

'ఆ నలుగురు' కాదు... 500మంది

- కన్నీరు పెట్టిన గ్రామస్తులు



రాయ్‌పూర్: మనిషి చనిపోతే కుటుంబీకులు, బంధువులె రాని రోజులు. అటువంటిది చత్తీస్‌గఢ్‌లో ఓ మొసలి అంత్యక్రియలకు సుమారు ఐదువందలకు మందికి పైగా గ్రామస్తులు హాజరయ్యారు. వివరాల్లో కెళితే...ఛత్తీస్‌ఘర్‌లోని భవమోహత్ర గ్రామంలో మొసలికి అంత్యక్రియలు చేశారు. తాము ప్రేమగా చూసుకునే గంగారాం(మొసలి) మరణించడంతో గ్రామస్తులంతా స్థానిక చెరువు వద్దకు చేరుకుని శోకించారు. అనంతరం ఆ మొసలిని ఖననం చేశారు. దీనిపై గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ... తమ పిల్లలు ఆ చెరువులో మొసలితో పాటే ఈత కొట్టేవారనీ కానీ ఏనాడు అది తమ పిల్లలకు ఎటువంటి హానీ చేయలేదని తెలిపారు. తాము మొసలిని ఒక స్నేహితుని వలే చూసేవాళ్లమని అన్నారు.కాగా ఈ మొసలి వయసు 130 ఏండ్లు ఉంటుందని అటవి అధికారులు తెలిపారు. ఈ మొసలితో గ్రామస్తులకు మంచి అనుబంధం ఉందని తెలిపారు. అందుకే పోస్టుమార్టమ్ అనంతరం మొసలిని గ్రామస్తులకు అప్పగించామని వారు తెలిపారు.

పోలీస్ ఎస్కార్ట్ లేదు.. నిరసనలూ లేవు..

తలకు రంగేసుకుని 'శబరిమల'లోకి వెళ్లాను : దళిత మహిళ




అన్ని వయసుల మహిళలనూ ఆలయంలోకి అనుమతిస్తూ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో హిందూత్వశక్తులు కేరళలో

తిరువనంతపురం : పోలీసు ఎస్కార్ట్ లేదు.. నిరసనలు అంతకంటే లేవు.. దళిత మహిళ (39) శబరిమల ఆలయంలోకి ప్రవేశించి అయ్యప్పస్వామి దర్శనం చేసుకున్నారు. అయితే ఆమె చాకచక్యంగా వ్యవహరించారు. తన వయస్సు కనపడకుండా తలకు తెల్లరంగు వేసుకొని ఆలయంలోకి అడుగుపెట్టారు. పెద్దవయసురాలిగా కనిపిస్తుండటంతో ఆమెకు ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. హింసాత్మకదాడులకు తెగబడుతున్న విషయం తెలిసిందే. కొల్లాం జిల్లా చంతనూర్‌కు చెందిన దళిత మహిళ, సామాజిక కార్యకర్త మంజు తాను ఆలయంలోకి వెళ్ళానని ఫేస్‌బుక్‌లో ట్వీట్ చేశారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను కూడా పోస్టుచేశారు. త్రిసూర్ నుంచి బేస్ క్యాంప్‌కు మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు చేరుకున్నాననీ, అక్కడి నుంచి ఇతర యాత్రికులతో కలిసి లోపలికివెళ్ళినట్టు తెలిపారు. తలకు తెల్లరంగు వేసుకోవడంతో తనను చూసిన ఆందోళనకారులు పెద్దవయసు స్త్రీగా భావించారనీ, ఆలయంలోకి వెళ్లేందుకు అడ్డు చెప్పలేదని తెలిపారు. ఆలయంలో సన్నిధానంలో దాదాపు 2 గంటలపాటు గడిపినట్టు మంజు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం మంజు రెండుసార్లు ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే హిందూత్వశక్తుల నిరసనలతో ఆమె వెనక్కి తిరగాల్సి వచ్చింది. 'నిరసనలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా వున్నాను. సంఘ్ పరివార్, ఆలయంలోకి మహిళలు వెళ్లడాన్ని వ్యతిరేకిస్తున్న వారి నుంచి దాడులు జరుగుతాయేమోనన్న ఆందోళన ఉంది. మా ఇంటి వద్ద పోలీసులు రక్షణ కల్పించారు' అని మంజు తెలిపింది. 'సామాజిక మాధ్యమంలో వీడియో చూశాం. పోలీసుల సహకారం లేకుండా సాధారణ మార్గం గుండా ఆమె వెళ్ళడం కనిపించింది. ఆమె చెబుతున్నదాంట్లో సందేహించాల్సినదేమీ లేదు. మమ్మల్ని సంప్రదించినవారికి మేం రక్షణ కల్పిస్తున్నాం' అని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

అయోధ్య కేసు మళ్లీ వాయిదా

జస్టిస్ యు లలిత్ తప్పుకోవడంతో విచారణలో కొత్త మలుపు



న్యూఢిల్లీ: అయోధ్య భూ వివాదం కేసు విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ కేసులో వాదనలు వినేందుకు ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం నుంచి జస్టిస్ యు లలిత్ తప్పుకోవడంతో రామ జన్మభూమి-బాబ్రీ మసీదుల స్థల వివాదం విచారణ మళ్లీ వాయిదా పడింది. అలహాబాద్ హైకోర్టు గతంలో వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టడానికి సుప్రీంకోర్టు.. చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గురువారం విచారణ ప్రారంభం కాగా.. ధర్మాసనంలో జస్టిస్ యు.లలిత్ ఉండటంపై న్యాయవాది రాజీవ్ ధవన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. లలిత్.. గతంలో ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కళ్యాణ్‌సింగ్ తరఫున ఇదే కేసులో వాదించారు. బెంచ్‌లో లలిత్ ఉండటంపై ధవన్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆయన తప్పుకున్నారు. దీంతో, ఈ కేసులో విచారణను వాయిదా వేస్తున్నట్టు కోర్టు తెలిపింది. ఈ నెల 29 నుంచి కొత్త ధర్మాసనం విచారణ చేపడుతుందని న్యాయస్థానం వెల్లడించింది. అయితే, కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా అయోధ్యలో రామ మందిరాన్ని చేపట్టేలా కేంద్రం ఆర్డినెన్స్ తీసుకురావాలని ఆరెస్సెస్, వీహెచ్‌పీ, పలు హిందూ అతివాద సంఘాలు కొన్ని రోజులుగా బీజేపీని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో విచారణ వాయిదా పడటం మోడీ సర్కారుని మరింత ఇబ్బందులలోకి నెట్టింది. ఇదే అంశంపై ఇటీవల ప్రధాని మోడీ మాట్లాడుతూ.. న్యాయస్థానం విచారణ ముగిసిన తరువాతే అయోధ్యపై ఎలాంటి నిర్ణయమైనా తీసుకుంటామని వెల్లడించిన సంగతి తెలిసిందే.

బెస్ట్ కార్మికులపై కక్షపూరిత చర్యలు మానండి

- సీఐటీయూ, పీయూసీఎల్ డిమాండ్



ముంబయి : మహారాష్ట్ర నిత్యావసర సేవల నిర్వహణా చట్టం (మెస్మా) కింద 300మంది కార్మికులకు జారీ చేసిన నోటీసులను బృహన్ ముంబయి విద్యుత్ సరఫరా, రవాణా (బెస్ట్) సంస్థ ఉపసంహరించుకోవాలని ప్రజా పౌర హక్కుల యూనియన్ (పీయూసీఎల్) మహారాష్ట్ర శాఖ డిమాండ్ చేసింది. బెస్ట్ క్వార్టర్లలో నివసిస్తున్న 2వేల మంది కార్మిక కుటుంబాలను ఖాళీ చేయాలంటూ ఇచ్చిన నోటీసులను కూడా ఉపసంహరించాలని కోరింది. సమ్మె చేస్తున్న బెస్ట్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి వారిపై నిరంకుశమైన మెస్మా నిబంధనలను ప్రయోగించాలని చూడడం విచారకరమని పీయూసీఎల్ మహారాష్ట్ర శాఖ పేర్కొంది. ఈ వార్తలు తమకు దిగ్భ్రాంతి కలిగించాయని తెలిపింది. సమ్మె చేస్తున్న కార్మికులకు సంఘీభావాన్ని ప్రకటించింది. తక్షణమే సమ్మె చేస్తున్న కార్మికులతో చర్చలు జరపాల్సిందిగా బెస్ట్ యాజమాన్యాన్ని కోరింది. ముంబయిలో ప్రభుత్వ రవాణాను మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. గురువారానికి బెస్ట్ కార్మికులు చేస్తున్న సమ్మె మూడవ రోజుకు చేరింది. తమను క్వార్టర్లు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయడంపై నిరసన తెలియచేస్తూ వాడాలా తూర్పు శివార్లలోని బెస్ట్ డిపో వద్ద 300మందికి పైగా కార్మిక కుటుంబాలు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా బెస్ట్ కార్మిక సంఘం నేత శశాంక్ రావు మాట్లాడుతూ, తాము ఏ రాజకీయ పార్టీ వద్దకు వెళ్ళబోమని చెప్పారు. కఠోర శ్రమ చేసే కార్మికుల పోరాటమిదని అన్నారు. గురువారం బెస్ట్ డిపో నుండి ఒక్క బస్సు కూడా తిరగలేదు.

ముఖ్యమంత్రికి సీఐటీయూ లేఖ

బెస్ట్ యాజమాన్యం కక్షపూరిత చర్యల పట్ల సీఐటీయూ ఆందోళన వ్యక్తం చేసింది. వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని తక్షణమే కార్మికులకు జారీ చేసిన నోటీసులను ఉపసంహరించుకునేలా చూడాలని కోరింది.

ఈబీసీ కోటాపై సుప్రీంకోర్టులో సవాలు



న్యూఢిల్లీ: జనరల్ కేటగిరీ పేదలకు విద్య, ఉద్యోగావకాశాలలో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదించిన బిల్లును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో గురువారం పిటిషన్లు దాఖలయ్యాయి. యూత్ ఫర్ ఈక్వాలిటీ అనే సంస్థతో పాటు కౌశల్ కాంత్ మిశ్రా ఈ పిటిషన్‌లు దాఖలు చేశారు. రిజర్వేషన్లకు కేవలం ఆర్థిక వెనుకబాటుతనమే ప్రాతిపదిక కాదని, అందువల్ల ఈ బిల్లును కొట్టేయాలని పిటిషనర్లు కోర్టును అభ్యర్థించారు. జనరల్ కేటగిరీ వర్గాలకు ఆర్థిక పరమైన రిజర్వేషన్లను పరిమితం చేయరాదని, 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని మించరాదన్న రాజ్యాంగ మౌలిక లక్షణాలను ఈ బిల్లు ఉల్లంఘిస్తోందని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ బిల్లును మంగళవారం లోక్‌సభ ఆమోదించగా, బుధవారం నాడు రాజ్యసభ ఆమోదించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గా(ఓబీసీ)లకు అమలు చేస్తున్న 50 శాతం రిజర్వేషన్లకు ఈ ప్రతిపాదిత పది శాతం కోటా అదనం. ఈ అదనపు రిజర్వేషన్ల విధానాన్ని సుప్రీంకోర్టు వ్యతిరేకిస్తే ప్రస్తుత రిజర్వేషన్ల పరిధిలోనే అదనపు కోటాను ఏర్పాటుచేయాల్సి వుంటుంది.

ఎవరికి వర్తిస్తుంది?

ప్రస్తుత రిజర్వేషన్లేవీ వర్తించని వర్గాలలో వార్షికాదాయం రు.8 లక్షల లోపు లేదా 5 ఎకరాల లోపు వ్యవసాయ భూమి వున్న వారికి మాత్రమే ఈ అదనపు రిజర్వేషన్లు వర్తిస్తాయి. నోటిఫైడ్ మున్సిపల్ ప్రాంతంలో వెయ్యి చదరపు అడుగులు లేదా 100 చదరపు గజాల విస్తీర్ణంలో ఇల్లు లేదా ఇంటి స్థలం వున్న వారు, నాన్ నోటిఫైడ్ మున్సిపాల్టీలో 200 గజాల ప్లాట్ వున్న వారు కూడా ఈ రిజర్వేషన్లకు అర్హులు కారు.

'న్యాయమూర్తి నివేదికను పిటిషనర్లకు ఇవ్వలేం'

అహ్మదాబాద్ : గుజరాత్‌లో జరిగిన 17 పోలీసు ఎన్‌కౌంటర్లపై జస్టిస్ హెచ్.ఎస్.బేడి ఇచ్చిన నివేదికను పిటిషనర్లకు అందచేయలేమంటూ గుజరాత్ పోలీసు అధికారి ఒకరు సుప్రీం కోర్టుకు తెలిపారు. క్రిమినల్ దర్యాప్తు సందర్భంగా సేకరించిన సాక్ష్యాధారాలను విశ్లేషించడానికి కొత్తవారిని అనుమతించలేమని, వారికి నివేదికలు అందచేయలేమని ఆ అధికారి చెప్పారు. నివేదిక కాపీని పిటిషనర్లకు అందచేయాలని బుధవారం సుప్రీంకోర్టు గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్రంలో జరిగిన ఒక ఎన్‌కౌంటర్ విషయంలో సుప్రీం కోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తును ఎదుర్కొన్న డీఎస్‌పీ జె.ఎం.భర్వాద్ కోర్టుకు అందచేసిన అఫిడవిట్‌లో ఈ విషయం పేర్కొన్నారు. నివేదిక కాపీలను పిటిషనర్లకు అందచేసినట్టైతే పోలీసు అధికారుల తప్పు వుందా లేదా అనే విషయాలపై చర్చకు అవకాశం ఇచ్చినట్లవుతుందని అభిప్రాయపడ్డారు.

తాలిబన్లతో చర్చలకు సిద్ధమైనప్పుడు..

వేర్పాటువాదులంటే వెనుకడుగెందుకు?

- కేంద్రానికి కాశ్మీర్ మాజీ సీఎంల ప్రశ్నాస్త్రం

న్యూఢిల్లీ: అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్లతో చర్చలు జరపాలని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ సూచిస్తున్నప్పుడు జమ్మూకాశ్మీర్‌లోని వేర్పాటువాదులతో చర్చలు జరిపేందుకు కేంద్రం ఎందుకు ముందడుగు వేయట్లేదని ఆ రాష్ట్ర మాజీ సీఎంలు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ ప్రశ్నించారు. 'తాలిబన్లతో చర్చలు జరపాలని సూచిస్తాం. కానీ జమ్మూకాశ్మీర్‌లో రాజకీయ పరిష్కారాలపైన దృష్టిపెట్టబోం' అని ఒమర్ అబ్దుల్లా ట్వీట్ చేశారు. 'మేం చెప్పింది చేయండి. మేం చేస్తున్నది కాదు' అనే తరహాలో మన పాలసీలు ఎందుకు ఉంటాయని ప్రశ్నించారు. తాలిబన్లు అయితే పరిష్కారాలు, కాశ్మీర్ అంటే ఆపరేషన్ ఆలౌటా? అని విమర్శించారు. తాలిబన్లతో చర్చలు జరపాలని ఆర్మీ చీఫ్ అభిప్రాయపడుతున్నప్పుడు.. సొంత ప్రజలపై ఎందుకు విరుద్ధ వైఖరి ఎందుకు? అని మెహబూబా ముఫ్తీ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. జమ్మూకాశ్మీర్‌లో హింసకు చరమగీతం పాడేందుకు పాకిస్థాన్ ప్రతిపాదనలు స్వీకరించి చర్చలు జరపాలని, అలాగే హురియత్ కాన్ఫరెన్స్‌తోనూ చర్చించాలని పీడీపీ అధ్యక్షులు మెహబూబా ముఫ్తీ.. కేంద్రాన్ని కోరారు. అఫ్ఘానిస్థాన్‌లో శాంతియుత వాతావరణం ఏర్పడాలంటే షరతుల్లేకుండా తాలిబన్లతో చర్చలు జరపాలని ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఒమర్, మెహబూబా ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈ ఏడాదిలో ఎయిరిండియా అమ్మకం!

- ఏడు వేల కోట్ల ఆర్జనపై కేంద్రం గురి



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేసేందుకు మోడీ సర్కారు వడివడిగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే నష్టాల్లో కూరుకుపోయిన ప్రభుత్వ విమానయాన సంస్థ ఎయిరిండియా వాటాలను ఈ ఏడాది ద్వితీయార్థంలో విక్రయించేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసుకుంది. ఈ వాటాల విక్రయం ద్వారా రూ. 7వేల కోట్లను ఆర్జించడంపై గురిపెట్టింది. 2019-20 ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణను చేపడుతున్నట్టు ఓ అధికారి మీడియాకు తెలిపారు. అంతలోపు ఎయిరిండియా అనుబంధ కంపెనీలను అమ్మేసేందుకు యోచిస్తున్నట్టు వివరించారు. ఎయిరిండియా వాటాల విక్రయం ద్వారా ఏడు వేల కోట్ల రూపాయలను ఆర్జించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ప్రస్తుతం ఎయిరిండియాకు రూ. 55వేల కోట్ల అప్పుభారం ఉంది. గతేడాది నవంబర్‌లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని కమిటీ.. రూ. 29వేల కోట్ల అప్పును ఎయిరిండియా అస్సెట్ హోల్డింగ్ కంపెనీ స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్పీవీ)కి బదలాయించింది. కేంద్ర ప్రభుత్వం తొలుత 76శాతం కంపెనీ షేర్లను, యాజమాన్య నియంత్రణను ప్రయివేటుపరం చేసేందుకు ప్రణాళికలు వేసింది. ఇందుకోసం కొనుగోలుదార్లు.. రూ. 24వేల కోట్ల అప్పుతోపాటు ఎనిమిది వేల కోట్ల లయబిలిటీలను టేకోవర్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే కొనుగోలుదార్లు ఆసక్తిచూపకపోవడంతో ఎయిరిండియా వాటాల విక్రయం కార్యరూపం దాల్చలేదు. దీంతో జైట్లీ ప్యానెల్ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. ఎయిరిండియా ఆస్తులు, ఇతర సబ్సిడరీలను అమ్మేసి సంస్థ అప్పులను తగ్గించాలని, అలాగే సంస్థలోకి నిధులనూ ప్రవేశపెట్టాలని జూన్‌లో నిర్ణయించింది. గతేడాది ఆగస్టులో 980 కోట్ల ఈక్విటీని, ఈ నెలలో రూ. 2,345 కోట్ల ఈక్విటీని ఎయిరిండియాలోకి ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం పార్లమెంట్ ఆమోదం పొందింది. కాగా, సంస్థ గ్రౌండ్ హ్యాండ్లింగ్ సబ్సిడరీ, ఎయిర్ ట్రాన్స్‌పోర్టు సర్వీసెస్‌లను వ్యూహాత్మక అమ్మకాలకు మంత్రిత్వ ప్యానెల్ ఇదివరకే లైన్ క్లియర్ చేసింది. ఎయిరిండియా ఇంజనీరింగ్ సర్వీసెస్‌నూ అమ్మేసే ప్రణాళికనూ రచిస్తోంది. భూమి, భవనాలు, అనుబంధ సంస్థల అమ్మకాల ద్వారా ఆర్జించిన సొమ్ము ఎస్పీవీకి చేరనుంది. ఇది సంస్థ అప్పును తగ్గించేందుకు వినియోగిస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న సంస్థ ఆస్తులను అమ్మేందుకు ఎయిరిండియా గతేడాది సెప్టెంబర్‌లో బిడ్లను ఆహ్వానించిన సంగతి తెలిసిందే.

కుంభమేళా కోసమని...

60 చెరకు ఫ్యాక్టరీలకు యూపీ సర్కారు మూసివేత నోటీసులు



తోళ్ల శుద్ధి కర్మాగారాలు.. పేపర్ మిల్లులకూ..

- పంట చేతికొచ్చే దశలో రైతులకు తీవ్ర అన్యాయం

లక్నో: తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఓవైపు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ఉత్తరప్రదేశ్‌లోని యోగీ సర్కారు మాత్రం వారి సంక్షేమానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్నది. మరికొన్ని రోజుల్లో యూపీలో నిర్వహించబోయే కుంభమేళా కోసం.. గంగా, యమునా నదుల సమీపంలో ఉన్న 60 చెరకు ఫ్యాక్టరీలను మూసివేయాలని నోటీసులు జారీ చేసింది. దీనికి సంబంధించి ఈ నెల 8న ఉత్తర్వులను జారీ చేసింది. చెరకు ఫ్యాక్టరీలే గాక దాని అనుబంధ పరిశ్రమలైన పేపర్ మిల్లులు, సారాయి పరిశ్రమలతో పాటు తోళ్ల శుద్ధి కర్మాగారాలను కూడా మూసివేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కుంభమేళాకు వచ్చే భక్తులకు శుద్ధి నీటిని అందించే ఉద్దేశంతో మూడు నెలల పాటు ఈ పరిశ్రమలకు మూసివేత నోటీసులను అందించామని చెబుతున్నా.. ఫ్యాక్టరీలను శాశ్వతంగా మూసివేసేందుకే యోగీ సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నదని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.



ఉత్తరప్రదేశ్‌లో ప్రధాన పంటగా ఉన్న చెరకు.. పశ్చిమ యూపీలోని బిజ్నూర్, షమ్లి, ముజఫర్‌పూర్ తదితర జిల్లాలలో అధికంగా పండుతోంది. ప్రస్తుతం పంట చేతికొచ్చే దశలో ఉంది. ఈ మాసాంతం నుంచి కోతలు మొదలవ్వనున్నాయి. అయితే, యోగీ సర్కారు తీసుకున్న నిర్ణయం కారణంగా చెరకు రైతులందరూ తీవ్రంగా నష్టపోనున్నారు. మూడు నెలలపాటు ఫ్యాక్టరీలను (కుంభమేళా ముగిసేవరకు) మూసివేస్తూ నోటీసులు జారీ చేయడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. మూడు నెలల దాకా పంటను కాపాడుకోవడమెలాగని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి కాలుష్యం పేరిట బీజేపీ సర్కారు తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆలిండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) జాయింట్ సెక్రటరీ ఎన్.కె. శుక్లా తప్పుబట్టారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు ఇది నిదర్శనమని అన్నారు. దీని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. రైతులతో పాటు ఈ ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న కార్మికుల కుటుంబాలు కూడా రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐకేఎస్ యూపీ మాజీ అధ్యక్షుడు డిపి సింగ్ మాట్లాడుతూ.. ఫ్యాక్టరీలను మూసివేయడానికి యోగీ సర్కారు వేసిన ఎత్తుగడగా దీనిని అభివర్ణించారు. ఈ మిల్లులన్నీ గత కొన్ని రోజులుగా చెరుకు రైతులకు బకాయిలను చెల్లించడం లేదని, ఈ నిర్ణయాన్ని సాకుగా చూపి వాటిని ఎగ్గొట్టేందుకు యోగీ సర్కారు, ఫ్యాక్టరీ యాజమాన్యాలు కలిసి ఆడుతున్న నాటకమని సింగ్ ఆరోపించారు.

పేపర్ మిల్లులకు రూ. 3 వేల కోట్లకు పైగా నష్టం

మూడు నెలలు పేపర్ మిల్లుల మూసివేస్తే తమకు రూ. 3,600 కోట్ల నష్టం వాటిల్లుతుందని ఎన్‌సీఆర్ పేపర్ మిల్లుల అసోషియేషన్ ఎండీ అరవింద్ అగర్వాల్ చెప్పారు. రోజుకు రూ. 40 కోట్ల మేర నష్టం, రోజుకు 15 వేల టన్నుల ఉత్పత్తి ఆగిపోతుందని తెలిపారు. ఇది తీవ్రంగా కలవరపెట్టే అంశమని చెప్పారు. పేపర్ ఉత్పత్తి కోసం బయ్యర్ల వద్ద భారీగా ముడిసరుకును కొనుగోలు చేశామని.. ప్రభుత్వ నిర్ణయంతో వారికి ఏం సమాధానం చెబుతామని ఆందోళన చెందారు. దీని కారణంగా ఈ పరిశ్రమలలో పనిచేసే కార్మికులు కూడా తీవ్రంగా నష్టపోనున్నారని ఆయన తెలిపారు.

తోళ్ల పరిశ్రమలు సైతం...

కాన్పూర్‌లో ప్రధాన వృత్తిగా ఉన్న తోళ్ల పరిశ్రమలను సైతం కుంభమేళ ముగిసేవరకూ మూసివేయాలని బీజేపీ సర్కారు ఆదేశించింది. దీంతో, దినసరి కూలీలు, సంబంధిత పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులు ఉపాధిని కోల్పోనున్నారు. వీరికి ప్రత్యామ్నాయ ఉపాధిని చూపకుండానే తోళ్ల పరిశ్రమలను మూసివేయించింది యోగీ సర్కారు.

మోడీ పాలనలోనే 'గంగ' మరింత కలుషితం

నీటి కాలుష్యం పేరిట గంగా, యమునా, సరస్వతి నదుల చుట్టూ ఉన్న పరిశ్రమలను మోడీ సర్కారు మూసివేయిస్తోంది. కానీ, మోడీ అధికారంలోకి వచ్చిన తరువాతే గంగా నది మునుపటి కంటే మరింత కాలుష్యమయమైందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. 2014లో మోడీ అధికారం చేపట్టాక గంగా నదిని శుద్ధి చేసే ఉద్దేశంతో 'నమామి గంగా' ప్రాజెక్టును ప్రకటించారు. కానీ, దీనిపై ఇంతవరకూ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. కాగా, మోడీ నియోజకవర్గమైన వారణాసిలో ప్రవహించే గంగా నదిలోని నీటిని పరీక్ష చేయగా.. గతంలో కంటే నీటి కాలుష్యం అధికంగా ఉన్నదని తేలింది.

బిల్లులకు నిధుల్లేవు

సచివాలయం చుట్టూ వర్కింగ్ ఏజెన్సీలు

- పెండింగ్ బకాయిలు రూ.7700 కోట్ల పైమాటే ?
- ఆందోళనలో కాంట్రాక్టర్లు





నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ధనిక రాష్ట్రంగా పేరుగాంచిన తెలంగాణ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. వర్కింగ్ ఏజెన్సీలకు బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు డబ్బులు ఎప్పుడు వస్తాయోనన్న ఆందోళనలోపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు కాస్తా 13 నెలలుగా పెండింగ్‌లో ఉన్నట్టు వర్కింగ్ ఏజెన్సీలు చెబుతున్నాయి. దీంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో జరగాల్సిన అభివృద్ధి పనులు ఆగిపోయినట్టు సమాచారం. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులను సర్దుబాటు చేయలేక ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. వెరసి రాష్ట్ర ప్రభుత్వం నేడు కాంట్రాక్టర్లకు రూ. 7700 కోట్లకుపైగా బిల్లుల కింద చెల్లించాల్సి ఉన్నట్టు తెలిసింది. ఈ బిల్లులన్నీ ప్రధాన శాఖల్లో పెండింగ్‌లో ఉండటం గమనార్హం. మిషన్ కాకతీయతోపాటు రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, వైద్యఆరోగ్య, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్, విద్యా, సంక్షేమం, మిషన్ భగీరథ తదితర శాఖల్లోని పనులకు ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేని పరిస్థితి ఉంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అపాయింట్‌మెంటు కోసం కాంట్రాక్టర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోయాయని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ ఉన్నతాధికారి తెలిపారు. సీఎం అపాయింట్‌మెంటు దొరకని నేపథ్యంలో పలుమార్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.కే జోషీ, ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణారావును కలిసినా ఓదార్పు మాటలు తప్ప, నిధులు విదల్చడం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. కాంట్రాక్టర్ల అసోసియేషన్ తరపున వారికి పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. సచివాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నామని అంటున్నారు. అయినా కదలిక లేకపోవడంతో ఒకింత ఆందోళనలో పడ్డారు. ఒక్కో కాంట్రాక్టరుకు రూ. 20 నుంచి రూ. 50 కోట్ల వరకు సర్కారు నుంచి బిల్లులు రావాలని తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాల కాంట్రాక్టు లైసెన్సలను కలిగి ఉన్న కాంట్రాక్టర్లు మొత్తం 10 వేల మంది వరకు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయినట్టు తెలంగాణ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అభిప్రాయపడుతున్నది. బిల్లులు ఇవ్వకపోతే కాంట్రాక్టర్ల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాది. తాము పనులు చేస్తే కనీసం 10 శాతం లాభం కింద రావాలనీ, బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న ఆలస్యం మూలంగా రెండు నుంచి మూడు శాతం కూడా మిగలడం లేదని ఓ కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తం చేశాడు. చివరకు సంక్రాంతి పండుగ రోజు తమ ఉద్యోగులు, సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నామని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం సాగునీటి శాఖలో రూ. 6000 కోట్లు, పంచాయతీరాజ్‌లో రూ. 350 కోట్లు , రోడ్లు, భవనాల శాఖలో రూ. 500 కోట్లు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్, వైద్య ,ఆరోగ్యశాఖ, విద్య, సంక్షేమ శాఖల్లో దాదాపు రూ. 300 కోట్ల మేర కాంట్రాక్టర్లకు బిల్లులు రావాల్సి ఉన్నట్టు సమాచారం. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ బకాయిలు దాదాపు రూ. 600 కోట్ల వరకు ఉన్నాయని వర్కింగ్ ఏజెన్సీలు అంటున్నాయి.

సర్పంచ్ పదవులు 4,479.. నామినేషన్లు 27,940

- 39,822 వార్డులకు 76,789 నామినేషన్లు
- తొలి విడత పంచాయతీకి భారీగా నామినేషన్లు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

తొలి విడత పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల వరద పారింది. మొదటి విడతలో జరగనున్న 4,479 సర్పంచ్ పదవులకు 27,940 నామినేషన్లు, 39,822 వార్డులకు 97,690 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణకు చివరి రోజైన బుధవారం రోజున సర్పంచ్ పదవుల కోసం 19,461 నామినేషన్లు, వార్డులకు 76,789 నామినేషన్లు వచ్చాయి. గురువారం నామినేషన్ల పరిశీలన పూర్తయ్యింది. తిరస్కరణలకు సంబంధించి శుక్రవారం ఆర్డీవోలకు ఫిర్యాదు చేసుకోవాలి. అప్పీళ్లను శనివారం పరిష్కరిస్తారు. ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉప సంహరణకు గడువు ఉంది. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను రిటర్నింగ్ అధికారులు ప్రకటిస్తారు. ఎక్కడైనా పోటీ లేకపోతే ఎన్నిక ఏకగ్రీవమైనట్టు స్టేజ్ –1 అధికారులు ప్రకటిస్తారు. సర్పంచ్ పదవితో పాటు వార్డు సభ్యుల పదవులన్నీ ఏకగ్రీవమైతే ఆదివారం నాడు ఉప సర్పంచ్ ఎన్నిక చేపడతారు. మిగతా ప్రాంతాల్లో ఈ నెల 21 పోలింగ్ జరగనుంది.

వేలం పాట నిర్వహిస్తే కేసులే

పంచాయతీ ఎన్నికల్లో పదవుల వేలం నిర్వహిస్తే కేసులు తప్పవని ఎన్నికల సంఘం హెచ్చరించింది. పదవులు వేలం వేసినా, సంబంధిత అ భ్యర్థులు అక్రమాలకు పాల్పడినా, ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్ర యత్నాలు చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఇలాంటి ఘటనలు జరిగితే చర్యలు తీసుకోవాలంటూ పోలీస్ డైరెక్టర్ జ నరల్ మహేందర్‌రెడ్డికి ఎన్నికలసంఘం లేఖ రాసింది. దీనిపై అన్ని జిల్లాల పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఎస్ఈసీకి విజ్ఞప్తి చేసింది.

ఆరు నెలల శిశువుకు లివర్ మార్పిడి

- గ్లెనిగల్స్ గ్లోబల్ ఆస్పత్రి వైద్యుల ఘనత



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

హైదరాబాద్ గ్లెనిగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్ వైద్యులు అరుదైన ఘనత సాధించారు. 'మ్యాపిల్ సిరప్ యూరిన్ వ్యాధి'తో బాధపడుతున్న ఆరు నెలల శిశువుగా లివర్ మార్పిడి చేసి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. పాపకు లివర్ మార్పిడి ఒక్కటే మార్గమని గుర్తించడంతో ఈ శస్త్రచికిత్స చేసినట్టు వైద్యులు తెలిపారు. శిశువు పూర్తిగా కోలుకున్నదని అన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. గతేడాది జూన్ 18 జన్మించిన బేబీ మైథిలికి తరచూ ఫిట్స్ వచ్చేది. ఈ సమస్యను మందులతో కంట్రోల్ చేయలేని పరిస్థితి. ఎంఆర్ఐ స్కాన్ చేసి పరిశీలించగా శిశువు శరీరంలో అమైనో యాసిడ్స్ శాతం పెరగడం, దీని ప్రభావం మెదడుపై పడటంతో మ్యాపిల్ సీవర్ యూరిన్ వ్యాధిగా మార్పుచెందింది. దీన్ని కంట్రోల్ చేసేందుకు ప్రత్యేకమైన (ఎంస్‌యూడీ) ఆహారాన్ని తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు ఫిట్స్ సమస్య ఎక్కువవుతుండటంతో చూపు, వినికిడిపై కూడా ప్రభావం ప్రారంభమైంది. శరీరంలో మెటబాలిక్ సమస్యలు తలెత్తుతుండటంతో వైద్యులు లీవర్ మార్పిడి శస్త్రచికిత్స చేయాలని నిర్ధారించారు.

ఈ సందర్భంగా లక్డీకపూల్ గ్లోబల్ ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ అండ్ హెచ్‌పీబీ లివర్ సర్జరీ డాక్టర్ బల్బీర్ సింగ్ మాట్లాడుతూ ఎంఎస్‌యూడీ అనేది ఒక జన్యుపరమైన వ్యాధి అని, బ్రాంచ్ అమైనో యాసిడ్స్‌గా పేర్కొనే కొన్ని అమైనో ఆమ్లాలు జీవక్రియలకు, పిల్లల నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతాయి. ఇదే పరిస్థితి శిశువు విషయంలోనూ జరిగిందని వివరించారు. ఎంఎస్‌యూడీ ప్రభావంతో మూత్రం మ్యాపిల్ సిరప్, మరిగించిన వాసన రావడం మొదలైంది. పాపకు సాధారణ ఆహారాన్ని తీసుకోలేకపోయింది. నాడీ వ్యవస్థపై ప్రభావం చూపడంతోపాటు నసుస్యలు సీనియర్ కన్సల్టెంట్ హెచ్‌పీబీ సర్జరీ అండ్ లీవర్ మార్పిడి డాక్టర్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ శిశువు శస్త్రచికిత్సకు అనస్థీయాలో 10 గంటల సమయం పట్టిందని, తరువాత ఆరోగ్యం మెరుగుపడిందని తెలిపారు. నోటీతో కూడా ఆహారం తీసుకోగలుగుతోందన్నారు. రాబోయే రోజుల్లో పాప ఎదుగుదలలో ఎలాంటి ఇబ్బందులు రాబోవని తెలిపారు. ఉండబోవని డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. శస్త్రచికిత్స బృందాన్ని ఆసుత్రి చైర్మెన్ డాక్టర్ కె.రవీంద్రనాథ్ అభినందించారు. కార్యక్రమంలో పీడియాట్రిక్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్ డాక్టర్ ప్రశాంత్ భచిన, కన్సల్టెంట్ ఇంటెన్సివిస్టులు డాక్టర్ ఎస్.మోహన్, డాక్టర్ రవిచంద్ర రాయ, డాక్టర్ జె.గోపీకష్ణలు ఉన్నారు.


సంపాదకీయం

మాంద్యం దిశగా..

అమెరికా, చైనా మధ్య వాణిజ్య సంబంధాలు 'తెగిపోవటం' అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో ప్రధాన చర్చనీయాంశమైందని ఒక వ్యాఖ్యాత అన్నాడు. ఈ రెండు దేశాలు ఒక 'నూతన ప్రచ్ఛన్న యుద్ధం'లో మునిగిపోయాయి. పసిఫిక్‌పై ఒక 'ఉక్కు తెర'ను చైనా దించిందని అమెరికా మాజీ ఆర్థిక కార్యదర్శి హాన్క్ పాల్‌సన్ పేర్కొన్నాడు. అమెరికా రక్షిత విధానాలను అవలంబించటం వల్ల ప్రపంచంలోని ఈ రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్యగల అనేక రకాల ఆర్థిక సంబంధాలను ట్రంప్ పాలన తెగ్గొడుతున్నది. అయితే అలాంటి 'తెగతెంపులు' 21వ శతాబ్దపు ప్రపంచీకరింపబడిన ఆర్థిక వ్యవస్థను ఏ విధం గా ప్రభావితం చేయనున్నాయో గత వారంలో జరిగిన సంఘటనలు సూచిస్తున్నాయి.

అమెరికా నుంచి లాటిన్ అమెరికా దాకా, ఆ తరువాత బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, శ్రీలంక, ఇండియా దాకా ప్రజాపోరాటాలు విస్తృతంగా సాగాయి. పెట్టుబడిదారీ వాస్తవికతను అధిగమించటంలోనే మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలకు అంతిమ పరిష్కారం ఉందని గ్రహించే దిశగా ఈ పోరాటాలను కొనసాగించటమే నేటి కర్తవ్యం.

జర్మనీ, చైనా, జపాన్ దేశాలలో షేర్ల ధరలు, సరుకుల ధరలు పడిపోతున్నాయి. వినియోగ వ్యయం కుంచించుకుపోతోంది. కార్మికులు ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఆటో తదితర పరిశ్రమలు మూతపడుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని మాంద్యం అమెరికాకు వ్యాపిస్తోందని అమెరికా పాలకవర్గాలు భయపడుతున్నాయి. గత పదహారేండ్లలో మొట్టమొదటిసారిగా ప్రపంచంలో అత్యంత లాభసాటి కంపెనీ ఆపిల్ రాబోయే ఏడాదికి తన అమ్మకపు లక్ష్యాలను కుదించుకుంటున్నట్టు ప్రకటించింది. అమెరికా వాణిజ్య యుద్ధం కారణంగా చైనాలో మాంద్యం ఏర్పడబోతున్నదనే విషయాన్ని అందుకు కారణంగా ఆపిల్ చెబుతోంది. ఈ ప్రకటన వెలువడగానే డౌ మార్కెట్ 660పాయింట్లు పడిపోయింది. ఇది 1930వ దశకం తరువాత అత్యంత కనిష్టస్థాయికి మార్కెట్ దిగజారిందనే విషయాన్ని తెలియజేస్తోంది. డాట్ కాం బబుల్ పతనం తరువాత ఒక నూతన వాణిజ్య సంవత్సరంలో మొదటి రెండు రోజులు ఇంత దయనీయంగా ఎప్పుడూ లేవు.



చైనాపై చేస్తున్న వాణిజ్య యుద్ధం కారణంగా చైనాతోపాటు అమెరికాలోనూ మాంద్యం పరిస్థితులు ఏర్పడుతున్నాయి. 2008లో సంభవించిన ఆర్థిక సంక్షోభం తరువాత పారిశ్రామిక కార్యకలాపాలు ఒక నెలలో ఇంతగా పడిపోవటం ఇదే తొలిసారని ఐఎస్ఎమ్ పారిశ్రామిక సూచిక తెలియజేస్తున్నది. సుదీర్ఘ కాలంగా అమెరికా ఆర్థిక వ్యవస్థ క్రమేణా బలహీనపడటాన్ని, రాబోయే కాలంలో చైనా, ఇతర వర్ధమాన దేశాలతోపాటు అమెరికాకు మరింత లోతైన మాంద్యం ఎదురయ్యే అవకాశాన్ని ఈ పరిస్థితి సూచిస్తున్నది. అటువంటి మాంద్యానికి అంతర్జాతీయ స్వభావం ఉంటుంది. సదరు సంక్షోభానికి కారణభూతమైన ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించకపోవటంతో అప్పటికంటే మరింత తీవ్రమైన ఆర్థిక సంక్షోభం తలెత్తే అవకాశం ఏర్పడింది. బ్యాంకుల బ్యాలన్స్‌షీట్స్‌లో వున్న లోటును కేంద్రబ్యాంకు పరిమాణాత్మక వెసులుబాటు(క్వాంటిటేటివ్ ఈజింగ్), అత్యంత కనిష్ట వడ్డీరేట్లతో పూడ్చింది. 2008వ సంవత్సరం తరువాత ఆర్థిక పునరుత్తేజానికి కావాల్సిన ఆర్థిక వనరులను ప్రపంచ రుణాన్ని విస్తృతం చేయటంద్వారా సమకూర్చారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎమ్ఎఫ్) గత నెలలో ప్రచురించిన లెక్కల ప్రకారం ఈ రుణం చరిత్రలో ఎన్నడూలేనంత స్థాయిలో 184ట్రిల్లియన్ డాలర్లు(ఒక ట్రిల్లియన్ డాలర్లు రూ.70లక్షల కోట్లకు సమానం)గా ఉంది.

అయితే 2008సంక్షోభం సందర్భంగా ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నీ పరస్పరం సహకరించుకుని వాణిజ్య యుద్ధాన్ని నివారించగలిగాయి. అయితే ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. చైనాపైన, ఐరోపా ఖండంలోని మిత్రదేశాలతోసహా అనేక దేశాలపైన అమెరికా వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించింది. ఇటువంటి వాణిజ్య యుద్ధాలు తీవ్రమై 1930వ దశకంలో ప్రపంచాన్ని కుదిపిన మహామాంద్యం స్థాయి సంక్షోభం ఏర్పడే అవకాశం ఉంది. ఆధిపత్యం కోసం అగ్రరాజ్యాల మధ్య చెలరేగుతున్న పోటీ ఫలితంగా వాణిజ్య, సైనిక ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ ఘర్షణలు పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రపంచ ఉత్పత్తికి, జాతి రాజ్యానికి మధ్య గల మౌలిక వైరుధ్యాలు తీవ్రం కావటాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఆర్థిక జీవితం, ప్రపంచ ప్రజల పరస్పర సంబంధాలు, విజ్ఞానశాస్త్ర పరిశోధనలు చరిత్రలో ఎన్నడూలేనంత అంతర్జాతీయంగా కలగలిసి సాగుతున్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా పాలకవర్గాలు జాతీయ వాణిజ్య విధానాలను అమలు చేస్తున్నాయి. సైనిక సంపత్తి సమకూర్చుకుంటున్నాయి.

2008లో సంభవించిన ఆర్థిక సంక్షోభభారాన్ని పాలకవర్గాలు కార్మికవర్గం భరించేలా చేశాయి. బ్యాంకులకు ఇచ్చిన ఉద్దీపనలు, నియంత్రణలు ఎత్తివేయటం, పన్ను రాయితీల వంటి చర్యల కారణంగా ద్రవ్య పెట్టుబడిదారుల పెట్టుబడులు రెండు, మూడు రెట్లు పెరిగాయి. అదే కాలంలో కార్మికవర్గానికి అందుతున్న వేతనాలు క్షీణించాయి లేదా స్థబ్దంగా ఉన్నాయి. ఆర్థిక సంక్షోభ కాలంలో ప్రజలపై నిర్దాక్షిణ్యంగా రుద్దిన మిత వ్యయ విధానాన్ని వర్తమానంలో మరింత కౄరంగా అమలు చేయటం జరుగుతుంది.

అయితే గత దశాబ్ద కాలంలో సంక్షోభంతోపాటు వర్గ పోరాటం కూడా తీవ్రమైంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలలో అనేక పోరాటాలు జరిగాయి. అమెరికా నుంచి లాటిన్ అమెరికా దాకా, ఆ తరువాత బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, శ్రీలంక, ఇండియా దాకా ప్రజాపోరాటాలు విస్తృతంగా సాగాయి. పెట్టుబడిదారీ వాస్తవికతను అధిగమించటంలోనే మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలకు అంతిమ పరిష్కారం ఉందని గ్రహించే దిశగా ఈ పోరాటాలను కొనసాగించటమే నేటి కర్తవ్యం.

ఆధునిక విజ్ఞానానికీ వేదాలకూ సంబంధం లేదు




డాక్టర్ దేవరాజు మహారాజు

ఆధునిక విజ్ఞాన శాస్త్రానికీ వేదాలకూ, పురాణ గ్రంథాలకూ ఏదో ఒక గట్టి సంబంధం ఉందని హిందూ మత జాతీయవాదులు ప్రచారం చేస్తుంటారు. పూర్వ కాలపు భారతీయ రుషులు అందించిన గొప్ప ఆధ్యాత్మిక జ్ఞానం ముందు పశ్చిమ దేశాల నుండి మనకు అందిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఏ మాత్రం గొప్పది కాదని చెబుతుంటారు. వీళ్లు చెప్పే మాటలకు భారతీయులంతా రొమ్ము విరుచుకుని గర్వపడాలని, విదేశీయులంతా అసూయతో కుళ్లుకోవాలని వారు భావిస్తుంటారు. కానీ, అది జరిగేది కాదు. ప్రపంచ దేశాలన్నింటి నుండి కొత్తకొత్త ఆవిష్కరణలు ఒక్కచోటికి చేరి, అది ఆధునిక విజ్ఞానంగా మారి విశ్వమానవాళికి అందుబాటులోకి వచ్చింది. ఇంకా వస్తూనే ఉంది. వస్తూనే ఉంటుంది. చాలా ముఖ్యమైన వైజ్ఞానిక పరిశీలనలు తొలిదశలో అరబిక్, ఇండియా, చైనా నాగరికతల నుండి కొంత మేరకు వెలువడ్డాయన్నది నిజం. కానీ ప్రపంచం ప్రగతి పథంలోకి నడవడానికి అది మాత్రమే సరిపోలేదు. యూరోప్ దేశాల నుండి 16, 17 శతాబ్దాలలో వైజ్ఞానిక పరిశోధనల వెల్లువ హోరెత్తింది. ఆ ఫలితాలు క్రమంగా తూర్పు దేశాలకు కూడా అందాయి. ఇదీ వాస్తవం. దీన్ని పక్కనబెట్టి అన్ని రంగాలలో భారత్ ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలబడిందనడం కేవలం అతిశయోక్తి. ఈ అతిశయోక్తుల వల్ల జరిగే ప్రమాదమేమంటే భారతదేశం చేసిన కృషికి కూడా విలువ లేకుండా పోతోంది.

సనాతన రుషి వారసత్వాన్ని కొనసాగించాలంటే గోచీలు పెట్టుకోవాలి గానీ, ఆధునిక వస్త్రధారణ దేనికీ? మనం ఆక్సీజన్ పీల్చుకొని, కార్బన్‌డై ఆక్సైడ్ వదిలేస్తున్న సమాచారం వేదాల్లో ఎందుకు లేదు. పోనీ ఆక్సీజన్ హైడ్రోజన్‌ల కలయిక వల్ల నీరు తయారైందన్న ప్రాథమిక సమాచారం కూడా ఇవ్వని వేదాలు ఆధునికుడికి ఎలా ప్రామాణికమవుతాయి? కట్టు కథలు చెప్పే ఇలాంటి మహా ఉపన్యాసకులు పెద్ద పదవుల్లో ఉన్నా సరే... కుహనా మేధావుల కట్టుకథల్ని బాధ్యత గల పౌరులు పట్టించుకోకపోవడమే మంచిది.

ఈ దేశంలోని ఆధ్యాత్మిక చింతనకు, లలిత కళలకు, క్రికెట్ ఆటకు తప్పకుండా ప్రత్యేకత ఉంది. వాటితో దేశానికి గుర్తింపు వచ్చింది నిజమే. బాధ్యతతో సృజించిన సాహిత్యం జన చైతన్యానికీ, మిగతావి జనాన్ని రంజింపజేయడానికి ఉపయోగపడ్డాయి. కానీ దేశం ప్రగతి బాటలో నడవడానికి ఇవేమీ నేరుగా ఉపయోగపడలేదు. ఉపయోగపడవు కూడా! వందల ఏండ్లు దేశం బ్రిటిష్ సామ్రాజ్యంలో ఒక భాగంగా ఉంది గనుక, ఇక్కడి ప్రతిభావంతులకు ఇంగ్లాండ్‌లో చదువుకోవడానికి వీలైంది. అందుకే ఆ కాలంలో ఎక్కువ మంది బారిస్టర్లై తిరిగొచ్చారు. తర్వాత కాలంలో వీళ్లంతా స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాల్గొన్నారు. కానీ వైజ్ఞానికుల సంఖ్య ఎప్పుడూ తక్కువే. మనకు ఒక్క సివి.రామన్ తప్ప నోబెల్ సాధించిన భారతీయ వైజ్ఞానికులు మరొకరు లేరు. మరి కొంతమంది భారతీయులు నోబెల్ సాధించినా, వారంతా విదేశాల పౌరసత్వం స్వీకరించి అక్కడే స్థిరనివాసం ఏర్పర్చుకున్నవారు. స్వాతంత్ర్యం లభించిన తర్వాత దేశంలో వైజ్ఞానిక స్పృహ వ్యాపింపజేయాలన్న పట్టుదలతో తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వైజ్ఞానిక పరిశోధనల్ని ప్రోత్సహించారు. ఇప్పుడున్న జాతీయ సంస్థలన్నీ దాదాపు ఆయన ప్రారంభించినవే. అయితే ఇప్పటి ప్రభుత్వం వాటికి నిధులు కూడా ఇవ్వలేని హీనస్థితికి జారిపోయింది. పైగా శాస్త్రవేత్తలు ప్రాచీన కాలం నాటి రుషుల్ని ఆదర్శంగా తీసుకోవాలని నేటి ప్రభుత్వ పెద్దలు ప్రబోధిస్తున్నారు. వాస్తవంగా ఇదీ దేశంలోని పరిస్థితి. వైజ్ఞానిక స్పృహలేని ప్రభుత్వాలు ఏవైనా ఉన్నాయంటే అవి కంటి చూపు కోల్పోయిన ప్రభుత్వాలని జనం ఇప్పుడు గుర్తిస్తున్నారు.



ఈ దేశంలో కొందరు ఆధ్యాత్మిక వేత్తలు, యోగులు పుట్టారు. జనాన్ని ప్రభావితం చేశారు. నిజమే కానీ, వారి బోధల వల్ల దేశం ఆధునిక యుగంలోకి రాలేదు. వారి వల్ల ఆర్థిక ప్రణాళికలు రూపొందలేదు. ప్రాజెక్టులు కట్టబడలేదు. నూతన వ్యవసాయ పద్ధతులు కనుగొనబడలేదు. విద్య, వైద్యం అందరికీ అందుబాటులోకి రాలేదు. "మనదైన మన గొప్ప సంస్కృతి" అనే పేరుతో కాలాన్ని, దేశాన్నీ వెనక్కి నడిపించే హక్కు ఎవరికీ లేదు. మనం ఇరవై ఒకటవ శతాబ్దంలోకి వచ్చామంటే ఆధునికయుగ వైజ్ఞానిక స్పృహతోనే వచ్చాం. ఈ దేశంలో ఆధ్యాత్మిక సంస్కృతి, పురాతన సంస్కృతి, జానపద సంస్కృతి వంటివి వర్ధిల్లుతూ వచ్చాయని ఒప్పుకుందాం. వాటి ప్రత్యేకతల్ని గుర్తించుకుందాం. అంతవరకే... కానీ, వాటినే ఇంకా కొనసాగిద్దామనుకోవడం తెలివితక్కువతనమవుతుంది. చార్మినార్ కుతుబ్‌మినార్ లాంటి చారిత్రక కట్టడాల్ని పరిరక్షించుకుంటాం. గతాన్ని నెమరువేసుకుంటాం... అంతే. మన ఇస్రో రాకెట్ ప్రయోగాల్ని చూసి గర్వపడతాం. ఎందుకంటే వాటివల్ల ఆధునిక జీవనానికి మేలు జరుగుతూ ఉంది కాబట్టి. గతం ఒక పర్యాటక కేంద్రం. ప్రస్తుత వాస్తవమే నివాస యోగ్యం. మనం ఆ తేడాను గ్రహించవలసి ఉంది. ప్రధానితో సహా, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎంపీల వంటి రాజకీయ నాయకులు వారితో ఏవో ప్రయోజనాలు ఆశించే గవర్నర్లు, జడ్జీలు, వైస్ చాన్సలర్లు, అధికారులు ఆత్మద్రోహం చేసుకుంటూ జనం మీదికి మూఢ విశ్వాసాల్ని వదులుతున్నారంటే దేశాన్ని వెనక్కి నడిపిస్తున్నారనే అర్థం! జనం చైతన్యవంతులయ్యారని, ప్రతిదీ విశ్లేషించుకుంటున్నారని వీరు గ్రహించరు.

పదవితో ఎవరూ గొప్పవాళ్లు కాలేరు. సరైన దృక్పథంతో అవుతారు. ఇప్పటి తరాన్నే కాదు, భవిష్యత్ తరాల్ని కూడా ప్రభావితం చేయగలవారే దార్శనికులవుతారు. దార్శనికులు కావడం తర్వాత సంగతి, ముందు వీళ్లు మనుషులైతే చాలు సంతోషిద్దాం! ఆధ్యాత్మికత పేరు చెప్పి, యోగాకు ఒక ప్రపంచ దినాన్ని కేటాయించి ఈ దేశం ప్రపంచానికి 'సద్గురువు' అని చెప్పుకోలేం. ఏసీ హాళ్లలో మీటింగ్‌లు ఏర్పాటు చేసుకొని, మంచి ఇంగ్లీషులో, మంచి యాసలో మూఢ నమ్మకాల్ని చాలా మంచిగా ప్రబోధిస్తున్న సద్గురువుల్ని కళ్లముందు చూస్తూనే ఉన్నాం. ఎవరైతే ఇంగిత జ్ఞానాన్ని కోల్పోతారో వారే జ్ఞానబోధలు చేస్తున్నారు. ఇలాంటి వారి వల్ల జనానికి నష్టమే తప్ప లాభం చేకూరదు. ఎంతటి వారైనా సరే, విచక్షణాజ్ఞానం లేనివారు వివేకవంతులు కారు. దేశంలో తిరోగమన సిద్ధాంతానికి పెద్ద పీట వేసి, కర్ణుడి పుట్టుక, కౌరవుల పుట్టుక, గణేషుడి తొండం, సనాతన విమానాలు, భారతంలో సంజయుడి టెలివిజన్ ప్రత్యక్ష ప్రసారం వంటి వాటిపై వితండవాదనలు చేసిన వారు ప్రధాని మోడీ, ఆయన పార్టీ అనుచరులు! ప్రధాని విద్యార్హతలేమిటని సమాచార హక్కు చట్టం కింద కొంతమంది ప్రైమినిస్టర్ ఆఫీసును అడిగితే అది 'గోప్యంగా' ఉంచవల్సిన విషయమని వారు సెలవిచ్చారట. ఆయన ప్రధాని కాకముందు జరిపిన టెలివిజన్ ఇంటర్వ్యూలో తను హైస్కూలు దాకా చదివానని చెప్పుకున్నారు. "తలాక్ చెప్పడం ద్వారా భార్యను వదిలిపెట్టిన ముస్లింను జైలుకు పంపేటప్పుడు, జశోదాబెన్‌ను వదిలిపెట్టిన హిందూ నరేంద్రమోడీని ఎందుకు జైలుకు పంపకూడదని అడగడానికి ఒక్క జర్నలిస్టు అయినా సిద్ధంగా ఉన్నారా? ముస్లింలకు బహిరంగ వ్యవహారమైంది మోడీ దగ్గరికి వచ్చే సరికి వ్యక్తిగత వ్యవహారం ఎలా అయ్యిందీ" అని ఎంతో బాధ్యతాయుతంగా ప్రశ్నించారు ఏఐపీడబ్ల్యూఏ కార్యదర్శి కవితా కృష్ణన్. ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్‌గా సుదీర్ఘ కాలం పని చేసిన మోడీ పరిజ్ఞానం ఆ విధంగా ఉండటంలో ఆశ్చర్యం లేదు. జర్మన్ శాస్త్రవేత్త గ్రిగర్ మెండల్ (1822–84) జన్యువు గురించి చెప్పిన తర్వాతే జన్యుశాస్త్రం అభివృద్ధి చెందింది. వారసత్వ లక్షణాల గురించి పరిశోధనలు జరుగుతూ వచ్చాయి. లీవెన్ హక్ (1632–1723) డచ్ శాస్త్రవేత్త మైక్రోస్కోపు కనిపెట్టేదాకా సూక్ష్మకణాల్ని పరిశీలించే అవకాశమే మానవాళికి రాలేదు. అలాంటప్పుడు భారతంలో వంద అండాల్ని వంద కుండల్లో వేస్తే వారు వంద మంది కౌరవులయ్యారని చెప్పిన ఒక కల్పిత కథను శాస్త్రీయం అని ఎవరనుకుంటారూ? నరేంద్రమోడీ అనుచరులు మాత్రమే అనుకుంటారు. ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు గౌరవాన్ని దిగజార్చగలిగిన ఆ యూనివర్సిటీ వైస్ ఛాన్సలరే అనుకుంటారు.

సతీ సహగమనం రద్దు చేయాలన్నప్పుడు, బాల్య వివాహాలు రద్దయినప్పుడు, వితంతువులకు పునర్వివాహం అన్నప్పుడు, స్త్రీలు ఆలయ ప్రవేశం కావాలన్నప్పుడు పెద్ద అపచారం జరిగిందని, దైవ ద్రోహం జరిగిందని, హిందూ మతం మీద దాడి జరిగిందని మోడీ–షాల అనుచరులైన హిందూ మతతత్వ వాదులు గగ్గోలు పెట్టారు. దళితుల ఆలయ ప్రవేశానికి మారణహోమాలే జరిగాయి. వీరు అంటరానితనాన్ని, వర్ణ వ్యవస్థను, మనుధర్మాన్ని నెత్తికెత్తుకుంటారు. మనిషి నీడను, స్పర్శను భరించలేరు గానీ, చనిపోయిన తర్వాత స్వర్గ ద్వారాలు తెరుస్తామంటారు. మానవీయ విలువలకు తిలోదకాలు వదిలి పవిత్రులమయ్యామని అనుకుంటారు. ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేని మానవ హననం ఇక్కడ ఉన్నందుకు గర్వపడదామా? ప్రపంచానికి ఏ విషయంలో ఆదర్శం? ఆత్మ విమర్శ చేసుకునే పనే లేదా? అందరూ సమానులు అందరికీ సమాన హక్కులన్న భౌతిక వాదులపై దాడులు చేస్తారా? వేదాల్లో, పురాణాల్లో అమోఘమైన విజ్ఞానం దాగి ఉంటే, ఆ విజ్ఞానాన్ని వీరు నిత్య జీవితంలో వాడుకోవాలి కదా?

ఎవరైనా తాము ఆధ్యాత్మిక శక్తితో పుష్పక విమానాల్లో తిరుగుతామంటే ఎవరు కాదన్నారూ? స్త్రీ అండాల్ని కుండల్లో వేసి పిల్లల్ని పుట్టిస్తామంటే ఎవరు కాదన్నారు? నీటిలో తేలే రాళ్లతో నదుల మీద, సముద్రాల మీద, వంతెనలు కడతామంటే ఎవరు వద్దన్నారు? ప్రజా ధనం మిగులుతుంది. దేశానికి మేలు జరుగుతుంది. ఇంతెందుకు పొద్దున్నే టీ, కాఫీలు తాగమని వీరికి ఏ రుషులు చెప్పారో మరి? సనాతన రుషి వారసత్వాన్ని కొనసాగించాలంటే గోచీలు పెట్టుకోవాలి గానీ, ఆధునిక వస్త్రధారణ దేనికీ? మనం ఆక్సీజన్ పీల్చుకొని, కార్బన్‌డై ఆక్సైడ్ వదిలేస్తున్న సమాచారం వేదాల్లో ఎందుకు లేదు. పోనీ ఆక్సీజన్ హైడ్రోజన్‌ల కలయిక వల్ల నీరు తయారైందన్న ప్రాథమిక సమాచారం కూడా ఇవ్వని వేదాలు ఆధునికుడికి ఎలా ప్రామాణికమవుతాయి? కట్టు కథలు చెప్పే ఇలాంటి మహా ఉపన్యాసకులు పెద్ద పదవుల్లో ఉన్నా సరే... కుహనా మేధావుల కట్టుకథల్ని బాధ్యత గల పౌరులు పట్టించుకోకపోవడమే మంచిది.

సుప్రసిద్ధ సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్
మెల్బోర్న్ నుంచి


మతం పేరిట గూండాయిజం

ఆర్ఎస్ఎస్–బీజేపీ, వారి హిందుత్వవాద సహాధ్యాయులు ప్రగతిపథం బాటసారులు కారు. గత కాలపు బూజుపట్టిన, మూఢనమ్మకాలతో నిండి ఉన్న, చీకటి తిరోగమనాన్నే పట్టుకుని వేలాడుతున్నాయి. ఈ విషయం కేరళలో శబరిమల విషయంలో వారి వైఖరి రోజురోజుకీ ఇంకా స్పష్టమౌతున్నది. అదే సమయంలో రాజ్యాంగం, సుప్రీం కోర్టుని బేఖాతరు చేస్తున్నారనేదీ వారు రుజువు చేస్తున్నారు. నిరసన తెలియజేయటానికి కూడా ప్రజాస్వామ్య పద్ధతి వీడి హింసను అవలంబించాలనుకుంటున్నారు. ఇక ఈ మొత్తం వ్యవహారమంతా ఆర్ఎస్ఎస్–బీజేపీల రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రణాళికాబద్ధంగా రూపొందిస్తున్నారనే దాంట్లో ఎటువంటి సందేహం ఉండే అవకాశం లేదు. అదే కాకుంటే ఒక అధికార పక్షం పదేపదే రెండు నాల్కల ధోరణికి పాల్పడజాలదు. రాఫెల్ కుంభకోణానికి సంబంధించి సుప్రీంకోర్టు పరిశీలనను ఆయుధంగా చేసుకుని తన అవినీతిని మరుగుపర్చాలని ప్రయత్నించి కూడా ప్రతిపక్షాలపై దాడిచేసే అధికారపక్షమే శబరిమల విషయంలో అదే సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పుని నిరాకరించి, ఆ తీర్పుకి వ్యతిరేకంగా హింసా ఉన్మాదం వ్యాపింపజేసి ప్రజాజీవితాన్ని అతలాకుతలం చేస్తున్నది. మళ్లీ ఇదే పాలకుల దృష్టిలో కాశ్మీరులో ప్రత్యర్థులు రాళ్ళు రువ్వితే తీవ్రవాదుల సమర్థకులని పెల్లెట్లు, తూటాలకు బలౌతున్నారు. కేరళలో మాత్రం సుప్రీంకోర్టు తీర్పుకి వ్యతిరేకంగా గూండాయిజం చేసినా లేక రాళ్లు రువ్వీ బాంబులు విసిరినా వారిని దైవభక్తులని గౌరవిస్తున్నారు. కాశ్మీర్‌లో ఏ పార్టీవారైతే రాళ్లు రువ్వే నిరసనకారులను గురిపెట్టి కాల్చటాన్ని సమర్థిస్తుందో వారే కేరళలో రాళ్లు రువ్వీ బాంబులు విసిరే గూండాలూ దుండగులనూ సమీకరించి, ఉత్తేజపరిచి, శాంతిభద్రతలకు భంగం కలిగించే కుట్ర చేస్తున్నారు. ఈ ఆర్ఎస్ఎస్–బీజేపీ ప్రభుత్వానికే ప్రధాని నరేంద్ర మోడీ.

ప్రపంచమంతా ఆధునిక తర్కస మ్మతమైన ఆలోచనలను స్వీకరించి స్త్రీ, పురుషుల సమానత్వం ప తాకను చేతబూనినప్పుడు భారత్‌లో మోడీ–అమిత్ షాల పార్టీ ఆర్ ఎస్ఎస్ నిర్దేశానుసారం ఆ మధ్యయుగాన్నే తిరిగి తీసుకురావాలని అనుకుంటున్నది. అందుకే నిలిచిపోయిన హిందుత్వ నీటిలో భార తీయ నాగరితను ముంచి ఉంచటానికి వారు ప్రజల నమ్మకాలు, ఆదేశాలు, ఆచారాలు వగైరా కెలికి పురాణ కల్పిత నాయకులను చా రిత్రక నాయకులుగా మార్చాలనుకుంటున్నాది. మసీదు కూల్చి మ oదిరం కట్టాలనుకుంటున్నది. మహిళల గౌరవమర్యాదలు, హక్కు లు కాలరాసి వారిని వంటింటి కుందేళ్ళుగా చేయాలనుకుంటున్నది. మోడీ–షాల గురువు ఆర్ఎస్ఎస్ మహిళలు పిల్లలు కనటానికి, పురుషులను సుఖపెట్టటానికి, సంసార బాధ్యత పురుషులకు సేవకులుగా ఇంటికే పరిమితం చేయాలనుకుంటోంది. అందుకే శబరిమల విషయంలో కోర్టు మహిళల సమానహక్కుని బలపర్చినప్పుడు సంఘ పరివారం బీజేపీఅందుకు వ్యతిరేకంగా అసభ్యంగా ప్రవర్తించటం మొదలెట్టింది. మూడు నెలల క్రితం తీర్పు వచ్చినా హిందుత్వవాద మతాంధుల దాడి కారణంగా మహిళలు మరలా మరలా దాడులు, అడ్డగింతలకు గురయ్యారు. కొద్దిమంది హిందుత్వవాద దుండగుల గూండాయిజం మినహాయిస్తే కేరళ మహిళలు తీర్పుని స్వాగతించారు. ఇందుకు నిదర్శనం కేరళ ఉత్తరం నుంచి దక్షిణం వరకు 620కి.మీ పొడవునా 55లక్షల మహిళా మానవ హారం. ఆ చారిత్రక సంఘటన హిందుత్వవాదుల డొల్లతన్నాన్ని రుజువు చేసింది. ఆ తరవాత ఇద్దరు మహిళలు ఆలయంలోకి ప్రవేశించారు. సాధారణ భక్తులు వారికి ఏ ఆటంకమూ కలిగించలేదు. అంటే భక్తులు కూడా సమానాధికారం కోరుకుంటున్నారు. కేవలం కుసంస్కారంతో కమ్ముకుపోయిన, వెనకబడిన, తర్కబద్ధంగా లేని గుడ్డిభక్తులే వ్యతిరేకిస్తున్నారు. వారు భక్తులు కంటే ఎక్కువ ఆర్ఎస్ఎస్–బీజేపీ అండ కలిగి ఉన్న హిందుత్వవాద దుండగులు. వీరికి మతం ముఖ్యం కాదు, మతం పేరిట రాజకీయం ముఖ్యం.

- వేదుల రామకృష్ణ

అంబానీ ఆసియా కుబేరుడు ఎలా అయ్యారు?



సిహెచ్. మధు

ముకేశ్ అంబానీ ఆసియాలోనే ప్రప్రథమ కుబేరుడు! భవిష్యత్తులో ప్రపంచంలోనే మొదటి కుబేరుడైనా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. భారతదేశంలో ఎందరు దరి ద్రులున్నారనే లెక్క ఎవరూ తేల్చరు. దరిద్రుల లెక్కలు ఎవరికి కావాలీ? అయితే ఒక విషయం మనం మర్చిపోకూడదు. ఈ ద రిద్రులే సంపదకు మూలం. వీరి శ్రమతోనే సంపద సృష్టిస్తుంది. వీరి శ్రమ సంపద దోచి వీరు కుబేరులవుతున్నారు. ముకేశ్ అం బానీ కష్టపడి ప్రపంచ కుబేరుడయ్యారా? భారతదేశంలో పదుల సంఖ్యలో ఉన్న కుబేరుల కథేమిటీ? వందకోట్లకు పైగా ఉన్న పేదల కథేమిటీ? దు:ఖమేమిటీ? మామూలు జనానికి ఎంత కష్టపడినా పది రూకలు దొరకటం లేదు. ముకేశ్ అంబానీ ఎలా ప్రపంచ కుబేరుడయ్యారు?

ప్రపంచంలో కుబేరులు..దేశంలో కుబేరులు రాష్ట్రంలో కు బేరులు...ఎక్కడి నుంచి వస్తోందీ? ఎక్కడ పుడుతోందీ డబ్బు? గాలిలో పుడుతుందా? దేవుణ్ని కొలిస్తే వస్తుందా? డబ్బు శ్రమ ద్వారా పుడుతుంది. శ్రామికుని ఉత్పత్తినీ శ్రమనూ దోపిడీ చేస్తే కుబేరులు కావచ్చు. లేదా దేశ వనరులను చట్టబద్ధంగా, చట్ట విరుద్ధంగా తన స్వాధీనంలోకి తెచ్చుకుంటే కుబేరులు కావచ్చు. ముకేశ్ అంబానీ ఎలా ఆసియా కుబేరులయ్యారు? నాగలి దున్నారా? పంట పండించారా? దేశానికి కావల్సిన ముఖ్యమైన వ స్తువులు ఉత్పత్తి చేసారా? ఆయన తండ్రి అంబానీ కోటీశ్వరు డు. అది శ్రమ సంపద కాదు. దోపిడీ సంపద.. దోపిడీ సంపద ను ముకేశ్ చట్టబద్ధంగా, చట్ట విరుద్ధంగా, లక్షలకోట్లుగా మార్చి ఇప్పుడు ఆసియా కుబేరుడయ్యారు. అంతా ప్రజల సొమ్ము, దేశం సొమ్ము దోచుకొని కుబేరులయ్యారు. ఇలా దోచుకుంటున్న కుబేరులలో ఆసియాలో ఫస్ట్ ర్యాంక్ పొందారు. గర్వం పొందు దామా? లేక ఇదేం న్యాయం? ఇదెక్కడి న్యాయం? రాజ్యాంగ సూత్రాలేమయ్యాయి. సమన్యాయ సమానత్వం అంతరాలే లేని వ్యవస్థ, సోషలిజం.. అన్నీ ఎటుపోయాయి? ఏ గంగలో కలిసాయి?



అంబానీ కొడుకులలో ఒకడైన ముకేశ్ అంబానీ ఆసియా ఫస్ట్ కుబేరుడుగా ముందుకొస్తే.. రెండో కుమారుడు అనిల్ అంబానీ ఈ దోపిడీ పోటీలో వెనకపడ్డాడు. ఈ అనిల్ అంబానీని పోటీలో ఉంచాలని, నిలబెట్టాలని ధర్మ ప్రవచనాలు వల్లించి ప్ర జలంటే ప్రేమగా ఆకాశం ఎత్తు, చాటుకొనే ప్రధాని నరేంద్ర మోడీ ఫ్రాన్స్ రాఫెల్ విమానాల కాంట్రాక్టు అనిల్‌కు ఇప్పిం చారు. ప్రధాని నరేంద్రమోడీ పేద ప్రజలంటే ఇష్టమా?. కోటీశ్వ రులంటే ఇష్టమా? ఎవరి ప్రధాని? అనిల్ అంబానీకి రాఫెల్ వి మానాల అప్పగింతలో కొన్ని వేల కోట్ల అవినీతి ఉందని కాంగ్రె స్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అంటారు. మనదేశంలోని 80 మంది శాతం పూట గడువక బాధపడుతున్నారు. అంబానీలాగా ఒక వి మానం నుండి మరో విమానం ఎక్కే వారు కాదు. వీళ్లంతా ఫాం హౌస్‌ల చక్రవర్తులు కాదు. శ్రమ జీవులు. సంపద సృష్టించేవారు. మన దేశంలో ప్రజలు పస్తులుంటున్నారు. ఉపాధి లేక ఉసూరుమంటున్నారు. మన తెలంగాణలోనే లక్ష లాది మంది నిరుద్యోగులున్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన త ర్వాత నాలుగువేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇ ంత అమవాస్యలో ప్రజలుంటే.. తెలంగాణ ఎన్నికల్లో కోట్ల ఖర్చు.. ఒక్కో అభ్యర్థి కోటికి తక్కువ కాకుండా ఖర్చు చేసారు. "తెలంగాణ ఎన్నికల్లో మొత్తం పదివేల కోట్లు ఖర్చు కావొచ్చని మాజీ న్యాయమూర్తి అన్నారు. పదివేల కోట్లు అయ్యాయా? ఎ క్కడిదీ డబ్బు? అవినీతి డబ్బు కాదా? దోపిడీ డబ్బు కాదా? ఇద ంతా ప్రజల సొమ్ము కాదా? ఇటువంటి అవినీతిపరులు దేశంలో వందల సంఖ్యలో వున్నా, ప్రపంచంలో వేల సంఖ్యలో వున్నారు. ఈ అవినీతిపరులలో ఆసియాలో ప్రథమ పౌరుడు ముకేశ్ అంబానీ.. కేవలం అంబానీ ఒక ఉదాహరణ మాత్రమే. ఎలా కోటీశ్వరులవుతున్నారు అనేది ఒక ప్రశ్న.

నేను ఈ వ్యాసంలో వాస్తవాలు రాయాలని, ప్రజల కోసం రాయాలని. ప్రజలైనా ప్రశ్నించాలి. ప్రశ్న చాలా ముఖ్యం. నిజ జీవితమే నిండు చీకట్లో వున్నప్పుడు ఈ చీకటి ఎక్కడిదని ప్ర శ్నించే స్థాయి పాఠకునికి రావాలి. అది అవసరం. ఈ వ్యవస్థ ప్రజాస్వామ్య వ్యవస్థ కాదు. కార్పొరేట్ సామ్రాజ్య దోపిడీ వ్యవస్థ. ఇది కోటీశ్వరుల వ్యవస్థ. ప్రజలు ప్రశ్నించగలగాలి. మేము ఎం త శ్రమ చేసినా రాత్రింబవళు కష్టపడినా లక్ష ముఖం చూడటం కష్టంగా వుంది. ముకేశ్ అంబానీ ఆసియాలోనే ప్రథమ కోటీ శ్వరులెలా అయ్యారు. తమకు లక్ష నోట్లు చూడటం కష్టం వుం ది. ముకేశ్ అంబానీ అపర కోటీశ్వరుడు ఎలా అయ్యారు? అని ఆలోచించగలగాలి. ఈ దేశంలోని కోటీశ్వరులు కోట్లు వందల కోట్లు లెక్కిస్తున్నారు? ఎక్కడివి? ఎవరి సంపద ఎవరి కష్టం వీరి కోట్లు? ఈ ప్రశ్నలు ప్రజలు వేయగలగాలి. ఇలాంటి వారు కొన్ని వందలు, వేలు, లక్షల కోట్లు ఎలా సంపాదించారనేది ప్రశ్న. వీరి సంపాదనకు భారతదేశంలోని 90శాతం పేదప్రజలకు సం బంధం లేదా? అనేది ముఖ్య ప్రశ్న.

నిజంగా కొందరు వేల లక్షల కోట్లు ఏదో రూపంలో సం పాదించకపోతే– దేశంలో ఇంత ఆకలి.. 90 శాతం మంది దారి ద్ర్యులు, కోట్లసంఖ్యలో నిరుద్యోగులు వుండేవారా? వీళ్లను ఆకలి లో, దారిద్ర్యంలో ముంచి– నిరుద్యోగులకు నిరాశను కల్గిస్తూ కా ర్పొరేట్ సామ్రాజ్యాధీశులు ఒకటో నెంబర్, రెండో నెంబర్, పదో నెంబర్ కుబేరులంటూ ప్రపంచంలో వెలిగిపోతున్నారు. అర్థమేమిటి? అన్ని పాలక పక్షాలు ప్రజాస్వామ్యం పేరుతో కార్పొరేట్ సామ్రాజ్యాన్ని పెంచుతున్నాయి. బీదలు– ఇంకా ఇంకా బీద లుగా మారిపోతున్నారు. ఆర్థిక అంతరాలు పెరగడానికి పాలక పక్షం– రాజకీయ పార్టీల విధానాలే కారణం. అవి శ్రామికులకు పేద ప్రజలకు అనుకూలంగా లేవు. మోడీ ప్రధాని అయిన తర్వాత కార్పొరేట్ సామ్రాజ్య దోపిడీకి మతం రంగు పూసి ప్రజలను తప్పుదారి పట్టించడానికి సరికొత్త మత్తును సృష్టించారు. దేశంలోని సంపద 73 శాతం ఒక శాతం మంది చేతుల్లో ఇరుక్కుపోయింది. ఈ కోటీశ్వరుల పెంపునకు మైని ంగ్– రియల్ ఎస్టేట్ కారణమని కొందరంటారు కానీ ఇంకా చాలా కారణాలున్నాయి. ప్రజలు గమనించాలి. గ్రహించాలి.

సెల్ : 99494 86122

ప్రజావాణి

మాకో న్యాయం వారికో న్యాయమా?

ఎన్నికల సమయంలో కొందరు టీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్సీలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. టీఆర్ఎస్ సభ్యత్వం లేని అనర్హులుగా ప్రకటించాలని గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించటం, శాసనమండలి చైర్మన్‌కూ వినతిపత్రం సమర్పించడం జరిగిపోయాయి. ఇది ఎంత వరకు సమంజసం. గతంలో టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రి పదవులు కట్టబెట్టారు. వారిని సస్పెండ్ చేయించాలని కాంగ్రెస్ వినతిపత్రం సమర్పిస్తే ఎందుకు సస్పెండ్ చేయలేదు. వారిని ఎందుకు మంత్రి పదవుల నుండి తొలగించలేదు. ఇప్పుడు కొందరు కాంగ్రెస్ నాయకులను ఆ పార్టీలో చేర్చుకునేందుకు ముందుకు సాగుతున్నారు. ఇలాంటివి తీవ్రమైన విషయాలుగా ప్రకటించాలి. ఫిరాయింపులుగా ప్రకటించాలి. న్యాయం ఒకలాగే ఉండాలి. మీ పార్టీలో చేరిపోయాక మీకో న్యాయం, ప్రతిపక్ష పార్టీలకో న్యాయమా?

అయినం రఘురామారావు, ఖమ్మం.

పంచాయతీలకు అధికారాలివ్వాలి

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఊపం దుకుంది. మరికొన్ని రోజుల్లో పంచాయతీల్లో కొత్త సర్పంచులు, పాలకవర్గం కొలువు తీరుతారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగంలో నిర్దేశించిన విధంగా వ్యవసాయం, చిన్నతరహా పరిశ్రమలు, గ్రామీణ గృహ నిర్మాణం, ప్రాథమిక విద్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ తదితర 29 అంశాలపై స్థానిక సంస్థలకు అధికారాలు అప్పగించేందుకు సిద్ధమైనట్టు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. లేకపోతే కొత్తగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులు ప్రేక్షకపాత్రకే పరిమితమవుతారు. గ్రామ స్వరాజ్య భావనతో స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలు కట్టబెట్టి పాలించి ఉంటే ఇండియా ఇప్పటికే ఎంతో బలోపేతమై ఉండేది. కనుక స్థానిక సంస్థలకు అధికారాలు బదలాయించే విధంగా పాలకులపై ఒత్తిడి తేవడానికి ప్రజలు తక్షణం సిద్ధం కావాలి.

జి.అశోక్, జగిత్యాల జిల్లా



> విషయజ్ఞానం, సంయమనం లేనివారే తమ వాదనలను మతిలేకుండా ప్రదర్శిస్తుంటారు. వారికి మరోపేరు ట్రోల్స్.
> - సారా పెన్నింగ్టన్,బ్రిటిస్ రచయిత్రి



భద్రత కోసం ఏర్పాటుచేస్తున్న స్పై కెమెరాలు చిల్లర సరుకుల్లా.. ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌లోనూ చివరకు ఫుట్‌పాత్ మీద కూడా అమ్మకానికి ఉంటున్నాయి. అమ్మేవారికి, కొనేవారికి ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో ఆడవాళ్ల అశ్లీల చిత్రాలు ఇంటర్నెట్‌లో ప్రత్యేక్షం అవుతున్నాయి. తమ ప్రమేయం లేకుండానే జరుగుతున్న ఈ ఘోరాల కారణంగా అవమానంతో కుంగిపోయి ఎంతో మంది ఆడవాళ్లు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి నేరాలను అరికట్టడానికి, మహిళ భద్రతకు భరోసా కల్పించడానికి ఉద్యమిస్తున్నారు వరలక్ష్మి. ప్రతి ఇల్లు సమస్యలకు అతీతంగా ఉండాలన్న లక్ష్యంతో 'హెవెన్ హూమ్ సొసైటీ' అనే సంస్థను స్థాపించారు. స్పైకెమెరాల అమ్మకాలపై ప్రత్యేక చట్టం తీసుకురావాలంటూ 'యాంటీ రెడ్ ఐ' పేరుతో పోరాటం కొనసాగిస్తున్నారు షార్ట్‌ఫిల్మ్‌ల ద్వారా సమస్యపై చైతన్యం కల్పిస్తూ.. మిస్డ్ కాల్‌తో ఓటింగ్ ద్వారా సమస్యను చట్టసభల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్న ఆమె పరిచయం...

మూడోకన్నును కనిపెట్టాల్సిందే..!

మాది ఖమ్మం జిల్లా. నాన్న సూర్య ప్రకాశ్ పోలీసు డిపార్ట్‌మెంట్‌లో పనిచేశారు. అమ్మ సౌదామిని గ హిణి. ఇంటర్ వరకు ఏలూరులో చదివాను. ఖమ్మంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడే పెండ్లి అయ్యింది. మా ఆయన ఎస్. వి. సంజయ్ కుమార్ బిజినెస్‌మ్యాన్. మాకు ఇద్దరు పిల్లలు. భార్గవి, కిరీటి. ఇంట్లో ఖాళీగా ఉండటం నాకు నచ్చేది కాదు. ప్రతిమహిళ ఈ సమాజంలో భాగమే. ఆమె శక్తి నిరుపయోగంగా ఉండకూడదు అన్నది నా భావన. నేను చిన్నప్పుడు నేర్చుకున్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఇతరులకు నేర్పించేదాన్ని. పిల్లలు, మహిళలు వచ్చేవారు. కొత్తగూడెంలో ఉన్నప్పుడు పెయింటింగ్, క్రాఫ్ట్‌తో పాటు ఒకే విధమైన భావాలు ఉన్నవారితో కలిసి సేవాకార్యక్రమాల్లో కూడా పాల్గొనేదాన్ని.

నాన్నపేరుమీద..

వీటితో పాటు మహిళాసాధికారత దిశగా కార్యక్రమాలు నిర్వహిం చాం. నాన్న చనిపోయిన తర్వాత ఆయన పేరుమీద కొంత మందికి సహాయం చేద్దామన్న లక్ష్యంతో ఓల్డేజ్ హోంకు వెళ్లాం. అక్కడి పరిస్థి తులు చూసి సమాజసేవ మరింత పెంచాలన్న లక్ష్యంతో స్వచ్ఛంద సంస్థ ను ఏర్పాటుచేశాం. సమస్యలకు అతీతంగా ఏ ఇల్లు లేదు. ఎటు చూసినా సమస్యలే కనిపిస్తున్నాయి. దీనిని మార్చడానికి మా సంస్థ పేరు 'హెవెన్ హూమ్ సొసైటీ'గా రిజిస్టర్ చేశాం. 2012లో ప్రారంభించిన మా సంస్థ ద్వారా అనేక మహిళా సాధికారత కార్యక్రమాలు నిర్వహించాం. ఇదే సమయంలో మా మకాం కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు మారింది.

బిసి మహిళాల కోసం..

హైదరాబాద్ వచ్చిన తర్వాత కూడా కార్యక్రమాలు ఆపలేదు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నేర్పిస్తూ.. వారిలోని సృజనాత్మకతకు పదును పెడుతూ.. సొంతంగా ఉపాధి కల్పించుకునేలా ప్రోత్సహించేదాన్ని. వారికి కావల్సిన బ్యాంక్‌లోన్లు, ఇతర సదుపాయల గురించి తెలుసుకుని అవగాహన కల్పించేదాన్ని. సేవా కార్యక్రమాల ద్వారా బిసి సంక్షేమ సంఘంలో రాష్ట్రప్రధాన కార్యదర్శిగా పనిచేసే అవకాశం వచ్చింది. అప్పటివరకు సాధికారత దిశగా ఉన్న నా ఆలోచనలు సమస్యల వైపు మళ్లాయి. సమాజంలో మహిళలు ఎద్కుంటున్న సమస్యలు, వాటికి ఎలాంటి పరిష్కారాలు ఇస్తే వారి జీవితాలు బాగుపడుతాయి అన్న తపనతో ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. ఆ తర్వాత నాకు సెన్సార్ బోర్డ్ సభ్యురాలిగా పనిచేసే అవకాశం వచ్చింది. జీవితంలో వచ్చే ప్రతి మలుపు కొత్త సమస్యలను పరిచయం చేసింది.



సెన్సార్ బోర్డు మెంబర్‌గా..

ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబరుగా పని చేస్తున్నప్పుడు కొన్ని కేసులను టెక్నికల్ టీమ్ ఇన్వెస్టిగేషన్ చేయడం గమనించాను. పూర్తి వివరాలు తెలుసుకునే ప్రయత్నంలో మహిళ భద్రత ఎంత ప్రమాదంలో ఉందో తెలుసుకుని చలించిపోయాను. రక్షణకోసం ఏర్పాటుచేసి స్పై కెమరాలతో వస్తున్న సమస్యలతో ఎంతోమంది మనోవ్యధకు గురవుతున్నారని, భరించలేక కొందరు ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని తెలిసి భరించలేకపోయాను. స్పై కెమెరాల దుర్వినియోగంతో అత్యాచారాలు, ఆత్మహత్యలు జరుగుతుండటంతో వీటికి వ్యతిరేకంగా యాంటీ రెడ్ ఐ క్యాంపెయిన్ ప్రారంభించాం.

భద్రత పేరుతో..

ప్రస్తుత సమాజం మొత్తం ఆధునిక టెక్నాలజీ మీదే నడుస్తుంది. అరచేతిలో అందుబాటులోకి వచ్చిన ఈ సాంకేతికత కారణం గా మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారుతుంది. ఆన్‌లైన్‌లో ఆఫ్‌లైన్ లో స్పై కెమెరాల అమ్మకం నేరాలను అదుపు చేయడం కన్నా కొత్త నేరాలకు దారితీస్తున్నది. దీని వల్ల సమాజంలో మహిళల మనుగడ ప్రమాదంలో పడే అవకాశం ఉంది. భద్రత పేరుతో షాపింగ్ మాల్స్‌లో, హస్పిటల్స్ తదితర ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన స్పై కెమెరాల కారణంగా ఎంతోమంది అభంశుభం తెలియని ఆడపిల్లలు, మహిళలు తమకు తెలియకుండానే స్పైటెక్ వలలో చిక్కుకుంటున్నారు. దీనిపై నేను నెలలపాటు గ్రౌండ్ వర్క్ చేశాను. ఒళ్లు గగుర్పొడిచే అనేక సంఘటనలు తెలిసాయి. రోజురోజుకూ స్పై బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. తమకు తెలియకుండా జరుగుతున్న ఈ అఘాయిత్యాలను ఎలా ఎదుర్కోవాలో, వీటి నుంచి ఎలా భయటపడాలో తెలియక సతమతమవుతూ.. చివరకు ప్రాణాలు కోల్పోతున్నారు.

చట్టసవరణ జరగాలి..

మహిళ భద్రత ప్రశ్నార్థకంగా మారిన ఈ పరిస్థితులను నివారించా లంటే స్పైకెమెరాల అమ్మకాలపై, వాడకం పై ప్రత్యేకమైన నిబంధనలు ఉండాలి. ఇందుకోసం కోర్టులో పిల్ వేశాం. అయితే నెలలు గడుస్తున్నా, ఇంత వరకు ఆ కేసు బెంచ్ మీదకు రాకపోవడం మహిళల భద్రతపై ప్రభుత్వానికి ఉన్న కమిట్‌మెంట్‌కు నిదర్శనం. ఇటీవల దక్షిణ కొరియాలో మహిళలు పెద్ద ఎత్తున స్పై కెమెరాలకు వ్యతిరేకంగా ఉద్యమించి వారి డిమాండ్లు సాధించుకున్నారు. 'యాంటీ రెడ్ ఐ' టీమ్ ద్వారా మహిళలు స్పైకెమెరాలో వచ్చే సమస్యను ఎదుర్కోవటానికి కావలసిన సాంకేతిక అవగాహన మేము కలిగిస్తున్నాం. 'యాంటీ రెడ్ ఐ' రూపొందించిన సూచనల ప్రకారం ప్రతి సంస్థ మహిళా కస్టమర్ల భద్రతని తమ స్వంత బాధ్యతగా తీసుకొని వారి వ్యాపార సంస్థలు, హెూటల్స్, మాల్స్, హాస్టల్స్ వంటి వాటిలో తమ సిబ్బంది కాని, ఎవరైనా ఇతరులు కాని స్పై కెమెరాలు బిగించారా అనేది ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ ఉండాలి. చట్టపరంగా కూడా బాధితులకు తక్షణ న్యాయం జరగేలా చూడాలి. 354సి, 2013 యాక్టును సవరించి నాన్‌బెయిలబుల్ గా పరిగణించాలి. పోర్న్‌సైట్లను నియంత్రించాలి. చట్ట సవరణ కోసం కోటి మిస్‌డ్‌కాల్స్ ఉద్యమం చేస్తున్నాం. ఈ సమస్య రేపు ప్రతి ఇంటి తలుపు తట్టవచ్చు.. దీనిని నివారించడానికి ప్రతిఒక్కరూ ఉద్యమించాలి. మహిళా భద్రత కోసం 8099259925కి మిస్‌డ్ కాల్ ఇవ్వండి అంటూ ప్రతిఒక్కరినీ కోరుతున్నాం. భయం లేని బతుకుకోసం మా పోరాటం.

✍ యశోద



స్వచ్ఛమైనదేనా?



తేనెను బెల్లం పాకంతో కల్తీ చేస్తూ ఉంటారు. అందుకే, కొనేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. కల్తీ తేనెను కనిపెట్టటం తేలికే. ఇందుకోసం ఈ చిట్కాలు పాటించండి.

- గ్లాసు నీళ్లలో చెంచా తేనె వేసి చూడండి. కల్తీ తేనె నీళ్లలో వేసిన వెంటనే కరిగి పోతుంది. స్వచ్ఛమైన తేనె అడుక్కి చేరిపోతుంది.
- కొన్ని చుక్కల తేనెను టిష్యూ పేపర్ మీద వేయండి. కల్తీదైతే ఇంకిపోతుంది. స్వచ్ఛమై నదైతే కదలకుండా ఉంటుంది.
- తేనె సీసా మీద ముద్రించిన పదార్థాల చిట్టాలో 'సంకలితాలు' (అడిటివ్స్) లేకపోతే ఆ తేనె స్వచ్ఛమైనదే!
- దూదిని తేనెలో ముంచి వెలిగించాలి. తేనె స్వచ్ఛమైనదైతే దూది వెలుగుతుంది. కల్తీ తేనెలో నీరు ఉంటుంది కాబట్టి దూది వెలగదు.
- తేనెను దుస్తుల మీద వేసి కొద్దిసేపు ఆగి కడగండి. మరక పడితే ఆ తేనె కల్తీదని అర్థం.
- తేనెలో 80 శాతం చక్కెర, 18 శాతం నీరు, 2 శాతం విటమిన్లు, ఖనిజ లవణాలు, మాంసకృత్తులు ఉంటాయి. కాబట్టి తేనె సంపూర్ణ పౌష్ఠికాహారం. తేనెను ఎప్పుడైనా, ఎలాగైనా తినొచ్చు.
- అల్పాహారాల్లో, బ్రెడ్‌లో, పళ్ల రసాలలో, చక్కెరకు బదులుగా తేనెను తినటం ఆరోగ్యకరం. ❄

క్యారెట్‌ను కాదనొద్దు



క్యారెట్‌ను ఏవిధంగా ఉపయోగించినా మంచిదే. ఎందుకంటే వీటిల్లో విటమిన్ ఎ, కె, ఇ, బి6, పొటాషియం, ఫోలేట్, మాంగనీస్, ఫాస్ఫరస్, మెగ్నీషియం, జింక్, కాల్షియం, థయాసిన్, రైబోఫ్లేవిన్, నియాసిన్, లైకోపిన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ మనకెలా ఉపకరిస్తాయంటే...

మెరుగైన కంటిచూపు: బీటాకెరోటిన్, విటమిన్ ఎ గా రూపాం తరం చెంది కంటి జబ్బులు రానివ్వదు. వృద్ధాప్యంలో వచ్చే అంధత్వం, శుక్లాల వంటివి రాకుండా 40 శాతం వరకు అడ్డుకుంటుంది.

దంతాలకు మందు : క్యారెట్లు నమిలితే టూత్‌పేస్టులా దంతాలను శుభ్రపరుస్తాయి. వీటిలో ఉండే ఆల్కలిన్ చిగుళ్లలోని బాక్టీరియాను తొలగించి దుర్వాసనను పోగొడుతుంది. ఖనిజాలు లాలాజలాన్ని అభివృద్ధి చేసి నోటిని తాజాగా ఉంచుతాయి.

గుండె పదిలం : వీటిని తీసుకుంటే గుండె జబ్బులు దరిచేరవు. శరీరంలో, రక్తంలో పేరుకున్న కొవ్వును తేలిగ్గా కరిగిస్తుంది. దానివల్ల గుండెపోటు వచ్చే అవకాశాలు తగ్గుతాయి.

చర్మకాంతికి : ఇందులో ఉండే విటమిన్ ఎ, ఆమ్లాలు సూర్యునిలోని అతినీలలోహిత కిరణాల నుంచి రక్షణనిస్తాయి. చర్మం, జుట్టు, గోళ్లు పొడిబారకుండా కాపాడుతాయి. చర్మంపై మచ్చలు తగ్గించి, ముడతలు రాకుండా చేస్తాయి.

క్యాన్సర్ నివారణ : క్యారెట్లను ఎక్కువగా తింటే క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయి. ఊపిరితిత్తులు, రొమ్ము, పెద్దపేగు వంటి క్యాన్సర్లను అడ్డుకుంటుంది.

శరీర శుద్ధి : క్యారెట్‌లో ఉండే విటమిన్ 'ఎ' శరీరంలో చేరిన విష పదార్థాలను తొలగిస్తుంది. దానివల్ల కాలేయం, పెద్ద పేగు శుభ్రపడి ఆరోగ్యంగా ఉంటాం. ❄

ఆ సమస్యల వెనుక.. !



కొందరి మానసిక సమస్యలకు వారి వ్యక్తిత్వాలూ కారణ మవుతూ ఉంటాయి. కాబట్టి సమస్యను బట్టి ఎవరికి వారు లోతుగా విశ్లేషించుకుని, వ్యక్తిత్వంలో స్వల్ప మార్పులు చేసుకోగలిగితే ఇబ్బందులు సర్దుకుంటాయి. ఉదాహ రణకు :సోషల్ యాంగ్జయిటీ, డిప్రెషన్.

- మానసికంగా కుంగిపో యినప్పుడు ఇతరుల సహాయాన్ని అర్థించకుండా ఒంటరిగా ఉండడానికే ఇష్టపడతారు. ఇలాంటివాళ్లు సరైన సమయంలో వైద్యులతో మాట్లాడితే సమస్య సర్దుకుంటుంది.
- డిప్రెషన్, ఆందోళన.. పర్‌ఫెక్షనిస్టులు వాళ్ల గురించి వాళ్లు ఎక్కువ అంచనాలు కలిగి ఉంటారు. తమని ఓడించడం ఎవరి తరమూ కాదనే నమ్మకంతో ఉంటారు. దాంతో ఎప్పుడైనా ఓటమిపాలైతే విపరీతంగా కుంగిపోయి, డిప్రెషన్‌లో కూరుకుపోతారు. ఇలాంటప్పుడు ఒత్తిడికి లోనయినట్టు మీ శరీరం చెబుతున్న విషయాన్ని ఆలకించాలి. అంచనాలు తగ్గించుకుని ప్రశాంతంగా ఆలోచించడం మొదలుపెడితే మానసిక ఇబ్బందులు పూర్తిగా తగ్గిపోతాయి.
- బైపోలార్ డిజార్డర్ డిప్రెషన్.. సృజనాత్మక వ్యక్తులు గతాన్ని తరచుగా తలుచుకోవడం, జరిగిపోయినదానికి చింతిస్తూ ఉండే వ్యక్తిత్వం కలిగి ఉంటారు. ఇలాంటివాళ్లు మానసిక సమస్యలకు గురి కాకుండా ఉండాలంటే, మానసిక స్థిరత్వాన్ని పెంపొందించుకుని, తమకున్న సృజనాత్మకతకు మెరుగులు దిద్దాలి. ❄



బస్తర్‌లో లేడీ సింగం...

> స్ఫూర్తిదాయకమైన వ్యక్తులు మన మధ్యలోనే ఉంటారు. మనం ఎక్కడో వెతుక్కోనవసరం లేదు. తొలిసారి కోబ్రా టీమ్‌లో కమాండోగా చేరిన ఘనత మాత్రం ఉషాకిరణ్ సొంతం. లైఫ్ చాలెంజింగ్‌గా ఉండటం ఉషా కిరణ్‌కు చాలా ఇష్టం. 'ఎన్ని శిఖరాగ్రాలు చేరినా నేలకు దిగాల్సిందే, ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాల్సిందే' అన్నది ఆమె ఫిలాసఫీ.

మహిళలకు సరైన ప్రోత్సాహం ఉంటే అన్ని రంగాల్లోనూ దూసుకు పోతారు. నేటితరం మహిళలు మగ వారితో సమానంగా మేం సైతం అంటూ ముందడుగు వేస్తున్నారు. సాహసోపేతమైన రంగాల్లోనూ రాణిం చగలరని ప్రతిసారి నిరూపిస్తూనే ఉన్నారు. ఢిల్లీకి చెందిన 27 యేండ్ల యువతి తొలిసారి కోబ్రా టీమ్‌లో కమాండోగా చేరి ధైర్య, సాహసాలను నిరూపించుకుంటున్నది. గతంలో కొన్ని రంగాలకే పరిమితమైన స్త్రీలకు ఇప్పుడిప్పుడే అన్ని రంగాల్లో అవకాశం ఇచ్చేందుకు నియమ నిబంధనల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ట్రిపుల్ జంప్‌లో జాతీయ స్థాయి క్రీడాకారిణిగా తన సత్తా చాటి సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్)లో ఏడాది పాటు శిక్షణ తీసుకుని 232 మహిళా బెటాలియన్‌లో చేరింది. సీఆర్‌పిఎఫ్‌లోనే అతి తక్కువ వయసు కలిగిన మహిళా అధికారిణిగా ఉషాకిరణ్ నిలిచింది. ఈ రంగంలో మరిన్ని విజయాలను అందుకోవాలనే సంకల్పంతో గెరిల్లా విద్యలు, అడవిలో శత్రువులను ధైర్య సాహసాలతో ఎదుర్కొనేందుకు అవసరమైన నైపుణ్యాలపై పట్టు సాధించింది. కొద్ది రోజుల తర్వాత తనకు జమ్మూ, కశ్మీర్ సరిహద్దుల్లో పనిచేయడానికి అవకాశం ఇవ్వమని ఉన్నతాధికారులను కోరింది. అదే సమయంలో కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్ (కోబ్రా) దళంలో ఉషాకిరణ్‌ను కమాండోగా నియమించారు. దీంతో తొలిసారిగా కోబ్రా దళంలో చేరిన మహిళగా గుర్తింపు వచ్చింది.

ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్ ప్రాంతమైన బస్తర్‌లో ఆమె విధులు నిర్వహిస్తున్నది. పాఠశాల విద్యార్థు లకు ప్రోత్సాహకాలిస్తూ వారిని ఉత్సాహపరుస్తున్నది. అంతేకాకుండా విద్యార్థి దశ నుంచే దేశ రక్షణలో పాలు పంచుకునే సైనిక దళాలను గురించి వారికి తెలియజేస్తున్నది. ఆదర్శంగా నిలుస్తున్న ఆమె 2018 సంవత్సరానికిగానూ 'యంగ్ అఛీవర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు'కు ఎంపికైంది. ఆమె ధైర్యసాహసాలను మెచ్చుకుని అందరూ ఉషాకిరణ్‌ను లేడీ సింగం (ఆడ సింహం) అని పిలుస్తున్నారు. "జీవితాన్ని ఉపయుక్తంగా మలుచుకోవాలి. సాధించగలిగిన గోల్స్‌ను నిర్దేశించుకోవాలి. వాటిని నెరవేర్చుకోవడానికి ఎంత శ్రమ అవసరమో అంతగా శ్రమించాలి. ఇంకా ముఖ్యంగా అమ్మాయిలకు పరిధి గీయవద్దని తల్లిదండ్రులకు నచ్చజెప్పడం మన బాధ్యత" అని చెబుతున్నది ఉషాకిరణ్.

ఇట్లచేద్దాం



నిమ్మరసంలో కొంచెం కర్పూరం, కొద్దిగా ఆలివ్ నూనె కలిపి మిశ్రమాన్ని తయారు చేయాలి. దీన్ని ఒంటికి మసాజ్ చేసి గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే మేని ఛాయ మెరుగుపడుతుంది.

రంగ వల్లులు


మా చిరునామా
మానవి, నవతెలంగాణదినపత్రిక, ఎం.హెచ్. భవన్, 21/1, అజామాబాద్, హైదరాబాద్-20.
ఇ-మెయిల్: manavi@navatelangana.com



21చుక్కలు
మధ్యచుక్క 11 వచ్చేవరకు



ఐ.స్వరూప
మిర్యాలపెంట





సి.రాజ్యలక్ష్మి
ఎ.ఎస్‌రావు నగర్



విశ్వేశ్వరి, వనపర్తి

16చుక్కలు
సందు చుక్క



ఏపీలో వాహనాలకు ఇకపై ఒకే సిరీస్ నంబర్లు

దేశంలోనే ప్రథమంగా అమలు

అమరావతి: దేశంలోనే ప్రథమంగా ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ సరికొత్త నిర్ణయం తీసుకున్నది. 'ఒక రాష్ట్రం - ఒక నంబర్' విధానం అమలులోకి తీసుకురావాలని నిర్ణయించింది. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్‌కు ఒకే సిరీస్ నంబర్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వాహనాలకు ఒకే సిరీస్ ఉండేలా చర్యలు తీసు కోనున్నారు. దీంతో వాహనాన్ని ఎక్కడి నుంచైనా రిజిస్ట్రేషన్ చేయించుకునేలా సదుపాయం కలగనున్నది. ఏపీ 39 సిరీస్‌తో కొత్త రిజిస్ట్రేషన్‌లు షురూ కానున్నాయి. ఒకే సిరీస్ విధానంతో రవాణా శాఖకు అధిక ఆదాయం వస్తుందని ఆ రాష్ట్ర రవాణ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. వాహనదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు.


కాలినడకన తిరుమలకు జగన్



తిరుపతి : ప్రధాన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రజా సంకల్పయాత్ర, బహిరంగసభలను బుధవారం సాయంత్రం ముగించుకున్న జగన్ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో రేణిగుంటకు గురువారం ఉదయం 10.10 గంటలకు చేరుకున్నారు. రేణిగుంట నుంచి భారీ ఎత్తున, అడుగడుగునా స్వాగతం పలికారు. రోడ్డు మార్గంలో తిరుపతి పద్మావతి అతిథిగృహానికి చేరుకున్న ఆయన మూడు గంటలపాటు విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం 1.35కు అలిపిరి మీదుగా పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు కొట్టి కాలినడకన తిరుమలకు బయలుదేరి వెళ్లారు. శుక్లాగిరి పర్వతం వద్ద సాధారణ భక్తుల మాదిరిగానే క్యూలైన్లో వెళ్లి నడకదారిన వచ్చే భక్తులకు ఇచ్చే శ్రీవారి దర్శన టోకెన్‌ను తీసుకుని ముందుకు సాగారు. ఆయనతో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు భూమన కరుణాకర్‌రెడ్డి, నగరి ఎంఎల్‌ఏ రోజా, చంద్రగిరి ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉన్నారు. సాయంత్రం 4.40 నిమిషాలకు తిరుమలకు చేరుకుని, శ్రీకృష్ణ అతిథిగృహానికి వెళ్లారు. రాత్రి 7.30 గంటలకు సామాన్యుల దర్శన క్యూలైన్‌లో వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం బయటకు వచ్చి విశాఖ పీఠాధిపతి స్వరూపానందస్వామి ఆశీస్సులు తీసుకుని, రాత్రి తిరుమలలోనే బస చేశారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు రోడ్డు మార్గంలో కడప మీదుగా పులివెందుల వెళ్లనున్నారు. ప్రధాన ప్రతిపక్షనేత కావడంతో భారీఎత్తున భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. 2003లో జగన్ తండ్రి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర అనంతరం ఇచ్ఛాపురం నుంచి రైల్లో రేణిగుంటకు చేరుకున్నారు. అనంతరం పద్మావతి అతిథిగృహం చేరుకుని విశ్రాంతి తీసుకుని తిరుమలకు కాలినడకన వెళ్లారు.

బడి పిల్లల వివరాలు ఆధార్‌తో అనుసంధానం

- 48 లక్షల మందికి తిరిగి ఐరీష్, వేలిముద్రల సేకరణ
- యూఐడీఏఐ భాగస్వామ్యంతో నిర్వహణ
- పాఠశాల విద్యాశాఖ సన్నాహాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలల్లో చదివే పిల్లల వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. రాష్ట్రంలో 58 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రయివేటు బడుల్లో చదువుతున్నారు. వారిలో పది లక్షల మంది ఆధార్ వివరాలే సక్రమంగా ఉన్నాయి. మిగిలిన 48 లక్షల మంది విద్యార్థుల వివరాలు సరిగ్గా లేవు. దీంతో 48 లక్షల మంది విద్యార్థులకు తిరిగి ఐరీష్, వేలిముద్రలను సేకరించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకోసం యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) భాగస్వామ్యంతో నిర్వహించాలని భావించింది. అందులో భాగంగానే యూఐడీఏఐకి లేఖ రాసింది. దీంతో యూఐడీఏఐ అందుకు అంగీకరించింది. జిల్లాల వారీగా ప్రత్యేకంగా ఆధార్ నమోదు యంత్రాలను ప్రత్యేకంగా సమకూర్చాలని నిర్ణయించింది. ఇందుకయ్యే ఖర్చును పూర్తిగా యూఐడీఏఐ భరించనుంది. ఇంకోవైపు ఆధార్ నమోదుకు విద్యార్థుల నుంచి ఒక్క రూపాయి వసూలు చేయబోరు. పూర్తిగా ఉచితంగా సేవలు అందిస్తున్నట్టు యూఐడీఏఐ ప్రకటించింది. ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ వద్ద 400 వరకు ఆధార్ నమోదు యంత్రాలున్నాయి. కొత్తగా 900 వరకు ఆధార్ నమోదు యంత్రాలను సమకూరుస్తామని యూఐడీఏఐ పేర్కొంది. మరోవైపు ఆధార్ నమోదుకు అవసరమైన సిబ్బందినీ ప్రత్యేకంగా నియమిస్తామని పాఠశాల విద్యాశాఖకు యూఐడీఏఐ తెలిపింది. ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా విద్యార్థుల నుంచి సమగ్రంగా వివరాలు సేకరించాలని విద్యాశాఖ భావిస్తున్నది. ఐరీష్, వేలిముద్రలు, పేరులో తప్పుల సవరణ, అడ్రస్‌లో మార్పులు ఇలా అన్నింటినీ సమగ్రంగా సేకరించాలని నిర్ణయించింది. ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఈ నిర్ణయం : అధికారులు

సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఆధార్ నెంబర్ తప్పనిసరి కాదు. కానీ విద్యార్థుల భవిష్యత్తు అవసరాల కోసమే ఆధార్ వివరాలను సేకరిస్తున్నామని విద్యాశాఖ అధికారి ఒకరు చెప్పారు. ఉన్నత విద్యకు వెళ్లాలంటే విద్యార్థులకు ఆధార్ నెంబర్ అవసరమవుతుందని అన్నారు. ఒకవేళ ఆధార్ లేకపోతే మరో గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు వంటి గుర్తింపు కార్డులు విద్యార్థులకు ఉండే అవకాశం లేనందున ఆధార్ వివరాలను సేకరించాల్సి వస్తోందని వివరించారు. ఇంటర్, ఆపై చదువులకు వెళ్లినా ఆధార్ నెంబర్‌తో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులుండబోవని స్పష్టం చేశారు.

క్రికెట్‌ను నిషేధిస్తే.. ఇతర క్రీడలకు మనుగడ

సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి

- బంగారు పతకం సాధించిన వారికి సత్కారం



నవతెలంగాణ - సిటీబ్యూరో

దేశంలో అన్ని క్రీడలు మనుగడ సాగించి అభివృద్ధి చెందాలంటే క్రికెట్‌ను నిషేధించాలని సీనియర్ జర్నలిస్టు, హైదరాబాద్ జిందాబాద్ అధ్యక్షులు పాశం యాదగిరి అన్నారు. నేషనల్ ఫీల్డ్ ఆర్చరీ, అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు సాధించిన నగరానికి చెందిన రహమతున్నిసాబేగం, సాయి లలిత్‌కుమార్‌ను గురువారం నగరంలోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్చరీ, పవర్ లిఫ్టిం గ్‌లు చాలా కష్టమైనవే కాకుండా అధిక వ్యయంతో కూడుకున్న క్రీడల న్నారు. ఏదైనా టార్గెట్‌ను గురిచూసి కొట్టాలంటే పూర్వం బాణం గుర్తునే అధికంగా వినియోగించేవారనీ,ప్రస్తుతం తుపాకీ చూపిస్తున్నారనీ అన్నారు.

జీహెచ్ఎంసీ క్రీడల విభాగం ఓఎస్డీ డాక్టర్ ఎస్ఆర్ ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ.. రహమతున్నీసా బేగం, సాయి లలిత్‌కుమార్‌కు జీహెచ్ఎంసీ, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నుంచి ప్రోత్సాహంతో పాటు నగదు రూపంలో పారితోషికం అందేలా చూస్తామన్నారు. ఈ క్రీడాకారులకు అడ్వాన్స్ ట్రైనింగ్ ఇప్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. భవిష్యత్‌లో వీరిద్దరు అంతర్జాతీయ క్రీడాపోటీలకు ఎదగాలని ఆకాక్షించారు. టీఎస్ ఆర్టీసీ పీఆర్వో కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలకు ఫ్లెక్సీబులిటీతో పాటు శక్తి కావాలని, క్రీడాకారులకు క్రీడలతో పాటు చదువు కూడా ఉంటే భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్చరీ కోచ్ గంగరాజు, పవర్ లిఫ్టింగ్ కోచ్ చంద్రశేఖర్, రహమతున్నీసా బేగం తండ్రి నిసార్, సాయి లలిత్‌కుమార్ తండ్రి సత్యనారాయణ, హైదరాబాద్ జిందాబాద్ ఉపాధ్యక్షులు వీరయ్య, రమణ, జేకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సిబ్బంది గోస వినపడదా!

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిలదీసిన మధు

- సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఎంకు లేఖ
- విజయవాడలో ఉద్యోగుల భారీ ర్యాలీ



అమరావతి : సమస్యల పరిష్కారం కోసం రోజుల తరబడి ఆందోళన చేస్తున్నా పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా విజయవాడలో పీఏసీఎస్ ఉద్యోగులు భారీ ప్రదర్శన నిర్వహించారు. రోజుల తరబడి సమ్మె, నిరాహార దీక్షలు చేస్తున్నా స్పందించకపోవడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 3 వ తేది నుంచి చేస్తున్న నిరాహార దీక్షలను విరమించిన వారు గురువారం విజయవాడకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన ప్రదర్శన అలంకార్ సెంటర్లోని ధర్నా చౌక్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. రైల్వేస్టేషన్ నుండి బయలుదేరిన ప్రదర్శన గాంధీనగర్, ఏలాపురం మీదుగా ధర్నాచౌక్‌కు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు ఈ ప్రదర్శనలో మారుమోగాయి. అనంతరం ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు పి.వి.సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి. మధు మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు దారుణమని అన్నారు. వారి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ బహిరంగ సభ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఆయన లేఖ రాశారు. సభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.గఫూర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు 43 శాతం పీఆర్సీ ఇచ్చారని, మరలా అదే ఉద్యోగులు 35 శాతం పెంచాలని అడుగుతున్నారని, అదే సమయంలో పీఏసీఎస్ ఉద్యోగులకు ఎప్పుడో పెంచిన వేతన సవరణకు ఇప్పుడు పదిశాతం ఇవ్వాలని కమిటీ సూచించడం దారుణమన్నారు. సర్వీసు రూల్స్ ప్రకారం ప్రతి 15 రోజులకు ఒకసారి వేతనం గ్రాట్యుటీ ఇవ్వాల్సి ఉండగా లక్ష, రెండు లక్షలతో సరిపెట్టుకోవాలని సూచించడం మానవత్వం కాదని పేర్కొన్నారు. శాసనమండలిలో పీడీఎఫ్ పక్షనేత వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉద్యోగులకు తమ సంపూర్ణమద్దతు ఉంటుందని తెలిపారు. ఎవరి ప్రభుత్వం అధికారంలో ఉన్నా లేకపోయినా కార్మికులు, ఉద్యోగుల తరుపున పోరాడేది ఎర్ర జెండా మాత్రమేనని అన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ సహకార రంగంలో అమలవుతున్న సంస్కరణలపై ఉద్యోగులు పోరాడి సంస్థను నిలబెట్టుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు ముజఫర్, రమాదేవి, ఆర్.వి.నరసింహారావు తదితరులు మాట్లాడారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, కోశాధికారి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ కౌన్సిల్ నామినేటెడ్ సభ్యునిగా సంజయ్‌రెడ్డి

- ఉత్తర్వులు జారీచేసిన తెలంగాణ సర్కార్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ నామినేటెడ్ సభ్యునిగా డాక్టర్ ఆకుల సంజయ్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయనతో మరో నలుగురిని కూడా నామినేటెడ్ కేటగిరీలో చేరుస్తూ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎ.శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్మసీ చట్టం-1948 సెక్షన్ 19 ప్రకారం నియా మకాలు చేపట్టినట్టు జీఓ ఎంఎస్ నెం.1లో పేర్కొన్నారు. సంజయ్‌రెడ్డి (హైదరాబాద్)తోపాటు కె.శ్రీనివాస్ (సిరిసిల్లా), ఆర్.శ్రీనివాస్ (వరంగల్), టి.చంద్రశేఖర్ అజాద్ (నల్లగొండ), ఎం.వినోద్‌కుమార్ (పెద్ద పల్లి)లు ఐదేండ్ల పాటు నామినేటెడ్ హోదాలో కొనసాగుతారు. సంజయ్‌రెడ్డి ప్రస్తుతం తెలంగాణ ఫార్మ సొసైటీ రాష్ట్ర అధ్యక్షునిగా కూడా కొనసాగుతున్నారు.

ప్రభుత్వానికి సలహాలు, సూచనలు, అవార్డులు

ఇలా ఉండగా, రాష్ట్రంలో ఫార్మా యూనివర్సిటీ, ఫార్మసీ కౌన్సిల్ ఏర్పాటులో డాక్టర్ సంజయ్‌రెడ్డి కీలకపాత్ర పోషించారు. ఐదేండ్ల క్రితం ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పలుమార్లు కలిసి రాష్ట్రంలో ఫార్మసీ కౌన్సిల్ ఎలా ఏర్పాటు చేయాలనే దానిపై అనేక సార్లు నివేదికలు సమర్పించారు. వైద్యఆరోగ్యశాఖ మాజీ లక్ష్మారెడ్డి, ఉన్నతాధికారులకు ఫార్మసీ కౌన్సిల్‌పై సలహాలు, సూచనలు అందజేశారు. ఏపీ ఫార్మసీ కౌన్సిల్ గుంటూరుకు తరలిపోతున్న సమయంలో రాష్ట్ర ఖజానాకు చెందిన సుమారు రూ.7 కోట్లకుపైగా నిధులను అక్రమంగా ఏపీ ఖాతాలో వేసేందుకు అక్కడి అధికారులు యత్నించారు. దీన్ని సంజయ్‌రెడ్డి చాకచక్యంగా అడ్డుకుని రాష్ట్ర సర్కారును అప్రమత్తం చేసి విజయం సాధించారు. ఆయన చేసిన సేవలకుగాను డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలామ్ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు, గోల్డ్‌మెడల్ ఫర్ అకాడమిక్ డిస్టింక్షన్, స్టార్ మెడల్ వంటి అవార్డులు వచ్చి చేరాయి. కేంద్ర మాజీ మంత్రి ఎం.వెంకయ్యానాయుడు, జాతీయ ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడు బి.సురేష్ నుంచి ప్రశంసలు పొందారు. అంతేకాండా తెలంగాణ ఉద్యమంలో కీలకమైన సకల జనుల సమ్మె, సకలజన భేరీ, శ్రీకృష్ణ కమిటీకి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయడంలో ఆయన పాత్ర మరువలేనిది. సంజయ్‌రెడ్డి నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీరాంసాగర్‌లో తగ్గిన నీటిమట్టం

పెద్దపల్లి జిల్లాలో నాలుగు తడులకే నీరు


- గతేడాది పరిస్థితే పునరావృతం

నవతెలంగాణ-పెద్దపల్లి ప్రతినిధి

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో తగ్గిన నీటి మట్టంతో పంటలు గట్టెక్కేలా లేదు. గతేడాది ఈ సీజన్‌లో ఉన్నదానికంటే కూడా తక్కువ నీరుంది. ఈ యాసంగిలో దిగువన ఆయకట్టుకు 20 టీఎంసీల నీళ్లే కేటాయించారు. అందులోనూ పెద్దపల్లి జిల్లాకు నాలుగు తడులకే పరిమితం చేశారు. ఇంకా నారు మడుల్లోనే ఉన్న వరి ఈ నాలుగు తడులతో పారడం కష్టమే. గతేడాది ఇదే సీజన్‌లో ప్రాజెక్టులో 45టీఎంసీలు ఉండగా జిల్లా కాలువలకు ఏడు తడుల కింద నీళ్లు వదిలారు. అవి సరిపోక పంటలెండిన అనుభవమూ ఉంది. ఈ యాసంగికి ప్రాజెక్టులో కేవలం 33.30టీఎంసీల నీళ్లే ఉండటం, అందులోనూ నాలుగు తడులకే నీళ్లు వదులుతామని అధికారులు వల్ల గతేడాది కంటే గడ్డు పరిస్థితి ఎదురయ్యే పరిస్థితి ఏర్పడింది.

ఎస్ఆర్ఎస్‌పీ (డి-83) కాలువ పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లి, జూలపల్లి, శ్రీరాంపూర్, రామగుండం, మంథని మండలాల నుంచి 130 గ్రామాల మీదుగా నీటిని సరఫరా చేస్తోంది. ఈ కాలువ కింద లక్షా 22వేల ఎకరాల ఆయకట్టు ఉంది. (డి-86) కాలువ పెద్దపల్లి, జూలపల్లి, ఎలిగేడు, సుల్తాన్‌బాద్, ఓదెల, కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లో 145 గ్రామాల మీదుగా 83వేల ఎకరాలకు నీరందిస్తోంది. ప్రాజెక్టు కాలువల కింద లక్షా 85వేల ఎకరాలు, చెరువులు, కుంటలపై ఆధారపడి మరో 50వేల ఎకరాలు, ఉస్సేన్‌మియా లాంటి వాగుల కింద మరికొంత కలిపి జిల్లాలో 2లక్షల 74వేల ఎకరాల్లో ఆయకట్టు భూములు ఉన్నాయి. అయితే, యాసంగిలో ఈ ఆయకట్టు సాగుకు నీటి కష్టాలు అప్పుడే మొదలయ్యాయి.

దిగువ ఆయకట్టుకు 20 టీఎంసీలే..



ఎస్ఆర్ఎస్పీ కాలువలు

గతేడాదీ నష్టాలే..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో గతేడాది ఈ సీజన్‌లో 70టీఎంసీలు ఉండాల్సి ఉండగా, 45 టీఎంసీలు మాత్రమే ఉంది. అప్పుడు పెద్దపల్లి జిల్లాకు 6టీఎంసీల నీరు కేటాయించారు. డీ-83, డీ-86కాలువలకు మూడు టీఎంసీల చొప్పున 7 విడతలుగా విడుదల చేశారు. అయినా, చివరి ఆయకట్టుకు నీరు అందక శ్రీరాంపూర్, ఓదెల మండలాల రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది ప్రాజెక్టులో కేవలం 33.30టీఎంసీల నీరే ఉంది. నీటి నిల్వను బట్టి ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎల్ఎమ్‌డి వరకు 20 టీఎంసీల నీరు మాత్రమే కేటాయించినట్టు గత నెలలో హైదరాబాద్‌లో నిర్వహించిన శివం కమిటీలో నిర్ణయించినట్టు అధికారులు ప్రకటించారు. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లాకు ఈ యాసంగిలో నాలుగు తడులకే నీరందిస్తామని ఇటీవల కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు. ఈనెల 15 నుంచి నీటి సరఫరా చేయనున్నట్టు తెలిపారు.

అప్పటికే జిల్లాలో యాసంగి పంటల సాగు మొదలు పెట్టారు. రబీ సాధారణ సాగు విస్తీర్ణం లక్షా 15వేల 517కాగా, వరి 90వేల 312 ఎకరాలు సాగుకు సిద్ధమయ్యారు. 7వేల 412 ఎకరాల్లో నాట్లు కూడా వేశారు. మొక్కజొన్న విత్తనాలు కూడా నాటారు. ఈనెలాఖరు వరకు పంటల సాగు మరింత పెరగనుంది. రైతాంగం గతేడాది మాదిరిగానే వరి సాగుకు మొగ్గు చూపుతున్న క్రమంలో అధికారులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలన్న ప్రకటనలు క్షేత్రస్థాయికి తీసుకెళ్లలేకపోయారు. దీంతో గతేడాది పంటలెండిన పరిస్థితులే పునరావృతం అయ్యే అవకాశం ఉంది.

కాల్వ నీళ్లురాకుంటే అంతే సంగతి: గోట్టం మల్లయ్య- ఓదెల మండలం, కనగర్తి



నాకున్న రెండు ఎకరాల పొలం బోరు బావిపై ఆధారపడి సాగు చేశాను. నాట్లు కూడా వేశాను. అయితే బోరు బావిలో రెండు నెలలైతే నీళ్లు తగ్గిపోయే పరిస్థితి. ఆ తర్వాత ఎస్ఆర్ఎస్‌పీ కాల్వ నుంచి నీరు రాకపోతే పంట ఎండిపోయే ప్రమాదం ఉంది.

కాల్వ నీరిస్తేనే పంట వచ్చేది: కనుగుంట్ల ఐలయ్య- ఉప్పరపల్లి, ఓదెల మండలం



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. ఎస్ఆర్ఎస్పీ కాల్వ ద్వారా నీరొస్తేనే పొలం పండుతుంది. నారు పోశాను. నాట్లు వేద్దామంటే నీరు విడుదల చేయడం లేదు. ఈ సారి నాలుగు తడులకే నీరొస్తే పొలం పారడం కష్టమే.

ఈసారి నాలుగు తడులే..: ఎస్ఆర్ఎస్పీ, పెద్దపల్లి డి-83 కాల్వ ఈఈ మధుసూదనరావు

ఈ ఏడాది శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వ తగ్గడం వల్ల జిల్లాలో ఉన్న కాలువల ద్వారా పంటలకు నాలుగు తడులే సరఫరా చేయాలని నిర్ణయించాం. దాని ప్రకారం జనవరి 15 నుం చి మార్చి7 వరకు నీరు విడదల చేస్తాం. ఆ నీటిని రైతులు చాలా పొదుపుగా వినియోగించుకోవాలి. కేవలం ఆరుతడి పంటలే సాగు చేసుకోవాలి.

సమ్మెను జయప్రదం చేసిన ప్రజలకు సీపీఐ(ఎం) అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 8,9 తేదీల్లో జరిగిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేసిన కార్మికులకు, ఉద్యోగులకు, యావత్ ప్రజానీకానికి సీపీఐ(ఎం) రాష్ట్రకమిటీ అభినందనలు తెలిపింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీర భద్రం గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. దేశంలో అధిక ధరలు తగ్గించాలనీ, ఉపాధి కల్పించాలనీ, కనీసవేతనాలు అమలు చేయాలనీ, ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల అమ్మకాలను ఆపాలనీ, కాంట్రాక్టు వ్యవస్థ రద్దు చేయాలనీ, కార్మిక చట్టాల సవరణను నిలిపివేయాలనీ, ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలనీ, సంక్షేమపథకాల అమలు పరచాలనీ, నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలనీ, వ్యవసాయ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలనీ, రైతులకు మద్దతు ధర ఇవ్వాలనే డిమాండ్లపై కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ సమ్మె జరిగిందని తెలిపారు. ఈ సమ్మెలో ఎల్ఐసీ, జీఐసీ, ఇన్స్యూరెన్సు, బ్యాంకింగ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, తపాలా, బీఎస్ఎన్ఎల్, బీడీఎల్, మెడికల్ రిప్స్, ఆర్టీసీ, సింగరేణి కార్మికులు, స్కీం వర్కర్స్, భవన నిర్మాణ కార్మికులు, హమాలీ కార్మికులు, ఆటో, ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు రంగం, మున్సిపల్, గ్రామపంచాయితీ ఉద్యోగులు, బీడీ కార్మికులు, విద్యుత్, పరిశ్రమల వర్కర్స్ (క్లస్టర్స్) పాల్గొని జయప్రదం చేశారని పేర్కొన్నారు. వామపక్ష పార్టీల కార్యకర్తలు, రైతు, వ్యవసాయ కార్మిక తదితర ప్రజాసంఘాల కార్యకర్తలు మద్దతుగా పాల్గొన్నారని తెలిపారు. రెండు రోజుల సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న కార్మికసంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఫెడరేషన్లు, యావత్ ప్రజానీకానికి అభినందనలు ప్రకటించారు.

ప్రజా సమస్యలు గాలికొదిలిన కేసీఆర్

ప్రతిపక్షం లేకుండా చేసేందుకు కుట్ర

- ఎన్నికల్లో లబ్ధి కోసమే రిజర్వేషన్ల పెంపు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి

నవతెలంగాణ- సూర్యాపేట

రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు గడుస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా సమస్యలను గాలికొదిలేసి పర్యటనలు చేస్తున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేటలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణ చేపట్టకుండా, పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచే ఏర్పాట్లలో కేసీఆర్ తర్జన, భర్జన పడుతూ రాష్ట్రంలోని సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లోకి చేర్చుకొని ప్రతిపక్షం లేకుండా చేయాలని కుట్రపన్నుతున్నారని విమర్శించారు. ప్రధానంగా కొడుకును సీఎం చేయాలనే తపనతోనే మంత్రివర్గం ఏర్పాటు వేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు, అధికారం, పథకాల ప్రలోభాలతో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ అదే తరహాలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో స్థానాలను కైవసం చేసుకునేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి సర్పంచ్ ఎన్నికల్లో వేలం పాటలు పెట్టి ఎన్నుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. దాదాపుగా రూ.20 నుంచి రూ.50 లక్షలు పెట్టి సంతలో పశువులను కొనుగోలు చేసినట్టు సర్పంచ్ అభ్యర్థులను కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాల వల్ల నిజాయితీపరులు ఎన్నికల్లో గెలిచే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రానున్న పార్లమెంట్ ఎన్నికలను దష్టిలో పెట్టుకొని హడావుడిగా అగ్రకుల పేదలకు 10 శాతం రిజర్వేషన్ సౌకర్యాన్ని తీసుకొచ్చిందనీ, దీనిలో పారదర్శకత లోపించిందనీ అన్నారు. రాష్ట్రంలో మైనార్టీలకు 12 శాతం, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు కూడా మోడీ ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేశారు. కొన్నేండ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళల 33 శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదింపజేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ములకలపల్లి రాములు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి రావు, బుర్రి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూలకంటి

సాంకేతిక పరిజ్ఞానం, ప్రమాణాలతో 'నాణ్యమైన విద్య'

మా దేశంలో తెలంగాణ విద్యార్థులు చదవాలి

- ఇస్తోనియా అంబాసిడర్ రిహో క్రూవ్
- సత్సంబంధాలు మెరుగుపరుస్తాం : పాపిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ దేశంలో సాంకేతిక పరిజ్ఞానం, ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తున్నామని ఇస్తోనియా అంబాసిడర్ రిహో క్రూవ్ అన్నారు. తమ దేశం సాంకేతిక పరిజ్ఞానం, సుపరిపాలన, సైబర్ సెక్యూరిటీ, ఇంజినీరింగ్ రంగాల్లో ప్రపంచంలోనే ముందంజలో ఉందని వివరించారు. అందుకే తమ దేశంలో చదివేందుకు తెలంగాణ విద్యార్థులు ఆసక్తి కనబరచాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని ఇస్తోనియా అంబాసిడర్ రిహో క్రూవ్, ఇస్తోనియా స్పోక్స్‌పర్సన్ పాయల్ రాజ్‌పాల్ సందర్శించారు.



మాట్లాడుతున్న పాపిరెడ్డి


ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రిహోక్రూవ్ మాట్లాడుతూ ఉన్నత విద్యకు ఇస్తోనియా మంచి ప్రాంతమని అన్నారు. అక్కడ చదువుతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని చెప్పారు. యూజీ, పీజీలో 160 కోర్సులు అందిస్తున్నామని వివరించారు. స్టార్టప్‌లు, ఇంకుబేటర్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగడం, సైబర్ సెక్యూరిటీ, సుపరిపాలన, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలతో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నామని అన్నారు. ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవడంలో ముందంజలో ఉంటారని చెప్పారు. ఇస్తోనియా జనాభా 13 లక్షలే అయినా అన్ని రంగాల్లో ముందుంటారని అన్నారు. ఇస్తోనియాలో చదివే విద్యార్థులు యూరప్ మొత్తం తిరిగేందుకు అవకాశముంటుందని వివరించారు.

అంతర్జాతీయ డిగ్రీలతో ఉపాధి పొందొచ్చని సూచించారు. ఇస్తోనియాలో డిగ్రీ కోర్సులకు రూ.1.50 లక్షల నుంచి రూ.5.50 లక్షల ఫీజులు వసూలు చేస్తామని అన్నారు. భారతీయ విద్యార్థుల్లో 98లో 95 శాతం మందికి స్కాలర్‌షిప్‌లు అందుతున్నాయని చెప్పారు. ఇస్తోనియాలో ఏడు విశ్వవిద్యాలయాలున్నాయనీ, అందులో ఒకటి అంతర్జాతీయ స్థాయిలో టాప్ వందలో ఒకటని అన్నారు. ఇస్తోనియాలో ఉన్న మెరుగైన విద్యావిధానాన్ని తెలంగాణకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంటామని అన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి మాట్లాడుతూ ఇస్తోనియా జనాభాతోపాటు భౌగోళికంగా చిన్నదేశం అయినా సాంకేతిక పరిజ్ఞానంలో అగ్రగామిగా ఉందన్నారు. టాప్ వందలో ఒక వర్సిటీ ఉందంటే నాణ్యమైన విద్య అందిస్తుందనడానికి నిదర్శనమని అన్నారు. మార్చి లేదా ఏప్రిల్‌లో ఉన్నత విద్యామండలి, విశ్వవిద్యాలయాల ప్రతినిధి బృందం ఇస్తోనియా సందర్శిస్తుందని చెప్పారు.

అక్కడ విద్యారంగంలో అమలవుతున్న విధానాలు పరిశీలించి ఆ వర్సిటీలతో తెలంగాణ విశ్వవిద్యాలయాలు ఒప్పందం కుదుర్చుకుంటామని అన్నారు. తెలంగాణ విద్యార్థులు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా మాత్రమే కాకుండా ఇతర దేశాల్లో చదివేందుకు ఆసక్తి చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు ఆర్ లింబాద్రి, వి వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, సభ్యులు ఓ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యెమెన్ సైనిక శిబిరంపై డ్రోన్ దాడి

- ఇంటెలిజెన్స్ చీఫ్ సహా ఐదుగురు అధికారులు మృతి, 20 మందికి గాయాలు




సనా : యెమెన్ సైనిక శిబిరంపై హౌతీ తిరుగుబాటుదారులు డ్రోన్ దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఇంటెలిజెన్స్ చీఫ్ సహా ఐదుగురు సైనికాధికారులు మృతి చెందగా, 20 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను సైనిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. ఆర్మీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం...అల్-ఆనద్ మిలిటరీ బేస్‌పై డ్రోన్ దాడి జరిగింది. ఈ ఘటనలో ఇంటెలిజెన్స్ చీఫ్ మొహ్మద్ సలేహ్ తమాహ్ సహా ఐదుగురు సైనికులు మృతిచెందారు. మృతుల్లో సీనియర్ మిలిటరీ కమాండర్ మొహ్మద్ జాస్, తహీజ్ ప్రావిన్స్ గవర్నర్ అహ్మద్ అల్-తుర్కీతో పాటు మరో అధికారి ఉన్నారు. యెమెన్ ఆర్మీ చీఫ్ అబ్దుల్లా అల్ నఖీ తీవ్రంగా గాయపడ్డారు.

తాలిబన్ల దాడిలో 21 మంది సైనికులు మృతి

తాలిబన్ల మెరుపు దాడిలో 21 మంది సైనికులు మృతి చెందగా, పదుల సంఖ్యలో గాయపడినట్టు ఆఫ్ఘాన్ సైన్యం ధ్రువీకరించింది. బాద్గీస్ ప్రావిన్స్ గవర్నర్ అధికార ప్రతినిధి జమ్‌షెడ్ షాహబీ తెలిపిన వివరాల ప్రకారం....అఫ్ఘనిస్తాన్ ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో తాలిబన్లు మెరుపుదాడులకు పాల్పడుతున్నారు. బుధవారం తాలిబన్లకు, సైనికులకు మధ్య జరిగిన భీకరపోరులో ఆరుగురు సైనికులు, ఏడుగురు పోలీసులు సహా 21 మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో సైనికులు గాయపడ్డారు. కుందుజ్ ప్రావిన్స్‌లో తాలిబన్లు మెరుపుదాడులకు పాల్పడుతున్నారు. తాలిబన్లు శాంతి చర్చలకు రావాలని అఫ్ఘాన్, పాకిస్తాన్ ప్రభుత్వాలు పిలుపునిచ్చాయి. అయితే, ఈ చర్చలకు తాము సిద్ధంగా లేమని తాలిబన్లు పేర్కొన్నారు. భద్రతాబలగాలు, పోలీసులను లక్ష్యంగా చేసుకొని మెరుపుదాడులకు పాల్పడుతున్నారు. అఫ్ఘనిస్తాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ వెల్లడించిన వివరాల ప్రకారం...2015 నుంచి గతేడాది నవంబర్30నాటికి భద్రతా బలగాలు, సైనికులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 28,589 మంది సైనికులు, పోలీసులు మృతి చెందారు.

కాంగో అధ్యక్షుడిగా ప్రతిపక్ష నేత షెలిక్స్ విజయం



కిన్షాసా : కాంగో అధ్యక్ష ఎన్నికల్లో ప్రతిపక్ష నేత ఫెలిక్స్ త్సిషెకెది గెలుపొందినట్టు ఎన్నికల కమిషన్ గురువారం ప్రకటించింది. కాగా ఈ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా నిరసనలకు సమాయత్తమవుతున్నారు. మాజీ ప్రతిపక్ష నేత ఎటిన్నె కుమారుడైన ఫెలిక్స్‌కు 38శాతం ఓట్లు అంటే 70లక్షలకు పైగా ఓట్లు వచ్చినా ఆధిక్యతలో ఉండే అభ్యర్థిగా ఆయనను ఏనాడు పరిగణించలేదు. పాలక పార్టీ అభ్యర్థి ఎమ్మాన్యుయెల్ రమజాని షెడారికి 40లక్షల ఓట్లు అంటే 23శాతం ఓట్లు వచ్చాయి. పాలక పార్టీ అభ్యర్థి గెలుపు సాధించే అవకాశాలు లేకపోవడంతో ఒప్పందం కుదుర్చుకోవాలని అధ్యక్షుడు జోసెఫ్ కబిలా ప్రభుత్వం భావిస్తున్నట్టు కొంతమంది పరిశీలకులు తెలిపారు. అయితే, కాంగోలో విస్తృతంగా పాతుకుపోయిన అవినీతిని ప్రక్షాళన చేస్తానని ప్రతిజ్ఞ చేసిన ప్రతిపక్ష అభ్యర్థి మార్టిన్ ఫయులూ ఈ ఫలితాలను సవాలు చేస్తారా లేదా అనేది వెంటనే తెలియరాలేదు. ఈ ఫలితాలను సవాల్ చేయడానికి రాజ్యాంగ కోర్టు 14రోజుల గడువు ఇచ్చింది. ఫయులూకు 60లక్షల కోట్లు లేదా 34శాతం ఓట్లు వచ్చాయి. 1960 తర్వాత కాంగోలో ఇంత ప్రశాంతంగా అధికార బదిలీ ప్రజాస్వామ్యబద్ధంగా జరగడం ఇదే ప్రథమం. కాగా, త్సిషెకెది పార్టీ ప్రధాన కార్యాలయంలో సంబరాలు అంబరాన్నంటాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత ఎన్నికల ఫలితాలను ప్రకటించడంతో వందలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నృత్యాలు, సంబరాలు చేసుకున్నారు.

నవాజ్ షరీఫ్‌కు అస్వస్థత

ఇస్లామాబాద్: పనామా పత్రాల కుంభకోణం కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ అస్వస్థతతకు గురయ్యారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఒంటి నొప్పులతో బాధపడుతుండడంతో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాకిస్థాన్ ముస్లిం లీగ్ నవాజ్ (పీఎంఎల్ ఎన్) లీడర్, షరీఫ్ కుమార్తె మరియం నవాజ్ తండ్రి అనారోగ్యం గురించి తెలిసి మంగళవారం ఆయనను కలిశారు. 69 సంవత్సరాల షరీఫ్‌కు డిసెంబర్ 24న అల్ అజీజియా కేసులో ఏడు సంవత్సరాల జైలు శిక్ష, పనామా పత్రాల కుంభకోణం కేసులో పది సంవత్సరాల శిక్షను విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. దీంతో పాటు 1.5 బిలియన్ డాలర్ల(రూ.1,05,62,23,50,000) , 25 మిలియన్ డాలర్లను (రూ.1,76,06,22,500) జరిమానా విధించింది. పది సంవత్సరాల శిక్ష పూర్తయిన తర్వాత షరీఫ్‌ను ఎటువంటి ప్రజా కార్యకలాపాల్లో పాల్గొనడానికి వీలు లేదని కోర్టు తీర్పునిచ్చింది.

డెమోక్రాట్ల సమావేశం నుంచి ట్రంప్ వాకౌట్



వాషింగ్టన్: అమెరికా-మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డెమోక్రాటిక్ పార్టీకి చెందిన ప్రముఖ నేతలతో సమావేశమయ్యారు. అయితే, ఈ సమావేశంలో పాల్గొన్న డెమోక్రాటిక్ పార్టీ నేతలు మెక్సికో గోడ నిర్మాణానికి నిధుల కేటాయింపునకు సంబంధించి ట్రంప్ చేసిన అభ్యర్థనలను తోసిపుచ్చారు. దీంతో డెమోక్రాట్లతో మాట్లాడడం సమయం వృథా అంటూ ట్రంప్ మీటింగ్ నుంచి లేచి బయటకు వెళ్లిపోయారు. 'ఇది పూర్తిగా టైం వేస్ట్' అని తర్వాత ట్వీట్ చేశారు. నేను వాళ్లకు బైబై చెప్పి వచ్చేశాను. ఆ సమావేశం ఏమాత్రం ఉపయోగకరంగా లేదు అని ట్వీట్‌లో పేర్కొన్నారు. మరోవైపు డెమోక్రాట్ నేత చక్ షమెర్ విలేకరులతో మాట్లాడుతూ.. "ట్రంప్ టేబుల్‌పై గట్టిగా చరిచి పైకి లేచి అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయారు. మరోసారి ఆయన కోపాన్ని ప్రదర్శించారు. ఎందుకంటే ఆయన అనుకుంది జరగట్లేదు కాబట్టి' అని అన్నారు. షట్‌డౌన్ ముగియాలంటే గోడ నిర్మాణానికి నిధులు కేటాయించాల్సిందేనని ట్రంప్ సమావేశంలో అన్నట్టు సమాచారం. అయితే డెమోక్రాటిక్ నేత, ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ అందుకు అంగీకరించలేదు. మెక్సికోతో సరిహద్దులో పటిష్ఠ భద్రత ఉండాలని, అందుకు గోడ నిర్మించాల్సిందేనని ట్రంప్ పట్టుబడుతున్నారు. గోడ నిర్మాణానికి నిధులు కేటాయించాలని అంటున్నారు. అయితే ప్రతిపక్ష డెమోక్రాట్లు మాత్రం నిధులు ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. దీంతో ద్రవ్య వినిమయ బిల్లు పెండింగ్‌లో ఉండిపోయి అమెరికా పాక్షికంగా షట్‌డౌన్ అయ్యింది. దీంతో గోడ నిర్మాణం విషయంలో పరస్పర అంగీకారం కోసం రిపబ్లికన్లు, డెమోక్రాట్ల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి.

అమెరికా ప్రభుత్వ పాక్షిక స్తంభన 19వ రోజుకు చేరుకుంది. షట్‌డౌన్ పరిష్కారం కోసం ఉద్దేశించిన ఈ చర్చలు విఫలమయ్యాయి. కేవలం 14 నిమిషాలు మాత్రమే చర్చలు కొనసాగినట్టు అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. ప్రభుత్వం పాక్షికంగా స్తంభించిన తర్వాత.. ఈ నెల 11న వేతనాలు చెల్లించాల్సి ఉంది. దాదాపు 8లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు.

వెనిజులా అధ్యక్షుడిగా మదురో ప్రమాణం

- రెండోసారి బాధ్యతలు చేపట్టనున్న యూఎస్‌పీవీ నేత



కరాకస్ : వెనిజులా అధ్యక్షుడిగా యూఎస్‌పీవీ (యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనిజులా) నేత నికోలస్ మదురో రెండోసారి ప్రమాణం చేయనున్నారు. మరో ఆరేండ్ల పాటు ఆయన అధ్యక్ష పదవిలో కొనసాగనున్నారు. వెనిజులాలో ఆర్థిక సంక్షోభం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఆర్థిక వ్యవస్థను మదురో గాడిలో పెట్టలేకపోయారనే విమర్శలు వచ్చాయి. యూఎస్‌పీవీ నేత తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్ష నేతలతో పాటు పలు లాటిన్ అమెరికా దేశాలు డిమాండ్ చేశాయి. అయితే, ఈ డిమాండ్లకు మదురో ఏమాత్రం తలొగ్గలేదు. దేశ సైన్యం కూడా మదురోకే మద్దతుగా నిలిచింది. మదురో మరోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం పట్ల క్యూబా అధ్యక్షుడు ముగ్వెల్ డియాజ్ కానెల్, బొలీవియా అధ్యక్షుడు ఈవో మొరెల్స్ హర్షం వ్యక్తం చేశారు. దేశ ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టగలిగే సామర్థ్యం కేవలం మదురోలో ఉందని కితాబిచ్చారు. మదురో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తాము హాజరవుతామని ప్రకటించారు. కాగా, వెనిజులాను ఆర్థికంగా దెబ్బతీసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుట్ర పన్నారని మదురో విమర్శించారు. తనను గద్దె దింపాలనే కుట్రతో వెనిజులాపై ఆర్థిక ఆంక్షలు మోపారని విమర్శించారు. తనకు మరోసారి అవకాశం ఇచ్చిన దేశ ప్రజలకు పారదర్శకమైన పాలన అందిస్తానని చెప్పారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతానని, అవసరమైనట్టయితే అంతర్జాతీయ సమాజ సాయం తీసుకుంటానని అన్నారు. వెనిజులాలో ఆహారం, మందుల కొరత కారణంగా 2015 నుంచి గతేడాది డిసెంబర్ నాటికి 23 లక్షల మంది ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారని ఐరాస పేర్కొంది. మదురో ప్రమాణం నేపథ్యంలో భారీ ర్యాలీలతో పాటు అల్లర్లు సృష్టించాలని ప్రతిపక్ష పార్టీ నేతలు కుట్ర పన్నినట్టు విశ్వసనీయ సమాచారం ఉన్నందున భద్రత కట్టుదిట్టం చేసినట్టు నిఘా వర్గాలు వెల్లడించాయి.

క్యాలరీ ఖర్చు తప్పనిసరి!

- ఖర్చు కాని క్యాలరీలతో పేరుకుపోతున్న కొవ్వు.. బరువు సమస్యలు
- దేశవ్యాప్తంగా యేటా ఏడు వేలకు పైగా కొవ్వు కరిగించే సర్జరీలు
- ఫిట్‌నెస్‌కు కేరాఫ్ గా బెంగుళూరు, గురుగ్రామ్, నోయిడా నగరాలు
- ఏడు గ్లాసుల నీటితో.. రెండొందల క్యాలరీలు తగ్గుముఖం
- రోజూ వ్యాయామం, మితాహారం మంచిది: నిపుణులు

దేశంలో 53శాతం మంది మహిళలు తగిన క్యాలరీలు ఖర్చు చెయ్యట్లేదు : హెల్తీఫైమీ సర్వే

లేట్ నైట్ పార్టీలు, మసాలా వంటలు, పిజ్జాలు, పాస్తాలు. నేటి మనిషి ఆహారపు అలవాట్లు మారి... శారీరక వ్యాయామం తగ్గడం వల్ల కొండలా పేరుకుపోయిన కొవ్వును చూసి బాధపడుతున్నారే తప్పా, శరీరంలో నుంచి క్యాలరీలను కరిగిద్దాం అన్న ధ్యాస మాత్రం ఉండట్లేదు. అందుకే, దేశవ్యాప్తంగా ఏటా ఏడు వేలకు పైగా కొవ్వు కరిగించే సర్జరీలు జరుగుతున్నట్టు లెక్కలు చెబుతున్నాయి.



కడవేర్ల

భారతదేశంలో 53శాతం మంది మహిళలకు తగినంత శారీరక శ్రమ లేకపోవడంతో క్యాలరీలను ఖర్చుచేయక 'భారీ' అవస్థలు పడుతున్నట్టు, ఈ విషయంలో పురుషులు కొంచెం మేలని(44%) భారతదేశంలో ఫిట్‌నెస్ కోచ్‌లా అందరికీ సుపరిచితమై ఆరోగ్య పరిరక్షణ అసిస్టెంట్‌గా పిలవబడుతోన్న 'హెల్తీఫైమీ' యాప్ చేసిన తాజా సర్వేలో వెల్లడైంది. సుమారు పది లక్షల మంది భారతీయులపై నిర్వహించిన ఈ సర్వేలో మరిన్ని ఆసక్తికర అంశాలు బయటపడ్డాయి. శరీరంలోని 80శాతం క్యాలరీలను ముప్పై శాతం మంది పురుషులు రోజువారీగా ఖర్చుచేస్తుండగా.. కేవలం 24శాతం మంది మహిళలే ఈ పని చేస్తున్నట్టు సర్వే ప్రతినిధులు తెలిపారు. ఇక, క్యాలరీ ఖర్చులో బెంగుళూరు, గురుగ్రామ్, నోయిడా ముందంజలో ఉండగా.. కోల్ కత, జైపూర్, లక్నో, అహ్మదాబాద్ నగరవాసులు క్యాలరీ ఖర్చులో బద్ధకాన్ని ప్రదర్శిస్తున్నారు.


(ఫైల్)

మితాహారం ముద్దు

రోజూ ఎన్ని క్యాలరీల శక్తి కావాలో, ఎన్ని క్యాలరీల ఆహారాన్ని తీసుకుంటే బరువు తగ్గవచ్చో అనే అవగాహన చాలా మందికి ఉండట్లేదు. శారీరక శ్రమ ఎక్కువగా చేయని వ్యక్తికి నిత్యం 2500 క్యాలరీల శక్తి సరిపోతుంది. అంతకన్నా ఎక్కువ శక్తినిచ్చే/ఎక్కువ మోతాదు ఆహారాన్ని తీసుకుంటే, అందులో 2500 క్యాలరీల శక్తిని శరీరం వినియోగించుకొని.. మిగిలిన క్యాలరీల శక్తి కొవ్వుగా మారుతుంది. అప్పుడే బరువు సమస్యలు మొదలవుతాయి. జన్యుపరంగా గురుత్వాకర్షణ శక్తి ప్రకారం పురుషులకు పొట్ట వద్ద, మహిళలకు నడుము తదితర భాగాల్లో కొవ్వు పేరుకుపోతుంది. మొత్తం శరీరానికి సంబంధించిన వ్యాయామం చేస్తే ఒక నిముషానికి ఒక క్యాలరీ ఖర్చయితే, ప్రత్యేక భాగానికి సంబంధించి వ్యాయామం చేస్తే ఒక నిముషానికి 0.1 క్యాలరీల శక్తి ఖర్చవుతుంది. జిమ్‌కు వెళ్లే స్తోమత లేని వారు ఇంట్లో కూడా వ్యాయామాలు చేసుకునే వెసులుబాటు ఉంది. వేయించిన ఆహారం, రెడీమేడ్ ఆహార పదార్థాలు, డాల్డా కలిగిన ఫుడ్ ను దూరం పెడుతూ రోజూ వ్యాయామం చేస్తూ, మితాహారం తింటే క్యాలరీ, కొవ్వు సమస్యలకు చెక్ పెట్టొచ్చు అని నిపుణులు చెబుతున్నారు. ఇక, రోజుకు ఏడు గ్లాసుల నీరు తాగడం వల్ల శరీరంలో రెండొందల క్యాలరీలు తగ్గుతాయని ఓ అధ్యయనంలో తేలింది. నీటిని అధికంగా తాగడం వల్ల కడుపు నిండుగా ఉండి ఆహారం మితంగా తీసుకోవడం మూలంగా శరీరంలో క్యాలరీలు తగ్గడమే దీనికి కారణం!

లారీ ఢీకొని ఇద్దరు కూలీలు మృతి

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

బైక్‌ను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతిచెందారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా ఖమ్మంరూరల్ మండలంలోని కరుణగిరి వద్ద గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని రామన్నపేట కాలనీకి చెందిన ఎస్‌కే.యాకూబ్(21), చంద్రకాని శ్రీకాంత్(25) సుతారిపని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజూ మాదిరిగానే ఇరువురూ ద్విచక్ర వాహనంపై బయలుదేరి ఖమ్మం రూరల్ మండలంలోని బైపాస్ వద్ద గల సాయిగణేష్‌నగర్‌లో పనికి వెళ్తున్నారు. ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ వేగంగా ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాకూబ్, శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందారు. యాకూబ్ తండ్రి ఎస్‌కే.మౌలాలీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో టీఏఎఫ్‌ఆర్సీ దరఖాస్తులు

- ఉన్నత విద్యామండలి నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్‌తోపాటు ఇతర వృత్తి విద్యా కోర్సులు నడిపే కాలేజీ యాజమాన్యాల నుంచి ఆదాయ, వ్యయాలు, ఆడిట్ నివేదికలను ఆన్‌లైన్‌లో స్వీకరించాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) నిర్ణయించింది. తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్‌ఆర్సీ)కి కాలేజీ యాజమాన్యాలు రెండేండ్లకు సంబంధించిన ఆదాయ, వ్యయాల వివరాలను సమర్పించనున్న విషయం తెలిసిందే. ఆన్‌లైన్ దరఖాస్తుల పోర్టల్‌ను రూపొందించే పనిలో నేషనల్ ఇన్ఫర్మేషన్ కౌన్సిల్ (ఎన్‌ఐసీ) అధికారులు నిమగ్నమయ్యారు. గతంలో కాలేజీ యాజమాన్యాలు ఆదాయ, వ్యయాల వివరాలను మ్యానువల్ పద్ధతిలో టీఏఎఫ్‌ఆర్సీకి సమర్పించేవి. ఈ ఏడాది నుంచి ఆ పద్ధతిని మార్చాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. వివరాలన్నీ ఆన్‌లైన్‌లో స్వీకరించాలని భావిస్తున్నది. ఒకటి రెండు రోజుల్లో ఆన్‌లైన్ దరఖాస్తు నమూనా రూపొందించే అవకాశమున్నది. ఇది పూర్తయిన వెంటనే టీఏఎఫ్‌ఆర్సీ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే ఏఎఫ్‌ఆర్సీ దరఖాస్తులను కాలేజీ యాజమాన్యాల నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నది.

ట్రాన్స్‌జెండర్ల బిల్లులో అన్యాయమే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ట్రాన్స్‌జెండర్ల బిల్లుతో బాధిత తరగతి వారికి న్యాయం కంటే అన్యాయమే ఎక్కువ జరిగే అవకాశం ఉందని, ఆ బిల్లును రాజ్యసభ ఆమోదించవద్దని మానవ హక్కుల వేదిక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు ఎస్.జీవన్‌కుమార్, తెలంగాణ కమిటీ కార్యదర్శి ఎస్.అమర్ ఒక ప్రకటనలో గురువారం డిమాండ్ చేశారు. ట్రాన్స్‌జెండర్లను జిల్లాస్థాయి స్క్రీనింగ్ కమిటీ పరీక్షించి నిర్ణయించాలని బిల్లులో పొందుపర్చడమంటే...నల్సా కేసు తీర్పు ప్రకారం రాజ్యాంగంలోని 19,21 అధికరణలను ఉల్లంఘించడమేనన్నారు. 'తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు ట్రాన్స్‌జెండర్లను సంరక్షించే స్థితిలో లేన ప్పుడు సంబంధిత కోర్టు ఆ వ్యక్తి ఏ పునరావాస కేంద్రంలో ఉంచాలో ఆదేశిస్తుంది' అని బిల్లులో పొందుపర్చడం దారుణమన్నారు.

హైదరాబాద్‌లో 17 నుంచి ఆటోల బంద్

- 'మా ఆటోలను కాపాడండి' నినాదంతో ముందుకు : ఆటోడ్రైవర్ల జేఏసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లో 'మా ఆటోలను కాపాడండి' నినాదంతో ఈ నెల 17 నుంచి ఆటోల బంద్ కార్యక్రమం చేపట్టనున్న ట్టు తెలంగాణ ఆటో డ్రైవర్ల జేఏసీ కన్వీనర్ అమానుల్లాఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెట్రోల్, డీజిల్ రేట్లు పెరిగిన నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో ఆటో ఛార్జీల రేట్లను పెంచుకునే అవకాశాన్ని ఆయా ప్రభు త్వాలు అనుమతించాయని, ఇక్కడ మాత్రం పెంచేం దుకు అనుమతులు ఇవ్వట్లేదని ఆవే దన వ్యక్తం చేశారు. మరోపక్క ఆటోల యజమానులపై వేధింపులు ఎక్కువయ్యాయని వాపోయారు. ఆటోఛార్జీలను పెంచాలని, ఆటోల వారిపై ఫైనాన్సియర్ల వేధింపులను ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

'ఈబీసీలకే 10 శాతం రిజర్వేషన్లు'

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అగ్ర కులాల్లోని పేద విద్యార్థులకు న్యాయం చేయాలనే ఆలోచనతోనే 10 శాతం రిజర్వేషన్లను ప్రధాని మోడీ తీసుకొచ్చారని బీజేపీ జాతీయ కార్యవర్గ కమిటీ సభ్యులు నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ.. మతంతో సంబంధం లేకుండా దేశంలోని ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవాలన్న దృక్పథంతో మోడీ పనిచేస్తున్నారని కొనియాడారు.

ఏకగ్రీవ స్థానాల్లో వెంటనే ఉప సర్పంచ్ ఎన్నిక

- రిజర్నింగ్ అధికారులకు ఎస్‌ఈసీ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నిక ఏకగ్రీవమైతే అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక పదవికి కేవలం ఒకరు మాత్రమే పోటీలో ఉంటే అక్కడ ఏకగ్రీవమైనట్టు ప్రకటిస్తారు. సర్పంచ్ పదవితో పాటు వార్డు సభ్యులందరిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటే వెంటనే స్టేజ్-1 రిటర్నింగ్ అధికారి ఉప సర్పంచ్ ఎన్నిక చేపట్టాలని సూచించింది. ఒకవేళ స్టేజ్ -1 రిటర్నింగ్ అధికారి క్లస్టర్ పరిధిలో ఒకటి కంటే ఎక్కువ పంచాయతీల్లో ఎన్నికలు ఏకగ్రీవమైతే మిగతా చోట్ల స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులు ఉప సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ఒకవేళ ఏకగ్రీవం కాకుండా సదరు పంచాయతీల్లో ఒకటి లేదా రెండు పదవులకు ఎన్నికలు జరగాల్సి ఉంటే పోలింగ్, ఓట్ల లెక్కింపు అనంతరమే ఉప సర్పంచ్ ఎన్నిక జరపాలని ఎన్నికల సంఘం సూచించింది.

ఆయకట్టు రైతు ఆవేదన..

రబీకి ముందే ప్రకటన చేయని సర్కార్

- 90వేల ఎకరాల్లో ఎండుతున్న పైర్లు
- సాగర్ రెండో జోన్ కింద సాగు ప్రశ్నార్థకం

'భగీరథ'కు నీటి కేటాయింపు.. సాగుకు కోత



నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పుష్కలంగా పంటలు పండి అన్నపూర్ణగా వెలుగొందిన సాగర్ ఆయకట్టు రబీలో ప్రశ్నార్థకంగా మారింది. రబీకి ముందే ప్రభుత్వం సాగర్ నీటి విడుదలపై ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో రైతులు యథావిధంగా నాట్లేశారు. అయితే, మార్చి నెలాఖరులోగా మిషన్‌భగీరథ ద్వారా ఇంటింటికీ నీరిచ్చేందుకు సాగునీటిని అర్థాంతరంగా ఆపేశారు. ఖమ్మం జిల్లాలో సాగర్ రెండో జోన్ పరిధిలో మొత్తం 1.11లక్షల ఎకరాల సాగుభూమి ఉండగా, ప్రస్తుతం 90వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పెసర పంటలు సాగు చేశారు. తొమ్మిది మండలాల్లోనూ పైర్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఉన్నఫలంగా ఎన్‌ఎస్‌పీ అధికారులు సాగునీరు విడుదల చేయలేమంటూ ప్రకటించడంతో పైర్లు ఎండుముఖం పడుతున్నాయి.


90వేల ఎకరాల్లో ఎండుతున్న పైర్లు

రబీ సీజన్ చివరి వరకు నీరు విడుదల చేయలేమని ఇటీవల ఎన్‌ఎస్‌పీ అధికారులు చెప్పడంతో సాగర్ కింద పంటలు సాగు చేసిన రైతులంతా ఆందోళన చెందుతున్నారు. వివిధ దశల్లోని పైర్లు ఇప్పటికే వాడిపోయాయి. పైరును కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కండ్ల ముందే ఎండిపోతున్న పైర్లను బతికించుకునే మార్గం లేక కన్నీటిపర్యంతమవుతున్నారు. కనీసం మరో రెండు నెలల వరకైనా నీరు విడుదల చేయాలని అధికారులను వేడుకుంటున్నారు. ప్రస్తుతం చింతకాని, మధిర, బోనకల్, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, ఏన్కూరు తదితర మండలాల్లో పైర్లు నీరు లేక వాడిపోతున్నాయి.

300చెరువులకూ కష్టమే..

సాగర్ నీరు నిలిపివేతతో జిల్లాలోని మైనర్ సాగునీటి ప్రాజెక్టులతో పాటు, సాగర్ నీటి ఆధారిత మైనర్ ప్రాజెక్టుల పరిధిలో అనుబంధంగా ఉన్న దాదాపు 300చెరువుల కింద పంటల పరిస్థితీ దయనీయంగా మారింది. ముఖ్యంగా పాలేరు, వైరా రిజర్వాయర్లలో ఉన్న నీటిని ప్రభుత్వం మిషన్ భగీరథకు కేటాయించడంతో అసలు సమస్యకు కారణమైంది. సాగర్ ప్రధాన కాలువ ఖమ్మం జిల్లాలో 46కి.మీ. పొడవునా నీటి సరఫరా అందిస్తోంది. జిల్లాలో మొదటి, రెండో జోన్‌ను కలుపుకుని మొత్తం 17 మండలాల్లోని ఆయకట్టుకు సాగర్ జలాలు సరఫరా అవుతాయి. ప్రస్తుతం నీరు రాదనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


నీరు విడుదల చేయలేం



నీరు విడుదల చేయడానికి మాకు అనుమతుల్లేవు. అందువల్ల వరి సాగు చేపట్టి నష్టపోవద్దు. నీరు విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశించలేదు. సాగర్ ఆయకట్టుకు రబీలోనే మొదటి, రెండు, మూడు జోన్లకు సరిపడా నీరిచ్చాం. ఇప్పుడు ఇంకా నీరిచ్చే పరిస్థితి లేదు.

- ఏవీవీఎస్ నర్సింహారావు (ఈఈ ఎన్‌ఎస్‌పీ)


రెండెకరాలూ ఎండిపోతే ఎలా..



నాకున్నదే రెండెకరాలు. నీరు విడుదల చేస్తారని వరి సాగు చేశాను. ఇప్పుడేమో సాగర్ నీళ్లు ఆపేశారు. పైరు వాడిపోతోంది. ఎవరికి చెప్పుకున్నా నీరు రాదంటున్నారు. నీరు రాకపోతే మాకు తిండికి కూడా కష్టమే.

- భూక్యా అమ్రూ (గిరిజన రైతు, చెన్యాతండా)

పదెకరాల్లో పైరు ఎండిపోతోంది..



నేను పది ఎకరాల్లో వరి సాగు చేశాను. రబీలో సాగునీటి సరఫరా ఉండదని అధికారులు ముందే చెప్పలేదు. కల్లూరు డివిజన్‌లో రెండో జోన్‌కు పది రోజులకు ఒకసారి వారబందీగా నీరిచ్చినా మా పంటలు దక్కుతాయి. ముందుగా ప్రకటన చేస్తే మేము సాగు చేసేవాళ్లం కాదు. ఇప్పుడు వరిసాగుపై రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాను.

- జక్కంపూడి కిషోర్ (చంద్రుపట్ల, ఖమ్మం జిల్లా)

బహ్రెయిన్‌లో యువకుడి ఆత్మహత్య

- వ్యవసాయంలో గిట్టుబాటు కాక.. అప్పులు తీర్చలేక..
- గల్ఫ్‌కు వెళ్లిన 25రోజుల్లోనే ఘటన

నవతెలంగాణ- డిచ్‌పల్లి

ఉపాధి కోసం గల్ఫ్ పయనమైన నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం కొత్తకొరుట్లకు చెందిన యువకుడు బహ్రెయిన్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం గురువారం అక్కడి వారి ద్వారా మృతుని కుటుంబీకులకు తెలిసింది. వారి వివరాల ప్రకారం.. బదావత్ దేవిసింగ్ - గేనాబాయి దంపతులకు ముగ్గురు కుమారులు. కష్టంచేసి కొద్దిమొత్తంలో వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. ఈ క్రమంలో వారికి అప్పులు పెరిగాయి. ఈ బెంగతో గేనాబాయి రెండేండ్ల కిందట అనారోగ్యంతో మృతిచెందింది. కుటుంబ భారం మోసేందుకు తండ్రికి వ్యవసాయంలో పెద్దకొడుకు బదావత్ గణేష్(25) ఆసరాగా ఉంటూ వచ్చాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చేందుకు 25 రోజుల కిందట బతుకుదెరువు కోసం గణేష్ బహెరాన్‌కు వెళ్లాడు. అక్కడ సరైన జీతం లేక.. అప్పులు తీర్చే దారి లేదని పలుమార్లు తండ్రికి, భార్యకు ఫోన్‌లో మాట్లాడాడు. బుధవారం బహ్రెయిన్‌లో తాను ఉంటున్న గదిలోనే ఉరేసుకున్నాడు. పనులు ముగించుకొని వచ్చిన సహచరులు గమనించి విషయం మృతుని కుటుంబ సభ్యులకు తెలిపారు. గణేష్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని స్వదేశం రప్పించేందుకు ఎంపీ కవిత, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నా సినిమాల్లో యాక్షన్ ఉండాల్సిందే


బోయపాటి శ్రీను

‘ప్రతి తండ్రి తన కొడుకులకు వారసత్వంగా ఏదో ఒక గిఫ్ట్ ఇస్తుంటారు. కానీ రామ్‌చరణ్‌కి చిరంజీవి యుద్ధ ట్యాంక్‌నిచ్చాడు. ఇక యుద్ధం చేయడమే తన పని’ అని అంటున్నారు బోయపాటి శ్రీను. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ఉండే యాక్షన్ సినిమాలతో ఇండస్ట్రీలో తనకంటూ ఓ స్పెషల్ ఇమేజ్ తెచ్చుకున్న దర్శకుడు బోయపాటిశ్రీను. రామ్ చరణ్ హీరోగా ‘వినయ విధేయ రామ’ చిత్రాన్ని ఆయన రూపొందించారు. కైరా అద్వానీ కథానాయికగా నటించిన ఈ సినిమా నేడు (శుక్రవారం) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బోయపాటి శ్రీను గురువారం మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాల సమాహారం ఆయన మాటల్లోనే..

మహిళా ప్రధాన సందేశం ఉంటుంది..

ఇది పూర్తి స్థాయి ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్. ఇందులో అన్నల ముందు, పెద్దల ముందు హీరో వినయంగా ఉంటాడు. ఫ్యామిలీకి విధేయతని కలిగి ఉంటాడు. సమస్య వచ్చినప్పుడు రాముడిలా పోరాడతాడు. అందుకే ‘వినయ విధేయ రామ’ అనే టైటిల్ పెట్టాం. ఈ కథని నాలుగేండ్ల క్రితమే రామ్‌చరణ్‌కి చెప్పా. కానీ పాత్రకి కాస్త మెచ్యూరిటీ, దృఢమైన బాడీ లాంగ్వేజ్ కావాలి. అందుకోసం వెయిట్ చేశాం. సంక్రాంతికి పర్‌ఫెక్ట్ యాప్ట్ చిత్రమిది. భోగికి కావాల్సిన వేడి, సంక్రాంతికి కావాల్సిన కలర్‌ఫుల్ ఫ్యామిలీ సందడి, కనుమ రోజు ఉండాల్సిన జోష్ అన్నీ ఈ సినిమాలో ఉంటాయి. మహిళలకు సంబంధించిన ఓ మంచి సందేశం కూడా ఈ చిత్రంలో చెప్పబోతున్నా.

చరణ్ ఓ వారధిలా ఉన్నాడు..

ఈ సినిమాకి కర్త, కర్మ, క్రియ రామ్‌చరణే. ఈ కథకు ఆయనే పర్‌ఫెక్ట్ అని ఎంచుకున్నా. దర్శకుడిగా నేననుకున్న విజన్‌ని, విజువల్‌ని తెరపై ఆవిష్కరించేందుకు చరణ్ ఓ బ్రిడ్జ్‌లా ఉన్నారు. నన్ను, నా విజన్‌ని బాగా నమ్మాడు. సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. నా సినిమా పోస్టర్‌లో ఏదో కొత్తదనం ఉండాలి. కొత్త ముఖాలు కనిపించాలి. అందుకే కొత్త ఆర్టిస్టులను ఎంపిక చేశాను. ఐఏఎస్ పాత్రలో ప్రశాంత్, మెచ్యూరిటీ ఉన్న అన్నయ్య పాత్రలో ఆర్యన్ రాజేష్, శక్తివంతమైన విలన్‌పాత్రలో వివేక్ ఒబెరాయ్.. ఇలా ప్రధాన తారాగణాన్ని సెలెక్ట్ చేసుకున్నా. సినిమాలో ప్రతి పాత్రకు జస్టిఫికేషన్ ఉంటుంది. ఈ సినిమా కోసం వివేక్‌ని కలిసినప్పుడు ఆయన చేయనన్నారు. పాత్రని నెరేట్ చేశాక నన్ను హగ్ చేసుకుని అవసరమైన దానికంటే ఎక్కువ కాల్షీట్లే అడగమన్నారు.


రామ్‌చరణ్‌కి షాట్ వివరిస్తున్న దర్శకుడు బోయపాటి

సెట్‌లో కఠినంగా ఉంటా..

సినిమా ఒక పండగ. దాన్ని అభిమానులకు చేర్చాలంటే ఆర్టిస్ట్‌లు నన్ను నమ్మాలి. వాళ్ళని ఇన్‌స్పైర్ చేయగలిగేందుకు ముందు నేను పది రెట్లు వర్క్ చేస్తాను. ఈ ప్రాసెస్‌లో ఆర్టిస్టుల కంటే నేనే ఎక్కువగా కథలో లీనమవుతా. ఏ సినిమాకైనా నిర్మాతే కీలకం. జ్యూస్ నాదైనప్పటికి మంచి గ్లాస్ మాత్రం నిర్మాతే. నిర్మాతకి నష్టం వచ్చేలా ఏదీ చేయను. మామూలుగా చెబితే ఎవరూ వినరు. అందుకే సెట్‌లో సాధ్యమైనంత వరకు చాలా కఠినంగా ఉంటా. నేను సెట్‌లో ఉంటే అంతా క్రమశిక్షణగా పని నడుస్తుంది. రామ్‌చరణ్ నా మేకింగ్ పద్ధతికి బాగా కనెక్ట్ అయ్యాడు. అందుకే ఇటీవల ప్రీ రిలీజ్‌లో ప్రతి ఒక్క హీరో ఒక్క సినిమానైనా నాతో చేయాలని కాంప్లిమెంట్ ఇచ్చాడు.

ప్రతి కథని చిరంజీవికి చెబుతా..

నేను ప్రతి కథను చిరంజీవికి చెబుతాను. ఆయన విని బాగుంటే గో హెడ్ అంటారు. చిన్న చిన్న మిస్టేక్స్ ఉంటే చెబుతారు. ఈ కథ విషయంలో అన్ని పర్‌ఫెక్ట్‌గా చూసుకుని వెళ్ళాను. ఆయనకు చెప్పాక మరో మాట లేకుండా చేయమని చెప్పారు. సాధారణంగా కొడుకులకు తండ్రి మంచి గిఫ్ట్‌లు ఏదైనా ఇస్తుంటారు. కానీ చరణ్‌కి చిరంజీవి ఏకంగా యుద్ధ ట్యాంక్‌నే ఇచ్చారు. యుద్ధం చేయడమే ఆయన పని. నిజం చెప్పాలంటే చరణ్‌లో సంతృప్తి ఉండదు. ఇంత సంపాదించాం కదా ఇక చాలు అనుకోడు. ఇంకా ఏదో చేయాలి. ఇంకా బాగా ఎదగాలనే తపన ఉంటుంది. అదే ఆయన్ని ముందుకు నడిపిస్తుంది.

ఫ్యామిలీ బేస్డ్ యాక్షన్ సినిమాలు..

నేను రూపొందించిన ‘భద్ర’ నుంచి ఫ్యామిలీ ఎమోషన్స్‌కి పెద్ద పీట వేస్తాను. నిండైన కుటుంబం కనిపించాలని కోరుకుంటాను. అర్బన్ ఫ్యామిలీని చూపించాలనుకుంటాను. అందుకే సినిమాలో ఫ్యామిలీ రిచ్‌గా, నిండుగా కనిపిస్తుంది. అదే సమయంలో ఫ్యామిలీ ఎమోషన్స్, రిలేషన్స్ ప్రధాన భూమిక పోషిస్తాయి. నా చిత్రాల్లో ఫైట్స్ సీన్స్ ఎక్కువగా ఉంటాయనే కామెంట్ వినిపిస్తుంది. కానీ అవసరం మేరకే ఉంటాయి. కావాలని ఏదీ పెట్టం. సినిమాని లక్షల మంది చూస్తారు. ఒక్కొక్కరికి ఒక్కో ఆలోచన, ఒక్కో అంశం నచ్చుతుంది. రెండున్నర గంటలు టైమ్ కేటాయించి ఎన్నో అంచనాలతో సినిమాకి వస్తారు. ఓ దర్శకుడిగా అంత మందిని సంతృప్తి పరచాలి. కాబట్టి నా సినిమాల్లో అన్ని అంశాలను మేళవిస్తాను. ఫ్యామిలీ, యాక్షన్ లేకుండా సినిమా చేయను. స్మూత్‌గా ఉండే కథలు, చిన్న సినిమాలు నేను అస్సలు చేయలేను.

బ్రాండ్‌ని బాధ్యతగా ఫీలవుతా..

బోయపాటి శ్రీను పేరు ఓ బ్రాండ్‌గా ఉందంటే దాన్ని నేను బాధ్యతగా ఫీలవుతా. అంతే బాధ్యతగా సినిమాలు తీస్తాను. ఎప్పుడూ బర్డన్‌గా ఫీలవ్వను. అందుకే నా ప్రతి సినిమాలో ఏదో ఒక కొత్త అంశం చెప్పాలనుకుంటా. ప్రతి సినిమాని నా మొదటి సినిమాగానే భావించి చేస్తా. అలాగే ఓ హీరోని ఎంచుకున్నప్పుడు నేనూ ఆ హీరో అభిమానిగా ఫీలవుతా. అభిమానిగా నేను సంతృప్తి పడేలా సినిమా ఉండాలనుకుంటాను. దానికి తగ్గట్టుగా కథ రాసుకుంటా. చేసిన కథను మళ్ళీ చేయను. ప్రతిదీ కొత్తగా ఉండేలా చూసుకుంటాను. అంతర్లీనంగా నా ప్రతి కథ దేనికదే భిన్నంగా ఉంటుంది. ఈ సినిమా కూడా చాలా డిఫరెంట్‌గా ఉంటూ అందరినీ తప్పకుండా అలరిస్తుంది.

నవచిత్రం

కీర్తి సురేష్ మహిళా ప్రధాన చిత్రం ఆరంభం


తరుణ్, కళ్యాణీమాలిక్, నరేంద్ర, కీర్తిసురేష్, కళ్యాణ్‌రామ్, మహేష్ కోనేరు

కీర్తిసురేష్ ప్రధాన పాత్రధారిణిగా నరేంద్రని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేష్ కోనేరు నిర్మిస్తున్న నూతన చిత్రం గురువారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి హీరో కళ్యాణ్ రామ్ క్లాప్ నివ్వగా, దర్శకుడు వెంకీ అట్లూరి, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ కెమెరా స్విచాన్ చేశారు. దిల్‌రాజు, స్రవంతి రవికిషోర్, పరుచూరి గోపాలకృష్ణ స్క్రిప్ట్ అందించారు. హరీష్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో కీర్తి సురేష్ మాట్లాడుతూ, ‘మహానటి’ తర్వాత నేను తెలుగులో సైన్ చేసిన చిత్రమిది. ఇది లేడీ ఓరియెంటెడ్ సినిమా కావడం ఆనందంగా ఉంది. సింపుల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతుంది. అమ్మాయిలందరికీ బాగా కనెక్ట్ అవుతుంది. మహేష్ కోనేరు నిర్మాణంలో, నరేంద్ర దర్శకత్వంలో సినిమా చేయడం హ్యాపీగా ఉంది. ఈ సినిమా ద్వారా తెలుగు ఆడియెన్స్‌కి మరింత దగ్గరవుతానని నమ్ముతున్నాను’ అని అన్నారు. “మహానటి’తో కీర్తిసురేష్ తెలుగు ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించారు. ఆమెతో నేను సినిమా చేయడం హ్యాపీగా ఉంది. స్ట్రాంగ్ ఉమెన్ పాత్రలో ఆమె కనిపిస్తారు. ప్రతి అమ్మాయి తన జీవితంలో ఏదో ఓ సందర్భంలో ఎదుర్కొన్న ఓ సంఘటన ప్రధానంగా సినిమా సాగుతుంది. ప్రతి అమ్మాయికి కనెక్ట్ అవుతుంది. మిగిలిన వివరాలు త్వరలో వెల్లడిస్తాం’ అని నిర్మాత మహేష్ కోనేరు తెలిపారు.

దర్శకుడు నరేంద్ర చెబుతూ, ‘2016 నుంచి ఈ కథపై వర్క్ చేస్తున్నా. తరుణ్ స్క్రిప్ట్‌లో ఎంతో సపోర్ట్ చేశాడు. ఎమోషన్స్, రొమాన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ మేళవించిన చిత్రమిది. ఇందులోని పాత్రకు కీర్తి సురేష్‌ని తప్ప మరెవ్వరినీ ఊహించలేం. ఆమె న్యాయం చేస్తారని నమ్ముతున్నాం. దేశంలోని ఫ్యామిలీ ఆడియెన్స్ అందరికీ నచ్చే చిత్రమవుతుంది. ఫిబ్రవరి రెండో వారం నుంచి రెగ్యులర్ షూటింగ్‌ని ప్రారంభిస్తాం. 15 రోజుల పాటు వైజాగ్‌లో చిత్రీకరించి, ఏప్రిల్‌లో యుఎస్ వెళ్తాం. మేజర్ పార్ట్ అమెరికాలో ఉంటుంది. నాకు దర్శకుడిగా అవకాశం ఇచ్చిన నిర్మాతకి థ్యాంక్స్’ అని చెప్పారు. ‘మహేష్ నిర్మిస్తున్న మూడో సినిమాలో నాకు అవకాశం ఇవ్వడం హ్యాపీ. హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమా మొదటి సారి చేస్తున్నా. మంచి సంగీతం అందిస్తాను’ అని కళ్యాణీ మాలిక్ తెలిపారు.

ఇసుక మాఫియా నేపథ్యంలో..


మధుర్ భండార్కర్

రియలిస్టిక్ చిత్రాలకు బాలీవుడ్ దర్శకుడు మధుర్ భండార్కర్ పెట్టింది పేరు. ‘చాందినిబార్’, ‘పేజ్ 3’, ‘ఫ్యాషన్’, ‘ట్రాఫిక్ సిగ్నల్’ వంటి తదితర జాతీయ అవార్డు చిత్రాలను రూపొందించి బాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అలాగే ‘ఫ్యాషన్’, ‘హీరోయిన్’, ‘క్యాలెండర్ గర్ల్స్’, ‘ఇందు సర్కార్’ చిత్రాలతో విమర్శకుల ప్రశంసలనూ సొంతం చేసుకున్నారు. దాదాపు రెండేండ్ల గ్యాప్ తర్వాత రియలిస్టిక్ కథాంశంతో ఓ సినిమా చేయబోతున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఇసుక మాఫియా నేపథ్యంలో ఈ సినిమా ఉండబోతుందట. ‘ఇన్‌స్పెక్టర్ ఘలిబ్’ పేరుతో ఈ సినిమాని రూపొందించబోతున్నారు. మేలో ప్రారంభించే ఈ సినిమాని ఎక్కువగా భాగం ఉత్తర ప్రదేశ్‌లోనే చిత్రీకరించనున్నారట. ఇప్పటి వరకు మధుర్ మహిళా ప్రధానమైన సినిమాలు చేశారు. కానీ ఈ చిత్రంలో మేల్ లీడ్ ఉంటారట. బాలీవుడ్‌లో ఓ టాప్ హీరోని ఎంపిక చేసే ఆలోచనలో చిత్రయూనిట్ ఉన్నట్టు తెలుస్తోంది.

అలరిస్తున్న వర్మ ట్రైలర్


ధృవ్, మేఘా

సంచలన విజయం సాధించిన ‘అర్జున్‌రెడ్డి’ చిత్రం హిందీతోపాటు తమిళంలోనూ రీమేక్ అవుతుంది. హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా పరిచయం అవుతూ నటిస్తున్న చిత్రమిది. ‘వర్మ’ పేరుతో రూపొందుతున్న ఈ సినిమాకి బాల దర్శకత్వం వహిస్తున్నారు. మేఘా కథానాయికగా నటిస్తున్న ఈచిత్ర ట్రైలర్‌ను గురువారం విడుదల చేశారు. ట్రైలర్‌లో లుక్ పరంగా ధృవ్ ఆకట్టుకుంటున్నాడు. ఈ4 ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ముఖేష్ మెహతా ఈ సినిమాని నిర్మిస్తున్నారు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన తెలుగు ‘అర్జున్‌రెడ్డి’ రికార్డు విజయం సాధించింది. హిందీలో ఆయన దర్శకత్వంలోనే ‘కబీర్‌సింగ్’ పేరుతో షాహిద్‌కపూర్, కైరా అద్వానీ జంటగా తెరకెక్కిస్తున్నారు.

మణికర్ణిక విజయీభవ..


కంగనా రనౌత్

‘విజయీభవ..’ అంటూ తన సైన్యంలో ధైర్యాన్ని నింపుతోంది కంగనా రనౌత్. ఇదంతా తాను నటిస్తున్న ‘మణికర్ణిక’ చిత్రం కోసం. ఝాన్సీ రాణి లక్ష్మీబాయి జీవితం ఆధారంగా రూపొందుతున్న ‘మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ’ చిత్రంలో కంగనా రనౌత్ టైటిల్ రోల్ పోషిస్తున్న విషయం విదితమే. క్రిష్, కంగనా దర్శకత్వం వహించారు. తాజాగా సినిమాలోని ‘విజయీభవ..’ అంటూ సాగే పాటని గురువారం రిలీజ్ చేశారు. ఇందులో తన మహిళా సైన్యానికి శిక్షణ ఇస్తూ కంగనా కనిపిస్తుంది. అంతేకాదు తన సైనికుల్లో దేశభక్తి, పోరాడే తత్వాన్ని, ధైర్యాన్ని నింపుతూ, యుద్ధానికి సిద్ధం చేస్తుంది. ప్రస్తుతం ఈ పాట అందర్నీ విశేషంగా ఆకట్టుకుంటుంది. ప్రసూన్ జోషి సాహిత్యాన్ని అందించిన ఈ పాటకి శంకర్ ఇషాన్ లాయ్ సంగీతం అందించారు. శంకర్ మహదేవన్ ఆలపించారు. హిందీతోపాటు తెలుగు, తమిళంలో ఈ నెల 25న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.


కార్తీ
రకుల్ ప్రీత్ సింగ్


వాలెంటైన్స్ డే కానుక దేవ్

కార్తి, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా రజత్ రవిశంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ‘దేవ్’. ప్రిన్స్ పిక్చర్స్, లైట్ హౌజ్ మూవీ మేకర్స్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఎస్.లక్ష్మణ్ కుమార్, ఠాగూర్ మధు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి నిర్మాతలు మాట్లాడుతూ, ‘జనవరి 14న చిత్ర ఆడియోని విడుదల చేయనున్నాం. హరీష్ జయరాజ్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలకు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. అలాగే చిత్ర ఫస్ట్‌లుక్‌కి విశేషమైన స్పందన లభించింది. యాక్షన్ ఫ్యామిలీ డ్రామాగా దర్శకుడు రజత్ సినిమాని చాలా బాగా తెరకెక్కించారు. ‘ఖాకీ’ లాంటి సూపర్ హిట్ తర్వాత కార్తి సరసన రెండో సారి రకుల్ ప్రీత్ సింగ్ ఇందులో హీరోయిన్‌గా నటించడం విశేషం. ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ కీలక పాత్రల్లో మెప్పిస్తారు. నిక్కీ గర్లాని మరో కథానాయికగా నటిస్తుంది. ఆర్ వేల్‌రాజ్ సినిమాటోగ్రఫీ సినిమాకు హైలైట్ అవుతుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14న సినిమాని విడుదల చేయనున్నాం’ అని అన్నారు. కార్తిక్ ముత్తురామన్, ఆర్జే విఘ్నేష్, రేణుక, అమృత, వంశీ, జయకుమార్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఎడిటర్: రూబెన్, ఆర్ట్: రాజీవన్.

ఫుల్ బిజీ బిజీ..


శ్రద్ధా కపూర్

శ్రద్ధా కపూర్ వరుసగా నాలుగు సినిమాల షూటింగ్‌లో పాల్గొంటూ క్షణం తీరిక లేకుండా బిజీ బిజీగా ఉంటోంది. తొలిసారి తెలుగులో ఎంట్రీ ఇస్తూ ‘సాహో’ చిత్రంలో నటిస్తున్న విషయం విదితమే. ప్రభాస్ సరసన నటిస్తున్న ఈ త్రిభాషా చిత్రం ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటోంది. శ్రద్ధా దీంతోపాటు బాలీవుడ్‌లో ‘చిఛోర్’, సైనా నెహ్వాల్ బయోపిక్‌లో నటిస్తోంది. అలాగే ‘ఏబీసీడీ 3’లోనూ తనే కథానాయికగా ఫైనల్ అయ్యింది. ఈ సినిమా షూటింగ్ కూడా త్వరలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆమె డాన్స్ ప్రిపరేషన్ ఆరంభించారు. ‘సాహో’ షూటింగ్ పూర్తి కాగానే డాన్స్ ప్రాక్టీస్ చేస్తున్నారు. అది కంప్లీట్ చేసుకుని ‘చిఛోర్’, సైనా నెహ్వాల్ బయోపిక్‌లో పాల్గొంటూ ప్రతి రోజూ హైదరాబాద్ టు ముంబయికి చక్కర్లు కొడుతున్నారట. అంతేకాదు ప్రస్తుతం నటిస్తున్న నాలుగు సినిమాలు దేనికదే పూర్తి భిన్నమైనవి కావడం విశేషం. పాత్రల్లో వేరియేషన్ చూపించే విషయంలో చాలా కష్టమైనప్పటికీ ఇష్టంగా చేస్తుందట. ఒకేసారి నాలుగు భిన్న నేపథ్య చిత్రాల్లో నటించే అవకాశం రావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తోంది శ్రద్ధా. ఈ నాలుగు సినిమాలు ఈ ఏడాదిలోనే విడుదల కానున్నాయి. దీంతో ఈ ఏడాదంతా శ్రద్ధాదే సందడి అని వేరే చెప్పక్కర్లేదు.


‘షకీలా’ చిత్రంలో రిచా చద్దా

సంస్థాగత బలోపేతం అవసరం

తక్షణమే బూత్ కమిటీలు వేయండి

- టీ కాంగ్రెస్ నేతలకు అధిష్టానం ఆదేశం
- వార్ రూమ్‌లో కీలక నేతలతో చర్చలు జరిపిన హైకమాండ్


ఫైల్

నవతెలంగాణ - న్యూఢిల్లీబ్యూరో

మరికొద్ది నెలల్లో రానున్న సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ సమాయత్తం అవుతుంది. అందుకు అవసరమైన చర్యలపై ఆ పార్టీ ఇప్పటికే ద ష్టి సారించింది. అందులో భాగంగా గురువారం ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యాలయంలోని వార్‌రూమ్‌లో అన్ని రాష్ట్రాల నాయకులతో వాడివేడీగా చర్చలు జరిపింది. ఈ సమావేశానికి పలు రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, కోశాధికారులు, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ముందుగా దేశంలోని అన్ని పీసీసీ కమిటీలకు పార్టీ అధిష్టానం సంయుక్త సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులతో పాటు, భవిష్యత్ కార్యాచరణపై తీవ్రంగా చర్చలు జరిపినట్టు సంబంధితవర్గాలు తెలిపాయి. కాగా, ఈ సమావేశానికి తెలంగాణ నుంచి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, కోశాధికారి జీ నారాయణ రెడ్డి హాజరు కాగా, ఏపీ నుంచి ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి పాల్గొన్నారు. మరోదఫా సమావేశం వార్‌రూమ్‌లో రాష్ట్రాలవారీగా పార్టీ విడివిడిగా చర్చలు జరిపింది. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల బాధ్యులు ఆర్సీ కుంతియా కూడా పాల్గొన్నారు. పొత్తులపై కూడా సమాలోచనలు జరిపారు. ప్రస్తుతం తెలంగాణలో అధికారంలో ఉన్నటువంటి టీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యానాలపై పార్టీ కొద్దిసేపు సీరియస్‌గా చర్చించినట్టు తెలిసింది. మొత్తం 16 స్థానాలు తామే గెలుస్తామని అధికార పార్టీ నేతలు చెప్పడంపై రాష్ట్ర నాయకత్వాన్ని హైకమాండ్ వివరణ అడిగినట్టు సమాచారం. అయితే, కాంగ్రెస్ ఏయో స్థానాల్లో బలంగా ఉందో... ఇతర స్థానాల్లో బలహీనంగా ఉండటానికి గల కారణాలను రాష్ట్ర నేతలు ఏకే ఆంటోనీ నేతృత్వంలోని కమిటీకి వివరించారు. కాగా, బూత్ కమిటీల బలోపేతం ఎంతవరకు వచ్చిందన్న అంశంపై పార్టీ హైకమాండ్ ప్రశ్నించినట్టు టీపీసీసీ వర్కింగ్ పొన్నం ప్రభాకర్ మీడియాకు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల వరకు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని అధిష్టానం తమకు సూచనలు అందజేసినట్టు తెలిపారు. ఇప్పటికే 30 శాతం మేరకు బూత్ కమిటీలను రాష్ట్రవ్యాప్తంగా వేసిన విషయాన్ని పార్టీ హైకమాండ్‌కు వివరించినట్టు పొన్నం వెల్లడించారు. దాంతోపాటు జాతీయ అంశాలపై స్థానికంగానూ చర్చలు జరపాలని పార్టీ తెలిపినట్టు వెల్లడించారు. రాబోయే ఎన్నికలు మోడీ, రాహుల్ గాంధీ మధ్యే సాగుతాయని ఆయన చెప్పుకొచ్చారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రంలో 16 ఎంపీ స్థానాలు వస్తే కేంద్రంలో కీలక పాత్ర పోషిస్తామని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. గతంలో 32 స్థానాలున్న సమయంలోనే టీడీపీయే ఏమీ చేయలేకపోయిన విషయాన్ని గుర్తు చేశారు. అటువంటి మాటలను తెలంగాణ ప్రజలు నమ్మరని తెలిపారు.

పార్టీ అంతర్గత సమస్యలపై చర్చలు: కుంతియా

తెలంగాణ పార్టీకి సంబంధించిన విషయాల్లో అంశాలవారీ చర్చలు జరిపినట్టు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ ఆర్సీ కుంతియా తెలిపారు. ముఖ్యంగా పార్టీని ప్రస్తుతం ఇబ్బంది పెడుతున్న అంశాలు, బూత్ కమిటీల నియామకంపై ద ష్టి సారించాలని నిర్ణయించినట్టు ఆయన మీడియాకు తెలిపారు. విరాళాల సేకరణపై పార్టీ కొన్ని కసరత్తులు చేయాలని అధిష్టానం సూచించినట్టు తెలిపారు. రూ 25 నుంచి రూ 2000 వరకు విరాళాలు సేకరించాలని సమావేశంలో చర్చించామని, అందుచేతనే కోశాధికారులను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించినట్టు తెలిపారు.

ఏఐసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మెన్ ఏకే ఆంటోనీతో మాజీ ఎంపీ సర్వే భేటీ

ఆలిండియా కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ సంఘం చైర్మెన్ ఏకే ఆంటోనీతో, మల్కాగిజిరి మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణ భేటీ అయ్యారు. ఇటీవల తనను పార్టీ నుంచి అన్యాయంగా సస్పెండ్ చేసినందుకు ఆంటోనీని ప్రత్యేకంగా కలిసినట్టు ఆయన మీడియాకు తెలిపారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యులు ఆర్సీ కుంతియా చేసిన వ్యాఖ్యలపై ఆయన వివరణ అడిగినట్టు చెప్పారు. అయితే, ఏఐసీసీ సభ్యుడి ఉన్నానని, తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ఏంటని ఆంటోని సైతం ఆశ్చర్యానికి గురైనట్టు వెల్లడించారు. తెలంగాణ ఎన్నికల సందర్భంగా మిత్ర ధర్మాన్ని సరైన విధంగా ఉత్తమ్ పాటించ లేదని, టికెట్ల కేటాయింపుల్లో డబ్బులు దండుకొని పక్షపాతంగా వ్యవహరించారని ఆరోపించారు. ఉత్తమ్ చర్యలతో చంద్రబాబు, కోదండరాం, కమ్యూనిస్టు పార్టీ నేతలు అభాసు పాలయ్యారని తెలిపారు. ఇబ్రహీంపట్నం వంటి స్థానాల్లో సమర్థులైన అభ్యర్థులకు స్థానం కేటాయించకుండా ఆయన పార్టీకి తీరని అన్యాయం చేశారన్నారు. పార్టీకి కావాలనే నష్టం చేసిన పీసీసీ అధ్యక్షుడుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, తన ఆరోపణలన్నీ రాతపూర్వకంగా పార్టీకి ఇవ్వాలని ఆయన కోరినట్టు తెలిపారు.

విపత్తు నుంచి తేరుకోనేలేదు

(మొదటిపేజీ తరువాయి)

మీడియా సమావేశంలో మాట్లాడారు. కేరళలో వరదల వల్ల సంభవించిన ఆర్థిక నష్టం విషయాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. దీనికి అన్ని రాష్ట్రాలు మద్దతు తెలిపాయన్నారు. అందువల్ల కౌన్సిల్ తమ రాష్ట్రానికి కొంతమేర వెసులుబాటు కల్పించినట్టు తెలిపారు. ఈ నిర్ణయం కొంతమేర ఉపశమనం మాత్రమే ఇవ్వగలుగుతుందని, పూర్తిమేర నష్ట నివారణ చేయలేదని వివరించారు. తమ విజ్ఞప్తికి ఇతర రాష్ట్రాలు మద్దతు ఇవ్వడంతో, తమ రాష్ట్రంలో చేపట్టే అమ్మకాలపై ఒక శాతం పన్ను అదనంగా విధించుకోవడానికి కౌన్సిల్ తమ ప్రభుత్వానికి అనుమతిని ఇచ్చిందని అన్నారు. అయితే, ఈ వెసులుబాటును తాము రెండేండ్ల వరకు పొందగలుగుతామని థామస్ చెప్పారు. సాధారణంగా కరువు, కాటకాలు, వరదలు, విపత్తులు సంభవించిన సందర్భంలో ఆయా రాష్ట్రానికి సెస్ విధింపు విషయంలో కొంత ఉపశమనం కలిగించడం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. అందులో భాగంగానే తమకు ఈ అవకాశం వచ్చిందని అన్నారు. జీఎస్టీ అమలు జరిగాక ప్రత్యేక సెస్ విధించుకునేందుకు అవకాశం పొందిన తొలి రాష్ట్రం కేరళేనని అన్నారు. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజానీకం చేసే వాణిజ్యంపై ఈ జీఎస్టీ కౌన్సిల్ లోతుగా చర్చ జరిగినట్టు మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

అమ్మ ఒడి నుంచి..

(మొదటిపేజీ తరువాయి)

150మంది ఆడపిల్లలను శిశువిహార్‌కు అప్పగించారు. వీరంతా బంజారా కుటుంబాలకు చెందిన వారే. వారసులు కావాలనే కోరికతో కొందరు, పెంచే స్తోమత లేక మరికొందరు పిల్లలను వదిలించుకుంటున్న పరిస్థితి. ఎద్దు మిట్ట తండా, నర్సాయపల్లి, చిన్యతండా, కొర్రితండా, మాన్యతండా, చత్రి కతండా, ఐనోల్, అక్కారం, బొమ్మన్‌పల్లి, కిష్టంపల్లి తండాల్లో ఇలాంటి ఘటనలు అనేకం. ఉప్పునుంతల పరిధిలోని వెల్టూర్ గ్రామం మాన్యతండాకు చెందిన మూడావత్ పద్మ-సేవ్యా దంపతులకు ఇద్దరు ఆడపిల్లలున్నారు. 2017జులైలో మూడో కాన్పులో పుట్టిన ఆడబిడ్డను శిశువిహార్‌కు అప్పగించారు. వీరు కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. జన్మనిచ్చిన తల్లి ఆస్పత్రి నుంచి రాకముందే తండ్రి బిడ్డను వదలించుకున్న పరిస్థితి. అదే తండాలో శాంత బిడ్డను, కొర్రాండలో కమల- బిక్యాలకు పుట్టిన మూడో బిడ్డను శిశు విహార్‌కు అప్పగించారు. చిన్నాతండాలో పార్వతి- హన్మంతు, ఉప్పు నుంతల మండలం చత్రిక తండాలో విజయ-హరిలాల్, అమ్రబాద్ మండలం ఇప్పలపల్లి తండాలో ఇలా చాలా చోట ఆడబిడ్డలను స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. అచ్చంపేట మండలం బొమ్మన్‌పల్లి కిష్ట్యాతండాకు చెందిన రాత్లావత్ పద్మ-కృష్ణలకు పుట్టిన బిడ్డను 2018జూన్ 16న అప్పగించారు. ఐనోల్ తండాలో పద్మ-నెహ్రు, చిన్యా తండాలో పార్వతి-హన్మంతు ఇటీవల తమ బిడ్డలను శిశు విహార్‌లో వదిలారు.

పుట్టిన 11రోజులకే శిశు విహార్‌కు...

అచ్చంపేట మండలం అంకినోనిపల్లి గ్రామానికి చెందిన మూడావత్ రేణుక-రవి దంపతులకు ఇదివరకే ఇద్దరు ఆడ పిల్లలున్నారు. కొడుకు కూడా ఉంది. నాల్గో సంతానంలో గత నెల 18న ఆడపిల్ల జన్మించింది. బిడ్డను వదిలించుకోవాలని చూస్తున్న దంపతులకు ఐసీడీఎస్ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినప్పటికీ వీరిలో మార్పు రాలేదు. అంగన్‌వాడీ టీచర్ సుధారాణికి సమాచారమిచ్చి ఆమె ద్వారా సీడీపీఓ దమయంతికి బిడ్డను అప్పగించారు. అక్కడి నుంచి మహబూబ్ నగర్ శిశువిహార్‌కు పాపను తరలించారు. బిడ్డను ఎందుకు వదలించుకోవడానికి ఆర్థిక సమస్యలే కారణంగా చెప్పుకొస్తున్నారు.

సర్కార్ అవగాహనా చర్యలు శూన్యం..

గిరిజనులకు అధిక సంతానం, పుట్టిన బిడ్డల్ని విక్రయించడం నేరంలాంటి విషయాలపై అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారు. వారి ఆర్థిక పరిస్థితికి పాలకులూ కారణమే. ఉపాధి లేక, పనులు దొరక్క ఇబ్బందులు పడుతున్న వారి దైన్యస్థితిని చూసి గ్రామాలు, తండాల్లోనే ఏవైనా ఉపాధి చర్యలు కల్పించి ఉంటే పరిస్థితి మెరుగ్గా ఉండేది. ఆర్థిక భారం కొంత తగ్గేది. పిల్లల్ని సాకలేక తల్లిదండ్రులు స్వచ్ఛంధ సంస్థలకు అప్పగిస్తున్నారంటే.. సర్కార్ వారి అభివృద్ధికి చేయూతనివ్వకపోవడమే కారణం. ఇప్పటికైనా నల్లమల గిరిజనులపై అధికారులు పూర్తిస్థాయి అధ్యయనం చేసి వారి బతుకుల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వానికి వృద్ధాశ్రమం దానం..

దంపతులకు కేటీఆర్ అభినందన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరు గ్రామంలో నిర్మించిన మేరెడ్డి సత్యనారాయణరెడ్డి జానకమ్మ వానప్రస్థాశ్రమాన్ని ప్రభుత్వానికి డొనేట్ చేసేందుకు ఆశ్రమ వ్యవస్థాపకులు మేరెడ్డి సత్యనారాయణ రెడ్డి, జానకమ్మ దంపతులు ముందుకు వచ్చారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో వారు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి పూర్తి వివరాలు అందించారు. ఎకరంన్నర భూమిలో దాదాపు ఆరు వేల చదరపు అడుగుల భవనాన్ని సొంత ఖర్చులతో నిర్మించామని, అనారోగ్య కారణాల రీత్యా భవనంతోపాటు పూర్తి ఆశ్రమాన్ని ప్రభుత్వానికి విరాళం ఇచ్చేందుకు నిర్ణయించామని వారు తెలిపారు. తద్వారా వద్ధులకు సేవలు కొనసాగేలా చూడాలని కేటీఆర్‌ని కోరారు. ఈ విషయంలో ఎమ్మెల్యే గొంగిడి సునీత.. యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్‌తో మాట్లాడతారని కేటీఆర్ వారికి హామీనిచ్చారు. వృద్ధాశ్రమ సేవలు మున్ముందు కూడా కొనసాగించేందుకు వీలుగా ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి దంపతుల సేవా దక్పథాన్ని, వారి దాతత్వాన్ని కేటీఆర్ ప్రశంసించారు.

సగం కంటే తక్కువే..

(మొదటిపేజీ తరువాయి)

అది 44.78 శాతానికి పడిపోవటం గమనార్హం. ఇదే ఇప్పుడు ఆర్థికశాఖను కలవరపెడుతున్న అంశం. మరోవైపు అప్పుల రూపంలో మాత్రం ఖజానాకు రూ.21,537 కోట్లు సమకూరాయి. ఈ రూపంలో రూ.29,077 కోట్ల ఆదాయం లభిస్తుందని సర్కారు అంచనా వేసుకుంది.

ఈ నేపథ్యంలో బడ్జెట్‌కు తుది రూపమిచ్చే సమయంలో తీవ్ర కసరత్తులు చేయాల్సి ఉంటుందంటూ ఓ ఉన్నతాధికారి చెప్పారు. ప్రాధాన్యతా రంగాలకు అధిక ప్రాధాన్యతమిస్తూనే... సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేయాల్సి ఉంటుందంటూ ఆయన తెలిపారు. మరోవైపు ఇప్పటి వరకూ సర్కారు చేసిన రెండున్నర లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు కూడా చెల్లించాలని.. ఇందుకు మన ఆర్థిక పరిస్థితి కూడా సపోర్టు చేయాలని ఆయన చెప్పుకొచ్చారు. ఇవిగాక బడ్జెటేతరం పేరుతో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు కూడా రుణాలు సంగ్రహించామని తెలిపారు. వచ్చే బడ్జెట్‌లో వీటన్నింటినీ క్రోడీకరించేందుకు వీలుగా కసరత్తులు జరుగుతున్నాయని తెలిసింది. మరోవైపు శాఖల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించి పంపాలంటూ ఆర్థికశాఖ.. ఇతర శాఖలను ఆదేశించిన నేపథ్యంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు వాటి రూపకల్పనలో నిమగ్నమయ్యారు.

సీబీఐ చీఫ్ ఔట్

(మొదటిపేజీ తరువాయి)

రోజే ప్రధాని మోడీ నేతృత్వంలోని కమిటీ తొలగించడం గమనార్హం. అలోక్‌వర్మపై సెంట్రల్ విజిలెన్స్ కమిటీ నివేదికను పరిశీలించిన అనంతరం గురువారం రెండోసారి సమావేశమైన అత్యున్నత కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నది. కమిటీ బుధవారం సమావేశమైనప్ప టికీ ఏ నిర్ణయమూ తీసుకోకుండా వాయిదా పడింది. అలోక్‌వర్మను తొలగించేందుకు ప్రధాని మోడీ, జస్టిస్ సిక్రీ మొగ్గు చూపగా, ఖర్గే వ్యతిరేకించారు. 2-1 తేడాతో అత్యున్నత కమిటీ తీర్మానాన్ని అధికారికంగా వెల్లడించారు. అలోక్‌వర్మ ఈ నెల 31న రిటైర్ కానున్నారు. తాజాగా ఆయన్ని ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌గా కేంద్రం బదిలీ చేసింది.

ఇదిలా ఉండగా బుధవారం సీబీఐ డైరెక్ట ర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే అలోక్‌వర్మ తాత్కాలిక డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావుతో సహా ఐదుగురు అధికారులను బదిలీ చేశారు. సాయంత్రం ప్రధాని అధ్యక్షతన భేటీ అయిన అత్యున్నత కమిటీ అలోక్‌వర్మను తొలగించాలని నిర్ణయించటం.. సీబీఐ హెడ్‌క్వార్టర్‌లో ఉన్న అలోక్‌వర్మ తాను తీసుకున్న బదిలీ నిర్ణయాలను రద్దు చేశారు.. ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్తానాలు పరస్పరం ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకున్నారన్న సాకుతో అక్టోబర్ 23న వారిద్దరినీ కేంద్ర ప్రభుత్వం బలవంతపు సెలవుపై పంపిన విషయం తెలిసిందే. అదేరోజు తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వరరావును కేంద్రం నియమించింది. నాగేశ్వరరావు బదిలీ చేసినవారిలో ఆస్తానాపై దర్యాప్తు జరుపుతున్న అధికారులు కూడా ఉన్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని వ్యతిరేకిస్తూ అలోక్‌వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అలోక్‌వర్మ తొలగింపును తప్పుపట్టిన సుప్రీంకోర్టు ఆయనకు తిరిగి బాధ్యతలు అప్పజెప్పాల్సిందిగా ఈ నెల 8న కేంద్రాన్ని ఆదేశిస్తూ తీర్పు ఇచ్చింది. దీంతో, బాధ్యతలు చేపట్టిన అలోక్‌వర్మ అక్టోబర్ 24 నుంచి జనవరి 8 వరకు సీబీఐలో జరిగిన బదిలీలను రద్దు చేశారు. సీబీఐ డీఐజీలు అనీశ్‌ప్రసాద్, కెఆర్ చౌరస్యా బదిలీలను మాత్రం మినహాయించారు. ఆస్తానా కేసు విచారణను 2006 ఐపీఎస్ అధికారి మోహిత్‌సేన్ గుప్తాకు అప్పగించారు.

తిరిగి యథాస్థానాల్లోకి వచ్చినవారిలో రాకేశ్ ఆస్తానాపై దర్యాప్తు జరుపుతున్న డీఎస్పీ ఎకె బస్సీ, డీఐజీ మనీశ్‌కుమార్‌సిన్హా, అదనపు ఎస్పీ ఎస్ఎస్ గుర్మ్ ఉన్నారు. వీరు ఢిల్లీలో మునుపటి స్థానాల్లో పని చేయనున్నారు. జాయింట్ డైరెక్టర్ ఎకె శర్మను కూడా పూర్వ స్థానంలోకి తీసుకొచ్చారు. రాకేశ్ ఆస్తానాపై అవినీతి ఆరోపణలు చేస్తూ ఢిల్లీ హైకోర్టుతోపాటు సుప్రీం కోర్టులో పిటిషన్లు వేసినవారిలో ఎకె శర్మ, బస్సీ, గుర్మ్ ఉన్నారు. గతేడాది అక్టోబర్ 15న రాకేశ్ ఆస్తానాపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయడం గమనార్హం.

విద్యుత్ కంపెనీల మాయాజాలం

(మొదటిపేజీ తరువాయి)

రుణాలు తీర్చలేక చతికిలపడ్డాయి. సమాధాన్(ఆస్తుల నిర్వహణ,రుణ నిర్మాణంలో మార్పు) పథకం కింద అదానీ గ్రూప్‌తో ఈ మూడు కంపెనీలు తమ రుణాలను పరిష్కరించుకోనున్నట్టు చెబుతున్నారు. ఈ మూడు కంపెనీల అప్పుల మొత్తం విలువ రూ.31,500 కోట్లు. ఈ పథకం కింద రుణాల్ని పరిష్కరించగల, పరిష్కరించ సాధ్యంకాని అప్పులుగా వర్గీకరిస్తారు. పరిష్కరించగల భాగాన్ని నూతన యాజమాన్యం చెల్లించాల్సి ఉంటుంది. సాధ్యంకాని భాగాన్ని ఈక్విటీగా మారుస్తారు. మిగతా కంపెనీలు కూడా జనవరి 31 వరకల్లా రుణ పరిష్కారానికి రానున్నట్టు తెలుస్తోంది.

అయితే,ఈ మూడు కంపెనీల్ని కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చిన అదానీ గ్రూప్ కూడా విద్యుత్ ప్రాజెక్టుల విషయంలో అప్పుల ఊబీలో కూరుకుపోవడం గమనార్హం. పార్లమెంటరీ కమిటీ నివేదిక ప్రకారం బొగ్గు ఆధారిత 34 విద్యుత్ ప్రాజెక్ట్‌లు అప్పులు చెల్లించలేని స్థితిలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల మొత్తం అప్పుల విలువ రూ.లక్షా 77 వేలకోట్లు అని కమిటీ తెలిపింది. ఈ ప్రాజెక్టులు నిధుల కొరత, విద్యుత్ అమ్మకాల ఒప్పందాలను అమలు చేయలేకపోవడం, ఇంధన భద్రత లేకపోవడంలాంటి తీవ్ర సమస్యలనెదుర్కొంటున్నట్టు కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. కమిటీ నివేదికలోని 34 విద్యుత్ ప్రాజెక్టుల్లో అదానీ పవర్ మహారాష్ట్ర లిమిటెడ్ రూ.11765 కోట్లు, అదానీ కోబ్రా వెస్ట్ రూ.3099 కోట్లు బ్యాంకులకు రుణాలు చెల్లించాల్సి ఉన్నట్టు పేర్కొనడం గమనార్హం.

విద్యుత్ కంపెనీల అప్పుల వ్యవహారమిపుడు సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నది. గతేడాది ఫిబ్రవరిలో దేశంలోని బ్యాంకులన్నిటికీ ఆర్‌బీఐ ఓ సర్క్యులర్ జారీ చేసింది. దాని ప్రకారం రూ.2000 కోట్లకుపైగా అప్పులు చెల్లించలేకపోయిన కంపెనీలను 180 రోజుల(ఆరు నెలలు) సమయమిచ్చి ఆ తర్వాత దివాలా ప్రక్రియను ప్రారంభించాలని ఆర్‌బీఐ ఆదేశించింది. దాంతో, జీఎంఆర్ ఎనర్జీ, రత్తన్ ఇండియా పవర్, గుజరాత్‌కు చెందిన షిప్ బిల్డింగ్ అసోసియేషన్‌సహా పలు కంపెనీలపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు చెందిన ఆయా రాష్ట్రాల కోర్టుల్లో కేసులు నమోదయ్యాయి. తమపై దివాలా చట్టం కింద చర్యలు తీసుకోకుండా పలు కంపెనీలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. దాంతో, బ్యాంకులను ఈ కేసుల్లో ముందుకు వెళ్లకుండా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆర్‌బీఐ సర్క్యులర్ కింద నమోదైన కేసులన్నిటినీ తమకు బదిలీ చేయాల్సిందిగా ట్రిబ్యునల్ కోర్టులను సుప్రీంకోర్టు ఆదేశించింది.

రుణాల ఎగవేతకు పాల్పడుతున్న విద్యుత్ కంపెనీలపై కఠిన చర్యలకు సిద్ధమైనందునే ఆర్‌బీఐలోని కొందరు అధికారులతో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విభేదించినట్టు విమర్శలున్నాయి. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ ఊర్జిట్ పటేల్‌పై కేంద్రం ఒత్తిడి వల్లే ఆయన తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని ప్రధాని మోడీపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

విద్యుత్ సెక్టార్.. కేసీఆర్ మానసపుత్రిక

- ఉద్యోగుల కృషి వల్లే ఆ రంగంలో ఖ్యాతి
- పవర్ ఇంజనీర్స్ డైరీ ఆవిష్కరణలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎమ్‌డీ ప్రభాకరరావు



డైరీని ఆవిష్కరిస్తున్న ప్రభాకరరావు, రఘుమారెడ్డి తదితరులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ విద్యుత్‌రంగమనేది ముఖ్యమంత్రి కేసీఆర్ మానసపుత్రికని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎమ్‌డీ డి.ప్రభాకరరావు అన్నారు. ఆయన పట్టుదలతోపాటు ఉద్యోగుల నిరంతర కృషి వల్లే విద్యుత్ రంగంలో తెలంగాణ దూసుకెళుతున్నదని చెప్పారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు కూడా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'పవర్ ఇంజనీర్స్ డైరీ -2019' ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎమ్‌డీ మాట్లాడుతూ... గత నాలుగేండ్లలో తెలంగాణ విద్యుత్‌రంగంలో ట్రాన్స్‌మిషన్ నష్టాలు 2.88 శాతానికి తగ్గాయని తెలిపారు. విద్యుత్ సామర్థ్యం 99.99 శాతానికి చేరుకుందని అన్నారు. ట్రాన్స్‌కో, డిస్ట్రిబ్యూషన్ రంగంలో రూ.22 వేల కోట్ల పెట్టుబడులు పెట్టామని చెప్పారు. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉద్యోగులకు పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో విద్యుత్ సంస్థల సీఎమ్‌డీలు జి.రఘుమారెడ్డి, ఎ.గోపాలరావు, ట్రాన్స్‌కో జేఎమ్‌డీ శ్రీనివాసరావు, ఇంజనీర్లు పి.రత్నాకరరావు, సదానందం, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, భాస్కర్‌తోపాటు పలువురు డైరెక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల్లో 50 ఏండ్లు పూర్తి..

సీఎమ్‌డీగా ఉన్న ప్రభాకరావు.. విద్యుత్ సంస్థల్లో తన 50 ఏండ్ల సేవలను పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇంజనీర్లు, ఉద్యోగులు 50 కేజీల కేక్‌ను కట్ చేసి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు, కొరత లేకుండా చేయటంలో ప్రభాకరరావు క్రియాశీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా వారు చెప్పారు.

ఎన్టీపీసీ నుంచి ప్రశంసలు...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టును కేవలం 42 నెలల కాలంలోనే నిర్మించటం ద్వారా మన విద్యుత్ సంస్థలు రికార్డు సృష్టించాయని ఈ సందర్భంగా పలువురు వక్తలు చెప్పారు. ఈ కృషిని గుర్తించిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) తన ప్రతినిధి బృందాన్ని రాష్ట్రానికి పంపించిందని వారు తెలిపారు. ఆ ప్రాజెక్టుపై వారు అధ్యయనం చేస్తున్నారని వివరించారు.

మళ్లీ పైపైకి..

(మొదటిపేజీ తరువాయి)

ఎగబాకాయి. సవరించిన ధరల ప్రకారం.. దేశ రాజధానిలో లీటరు పెట్రోల్ రూ. 68.88 (రూ. 0.38 పైసలు పెంపు) కాగా, డీజిల్ రూ. 62.53 (రూ. 0.29 పైసలు)గా నమోదయ్యాయి. ఇవే ధరలు ముంబయిలో రూ. 74.53, రూ. 65.43 కాగా, హైదరాబాద్‌లో పెట్రోల్ రూ. 73.07, డీజిల్ రూ. 67.98కి చేరుకున్నాయి.

గత నెలలో ముగిసిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తరువాత ప్రారంభమైన పెట్రో ఉత్పత్తుల రేట్లలో పెరుగుదల.. క్రమంగా కొనసాగుతోంది. దీంతో మరోసారి గత ఏడాదిలో మాదిరిగానే ఇంధన ధరలు ఆకాశాన్నంటుతాయని సామాన్య జనం ఆందోళన చెందుతున్నారు. గతేడాది ఆగస్టు మాసాంతంలో మొదలైన చమురు ఉత్పత్తుల ధరలలో పెంపు.. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే వరకూ కొనసాగిన విషయం తెలిసిందే. ఓ దశలో పెట్రోల్ వంద రూపాయలకు చేరుకున్న సందర్భాలు ఉన్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నుంచే మోడీ సర్కారు ఇంధన ధరలను మళ్లీ పెంచుతున్న విషయం విదితమే.

సీఎల్పీ నేతగా భట్టి..!

(మొదటిపేజీ తరువాయి)

సీతక్క, పొడెం వీరయ్య వంటి సీనియర్ నేతలు కూడా గెలుపొందారు. వీరిలో ఉత్తమ్, రాజగోపాల్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సీఎల్పీ పదవి కోసం పోటీ పడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎల్పీ పదవి కోసం తీవ్రంగానే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసింది. ఎన్నికల్లో పార్టీ ఓటమిపాలైనప్పటికీ ఆయన ఆ పదవిని వదలకపోగా...మరో కీలకమైన పదవి అడగటం పట్ల అధిష్టానం అసంతృప్తి వ్యక్తం చేసినట్టు పార్టీ వర్గాలు చెప్పాయి. అదే సామాజికవర్గానికి చెందిన సబితాఇంద్రారెడ్డి, రాజగోపాల్‌రెడ్డిలకు ఇచ్చేందుకు అధిష్టానం ససేమిరా అంటుందని గాంధీభవన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. సీఎల్పీ పదవితోపాటు ప్రజా పద్దుల సంఘం(పీఏసీ). విప్, కార్యదర్శి, మూడు డిప్యూటీ లీడర్ పదవులు ఇచ్చే అవకాశం ఉన్నది. వీటిలో పీఏసీ చైర్మెన్ పదవి అత్యంత కీలకమైనది. సీఎల్పీ పదవి ఆశిస్తున్న నేతలకు వీటిలో ఏదో ఒక పదవి వరించే అవకాశం ఉన్నది.

ముందస్తు ఎన్నికల్లో ప్రచార కమిటీ చైర్మెన్‌గా వ్యవహరించిన విక్రమార్క దళిత సామాజికవర్గానికి చెందిన నేత కావడంతో అధిష్టానం ఆయనవైపే మొగ్గు చూపుతున్నది. గత కాంగ్రెస్ ప్రభుత్వాల్లో ఆయన చీఫ్‌విఫ్‌గా, డిప్యూటీ స్పీకర్‌గా పని చేసిన అనుభవం కూడా ఉన్నది. అంతే కాకుండా టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఉండి, పార్టీ అనుబంధ సంఘాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతోపాటు గెలిచిన ఎమ్మెల్యేలు సైతం ఆయన పేరునే సూచిస్తుండటం గమనార్హం. ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ సీనియర్ నేతలు జానారెడ్డి, డికె అరుణ, రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, గీతారెడ్డి, దామోదర రాజనర్సింహ, రేణుకా చౌదరి వంటి నేతలు కూడా ఆయనకు మద్దతు ఇస్తున్నారు. దీంతోపాటు ఆయనకు ఏఐసీసీ జాతీయ నేత కొప్పుల రాజు అండదండలున్నాయి. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రకుంతియా మాత్రం ఉత్తమ్‌కు అనుకూలంగా ఉన్నట్టు పార్టీ నేతల్లో ప్రచారం జరుగుతున్నది.

జేఎన్‌యూ వీసీ రాజీనామాకు డిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

వర్సిటీని కాపాడటం కోసం మంత్రి జోక్యం చేసుకోవాలని కోరారు. జేఎన్‌యూ వీసీపై తక్షణ దర్యాప్తునకు డిమాండ్ చేస్తున్నామని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా అన్నారు. గత కొన్నేండ్లుగా జేఎన్‌యూ వివాదాలకు కేంద్రంగా మారిపోయింది. వర్సిటీ వీసీ ఏకపక్ష తీరుకు వ్యతిరేకంగా జేఎన్‌యూ విద్యార్థి సంఘాలు, టీచర్స్ అసోసియేషన్స్ క్యాంపస్‌లో అనేక సార్లు నిరసనలు వ్యక్తం చేస్తోన్న విషయం తెలిసిందే.

సం'క్రాంతి'కి పస్తులేనా?

(మొదటిపేజీ తరువాయి)

టీఆర్ఎస్ ప్రభుత్వం తమ ఆవేదనను అర్థం చేసుకొని జీతాలు వెంటనే చెల్లించేలా అధికారులకు ఆదేశాలివ్వాలని ఎయిడెడ్ సిబ్బంది కోరుతున్నారు. ఎయిడెడ్ సిబ్బంది జీతాల చెల్లింపు పట్ల టీఆర్ఎస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధనిక రాష్ట్రంలో జీతాలకు నిధుల్లేవు

రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలు 302, ప్రాథమికోన్నత పాఠశాలలు 135, ఉన్నత పాఠశాలలు 283 చొప్పున మొత్తం 720 ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. వాటిలో 1.30 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో బోధనా సిబ్బంది 5 వేల మంది, బోధనేతర సిబ్బంది 2 వేల మంది చొప్పున మొత్తం ఏడు వేల మంది పనిచేస్తున్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఎయిడెడ్ సిబ్బంది ఐదు నెలల వేతనాల కోసం ప్రభుత్వం రూ.103 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. ధనిక రాష్ట్రంలో ఎయిడెడ్ సిబ్బందికి జీతాలివ్వలేని పరిస్థితి నెలకొంది. ఎయిడెడ్ సిబ్బంది జీతాల కోసం పాఠశాల విద్యాశాఖ, ఆర్థిక శాఖ అధికారుల చుట్టూ పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. అయినా ప్రయోజనం కనిపించడం లేదు. నిధుల విడుదలపై ఆర్థిక శాఖ ఫ్రీజింగ్ విధించిందని విద్యాశాఖ అధికారులు వాపోతున్నారు. ఆర్థిక శాఖ అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలని చెప్తున్నారు. దీంతో జీతాలు రావాలంటే ఏం చేయాలో ఎయిడెడ్ సిబ్బందికి అర్థం కావడం లేదు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావును కలిసి సమస్యను వివరించాలని ప్రయత్నించినా అపాయింట్‌మెంట్ దొరకడం లేదు. టీఆర్ఎస్‌లో ఇతర నాయకులకు చెప్పినా సమస్య పరిష్కారం కావడం లేదని పలువురు ఎయిడెడ్ ఉపాధ్యాయులు, నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎయిడెడ్ సిబ్బందికి జీతాలు చెల్లించాలి : విఆర్ దేశ్‌పాండే

రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బందికి సంక్రాంతిలోపే జీతాలు చెల్లించాలని ఎయిడెడ్ టీచర్స్ గిల్డ్ అధ్యక్షులు విఆర్ దేశ్‌పాండే డిమాండ్ చేశారు. ఎయిడెడ్ సిబ్బంది సంక్రాంతి పండుగ చేసుకునే అవకాశం కల్పించాలని సూచించారు. ఐదు నెలలుగా జీతాలు చెల్లించకుంటే ఎలా జీవనం సాగించాలనీ, కుటుంబాలను ఎలా పోషించాలనీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా తమ ఆవేదనను అర్థం చేసుకోవాలనీ, జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మెట్రోకారిడార్‌లో బస్సులను కుదించొద్దు : ఎస్‌డబ్ల్యూఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మెట్రో రైలు నడుస్తున్న రూట్లలో బస్సుల సంఖ్యను కుదించాలని ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించడం సరిగాదని, ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ రాంచందర్, విఎస్.రావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బస్సుల కుదింపును ఆపకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఆర్టీసీపై ఎక్స్‌పర్ట్ కమిటీ అధ్యయనం కొనసాగిస్తుండగానే...నష్టాలను తగ్గించడంపై అధ్యయనానికి మరో కమిటీని వేయటాన్ని తప్పుబట్టారు. ఆర్టీసీ ఆస్పత్రుల్లో 10 రోజులుగా మందుకొరత ఏర్పడిందని, తక్షణమే నాణ్యమైన మందులను తెప్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి ఒక శాతం నిధులు కేటాయించాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సంస్థకు వస్తున్న నష్టాన్ని ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు.

నేటినుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించింది. ఈనెల 17వ తేదీ వరకు సెలవులుంటాయి. ఈ మేరకు అకడమిక్ క్యాలెండర్‌లో పాఠశాల విద్యాశాఖ పొందుపరిచింది. ఈనెల 18న పాఠశాలలు పున:ప్రారంభమవుతాయి.

14,15 తేదీల్లో జూనియర్ కాలేజీలకు సెలవులు

ఈనెల 14,15 తేదీల్లో రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కాలేజీలకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించింది. ఈనెల 16న జూనియర్ కాలేజీలు పున:ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న రెండో శనివారం, 13న ఆదివారం కావడంతో జూనియర్ కాలేజీలకు సెలవులు వచ్చిన విషయం తెలిసిందే.

సెన్సెక్స్ ▼106.41 36,106

నిఫ్టీ ▼-34 10,821


డాలరుకు రూపాయి విలువ 69.68



బంగారం(10.గ్రా) రూ. 31,912



వెండి (కేజీ) రూ. 39,259



కోడిగుడ్లు (వందకి)			
హైదరాబాద్	433	విజయవాడ	441
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
వరంగల్	433	ముంబయి	484



నాలుగు రోజుల లాభాలకు బ్రేక్



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్ల నాలుగు రోజుల వరుస లాభాలకు గండి పడింది. పలు ప్రతికూల పరిణామాలతో ఆసియన్ మార్కెట్లు బలహీ నంగా కొనసాగడానికి తోడు బ్యాంకింగ్ షేర్లు అమ్మకాలకు గురి కావడంతో గురు వారం సెన్సెక్స్, నిఫ్టీలు నష్టపోయాయి. తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 106 పాయింట్లు లేదా 0.29 శాతం తగ్గి 36,107 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 34 పాయింట్లు లేదా 0.31 శాతం తగ్గి 10,822 వద్ద నమో దయ్యింది. నిఫ్టీలో 20 స్టాక్స్ నష్టపోగా, 20 స్టాక్స్ లాభపడ్డాయి. ఇండు స్ఇండ్ బ్యాంకు, కొటాక్ బ్యాంకు, ఫెడరల్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, హెచ్డిఎఫ్సి బ్యాంకు, ఎస్బిఐ సూచీలు 2.36 శాతం వరకు నష్టపోయాయి. అదే విధంగా ఒఎన్జిసి, మారుతి సుజుకి, సన్ ఫార్మా, హెచ్డిఎఫ్సి, హీరో మోటో కార్ప్, ఐటిసి, హెచ్సిఎల్ షేర్లు 1.31 శాతం మేర పడిపోయాయి. బిఎస్ఇలో మిడ్క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.49 శాతం, 0.19 శాతం చొప్పున రాణించాయి. రంగాల వారిగా నిఫ్టీలో బ్యాంకింగ్ 0.69 శాతం, ఫిన్ సర్వీసెస్ 0.56 శాతం, రియాల్టీ 0.27 శాతం చొప్పున అధికంగా నష్టపోయాయి.

హువాయి నుంచి వి9




న్యూఢిల్లీ : హువాయి ఇండియా గురువారం దేశ మార్కెట్లోకి హువాయి వి9 2019 స్మార్ట్ఫోన్ను విడుదల చేసింది. 6.5 అంగుళాల డిస్ప్లే, 3డి కర్వ్ డిజైన్ కలిగిన ఈ ఫోన్ ధరను రూ. 15,990గా నిర్ణయించింది. 4,000 ఎంఎహెచ్ బ్యాటరీ, 16 ఎంపి, 2 ఎంపి ఫ్రంట్ కెమెరాలు, 13 ఎంపి ప్లస్ 2 ఎంపి రియల్ డ్యూయల్ కెమెరాలతో ఆవిష్కరించింది. ఇంటిలిజెంట్ అల్గారిథమ్ను ఉపయోగించుకుని అత్యంత తక్కువ కాంతి లేదా బ్యాక్ లైటింగ్ కండీషన్లోనూ పోటోలు తీసుకునే అవకాశం ఉందని హువాయ్ బ్రాండ్ ఇండియా కంట్రీ మేనేజర్ పాన్ యిన్ లాంగ్ పేర్కొన్నారు. 4.0 ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ టెక్నాలజీ కలిగిన ఈ ఫోన్ 15 జనవరి నుంచి అమెజాన్లో లభ్యమవుతుందన్నారు.

మారతి కార్లు ప్రియం

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీదారు మారుతి సుజుకి తమ వాహన ధరలను రూ.10,000 వరకు పెంచుతున్నట్లు గురువారం ప్రకటించింది. పెంచిన ధరలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. ముడి సరకు, విదేశీ మారకం రేటు పెరిగిన కారణంగా ధరలు పెంచాల్సి వచ్చినట్లు తెలిపింది. కాగా ఏ కార్లపై ఎంత ధరలు పెరుగుతాయనేది ఆ కంపెనీ వెల్లడించలేదు. ప్రస్తుతం మారుతీ సుజుకీ కార్ల మోడళ్లు ఆల్టో 800 నుంచి ఎస్ క్రాస్ వరకు ఉన్నాయి. ఢిల్లీ ఎక్స్షోరూం వద్ద వీటి ధరల శ్రేణీ రూ.2.53 లక్షల నుంచి రూ.11.45 లక్షలుగా ఉంది.

ఉబర్ ఈట్స్కు అలియా ప్రచారం..



న్యూఢిల్లీ : ఉబర్ ఈట్స్ తన బ్రాండ్ అంబాసీడర్ బాలీవుడ్ నటీ అలియా భట్తో నూతన ప్రచారాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. 'ఎవ్రీడే మోమెంట్స్' నినాధంతో తమ మొట్ట మొదటి మెగా ప్రచారానికి రూపకల్పన చేశామని ఉబర్ ఈట్స్ బ్రాండ్ స్ట్రాటజీ హెడ్ నమిటీ కాత్రే పేర్కొన్నారు.

చిన్న వ్యాపారులకు ఊరట

40లక్షల టర్నోవర్ వరకు పన్ను లేదు

- జీఎస్టీ నుంచి మినహాయింపు



న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను (జీఎస్టి)ని ప్రవేశపెట్టి చిన్న వ్యాపారులను ఇబ్బందులకు గురి చేసిన కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు కొంత ఉపశమనం కల్పించే నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏడాదికి రూ.40 లక్షల లోపు టర్నోవర్ ఉన్న వ్యాపార సంస్థలకు జీఎస్టి నుంచి మినహాయింపు ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు ఈ మినహాయింపు రూ.20 లక్షలుగా ఉంది. జీఎస్టి పరిధిలోకి వచ్చే వ్యాపార పరిమితిని రూ.20లక్షల నుంచి రూ.40లక్షలకు చేర్చుతున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్జైట్లీ అన్నారు. గురువారం జీఎస్టి కౌన్సిల్ 32వ సమావేశం జరిగింది. కౌన్సిల్ భేటీ తర్వాత జైట్లీ పలు నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. గత ఆగస్టులో తీవ్ర వరదలతో భారీ నష్టాల పాలైన కేరళకు అంతర్ రాష్ట్ర అమ్మకాలపై ఒక శాతం సెస్ విధించుకునేందుకు అనుమతినిచ్చారు. రెండేళ్ల వరకు ఈ అవకాశం కల్పించారు. అదే విధంగా 2019 ఏప్రిల్ 1 నుంచి కంపోజిషన్ స్కీం కింద పరిమితిని రూ. 1.5 కోట్లకు పెంచినట్లు మంత్రి తెలిపారు. గతంలో ఏడాదికి రూ.కోటి లోపు టర్నోవర్ ఉన్నవాళ్లు మాత్రమే ఈ కంపోజిషన్ స్కీమ్లో చేరే అవకాశం ఉండేది. కంపోజిషన్ స్కీమ్ కింద టర్నోవర్ను లెక్కించేటప్పుడు ఒకే పాన్ (పర్మనెంట్ అకౌంట్ నంబర్)తో రిజిస్టర్ అయిన అన్ని వ్యాపారాలను లెక్కలోకి తీసుకుంటారు. కంపోజిషన్ స్కీం కింద ఉన్న వాళ్లు మూడు నెలలకోసారి పన్ను చెల్లించినా.. రిటర్న్ మాత్రం ఏడాదికోసారి ఫైల్ చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. సేవల రంగానికి కూడా కంపోజిషన్ స్కీంను విస్తరిస్తున్నట్లు జైట్లీ తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగంలో అమలవుతున్న పన్ను రేట్లకు ఏకరూపత ఇవ్వడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నామని జైట్లీ తెలిపారు. అదే విధంగా లాటరీలపై కూడా ఒకే రకం పన్ను అమలు సూచనలకు మంత్రులతో కూడిన మరో కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు.

అదరగొట్టిన టీసీఎస్

- క్యూ3లో రూ.8,105 కోట్ల రికార్డు లాభాలు
- మూడున్నరేళ్లలోనే అత్యధిక రెవెన్యూ



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ అంచనాలకు మించి రికార్డు లాభాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 24.1 శాతం వృద్ధితో రూ.8,105 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2017-18 ఇదే క్యూ3లో రూ.6,531 కోట్ల లాభాలు ఆర్జించింది. టాటా గ్రూపునకు సింహభాగం రెవెన్యూను అందిస్తుంది. క్రితం డిసెంబర్తో ముగిసిన త్రైమాసికంలో తమ రెవెన్యూలో 21 శాతం వృద్ధి చోటు చేసుకుందని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎండీ రాజేష్ గోపినాథ్ పేర్కొన్నారు. గత 14 త్రైమాసికాల్లో ఇదే రికార్డు రెవెన్యూ అని పేర్కొన్నారు. భౌగోళికంగానూ, అన్ని కేటగిరీల్లోనూ మెరుగైన వృద్ధిని నమోదు చేశామన్నారు.

ఆకర్షణీయ లాభాలు..

ఐటీ కంపెనీ ఒక త్రైమాసికంలో రూ.8000 కోట్ల పైగా లాభాలు నమోదు చేయడం సాఫ్ట్వేర్ రంగంలోనే ఒక కీలక మైలురాయి. ఇంతక్రితం జులై- సెప్టెంబర్ త్రైమాసికంలో ఈ కంపెనీ రూ.7,927 కోట్ల లాభాల నమోదు చేసింది. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ 20.80 శాతం పెరిగి రూ.37,338 కోట్లుగా చోటు చేసుకుందని బీఎస్ఈఇకి టీఎస్ఎస్ వెల్లడించింది. స్థిర కరెన్సీ ధరల వల్ల కంపెనీ రెవెన్యూ త్రైమాసికం, త్రైమాసికానికి 1.8 శాతం, ఏడాదికేడాదికి గాను 12.1 శాతం పెరుగుదల నమోదయ్యింది. గత క్యూ3లో డిజిటల్ ఎకౌంట్ రెవెన్యూ 52.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. మొత్తం రెవెన్యూలో ఈ విభాగం వాటా 30.1 శాతంగా ఉందని తెలిపింది.

మదుపర్లకు బొనాంజా..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ప్రతీ ఈక్విటీ షేర్పై రూ.2 మధ్యంతర డివిడెండ్ అందించడానికి కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. దీంతో వరుసగా మూడోసారి మధ్యంతర డివిడెండ్ను ప్రకటించినట్లయ్యింది. తాజాగా ప్రకటించిన ఈ డివిడెండ్ను జనవరి 24 నాటికి చెల్లించనున్నారు. కాగా జనవరి 18వ తేదిని రికార్డు తేదిగా గుర్తించనున్నారు.

కొత్తగా 6,827 సిబ్బంది...

మూడో త్రైమాసికంలో కొత్తగా 6,827 మంది ఉద్యోగులను తీసుకున్నారు. దీంతో డిసెంబర్ ముగింపు నాటికి టీసీఎస్ మొత్తం సిబ్బంది 4,17,929కి చేరింది. గురువారం బీఎస్ఈలో టీసీఎస్ షేర్ 0.02 శాతం పెరిగి రూ.1,885 వద్ద ముగిసింది.

ప్రభుత్వానికి ఆర్బీఐ జవాబుదారీ

- ఆర్బీఐ నగదు నిల్వల చైర్మెన్ బిమల్ జలాన్



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ స్వతంత్ర సంస్థలను ఒక్కో దాన్ని మోడీ సర్కార్ తన గుప్పిట్లోకి తీసుకుంటున్నారనడానికి మరో పరిణామం చోటు చేసుకుంది. తాజాగా రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా కేంద్ర ప్రభుత్వానికి జవాబుదారీ అంటూ ఆర్బీఐ నగదు నిల్వల చైర్మెన్ బిమల్ జలాన్ వ్యాఖ్యలే నిదర్శనం. ఆర్బీఐ విధానాల్లో ప్రభుత్వానికి కట్టుబడి ఉండాల్సిందేనని జలన్ గురువారం పేర్కొన్నారు. ఆర్బీఐ మాజీ గవర్నర్ జలాన్ నేతత్వంలో ఓ కమిటీని నగదు నిల్వల పరిమాణం పరిశీలనకు ఆర్బీఐ, కేంద్ర ప్రభుత్వం కలిసి నియమించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆర్బీఐ వద్ద రూ.9.6 లక్షల కోట్లకుపైగా మిగులు నిల్వలు ఉన్నాయి. ఈ నిల్వల్లో రూ.3.3 లక్షల కోట్లు ఇవ్వాలంటూ ఆర్బీఐకి కేంద్రం ప్రతిపాదించిన విషయం తెలిసిందే. దీంతో అప్పటికే ఆర్బీఐకి, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు మధ్య ఉన్న విభేదాలు భగ్గుమన్నాయి.

రూ.33వేలు దాటిన బంగారం



న్యూఢిల్లీ : బంగారం ధరలు వరుసగా నాలుగో రోజూ పెరిగి 10 గ్రాముల ధర రూ.33,000 పైన పలికింది. దేశంలో పెళ్లిళ్ల సీజన్ దగ్గర పడుతున్న నేపథ్యంలో బంగారానికి డిమాండ్ పెరుగుతోందని, దీంతో ముందు జాగ్రత్తగా అభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో పసిడి మరింత ప్రియమయ్యిందని బులియన్ వర్తకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.270 ఎగిసి వరుసగా రూ.33,070, రూ.32,920కి ఎగిసింది. అంతర్జాతీయంగా బంగారంపై పెట్టుబడులు పెరగడానికి తోడు డాలర్తో రూపాయి మారకం విలువ పడిపోవడం కూడా బంగారం ధరలకు ఆజ్యం పోశాయి. తాజాగా కిలో వెండిపై రూ.410 ప్రియమై రూ.40,510 వద్ద ముగిసింది.

యమహా నుంచి కొత్త బైక్...



న్యూఢిల్లీ : యమహా మోటార్ ఇండియా మార్కెట్లోకి కొత్త 2019 వైజడ్ఎఫ్-ఆర్15 వి3.0 ఎబిఎస్ను విడుదల చేసింది. ఎక్స్షోరూం వద్ద దీని ధరను రూ.1.39 లక్షలుగా నిర్ణయించింది. ఆర్15 సీరిస్కు కొనసాగింపుగా ఈ మూడో తరం బైకును ఆవిష్కరించామని ఆ కంపెనీ చైర్మన్ మోమోపుమి షిటర పేర్కొన్నారు. ఈ 150 సిసి బైక్ కోసం బుకింగ్స్ను ప్రారంభించామన్నారు.

ఖరగ్పూర్లో గ్లోబల్ ఎంటర్ప్రెన్యూర్షిప్ సమ్మిట్ 2019

- ఫిబ్రవరి 1నుంచి షురూ
- మూడురోజులపాటు నిర్వహణ





కొల్కతా: ఐఐటీ ఖరగ్పూర్లో గ్లోబల్ ఎంటర్ప్రెన్యూర్షిప్ సమ్మిట్ -2019 ను ఫిబ్రవరి 1-3 తేదీల మధ్య నిర్వహించనున్నారు. ఈ కార్య క్రమం ముఖ్య ఉద్దేశం భారత్ లో ఉన్న ప్రతిభ గల విద్యావంతులను బయటకు తీసుకురావడమేనని అనంతోజు మోహన్ కృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అంతర్జాతీయంగా ప్రముఖులైన గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, ఇండియా టీవి సీఈవో రజత్ శర్మ, గుల్జార్ ఆజాద్, బీకే చతుర్వేదీ, రాజేశ్ బల్ పాండే, సంజీవ్ బిక్వచందనీ, వాణి కోలా తదితరులు విచ్చేయనున్నారు. ఈ సమావేశం ద్వారా కార్పొరేట్ సంస్థలైన ఐబీఎం, సాంసంగ్, మైక్రోసాఫ్ట్, బీఎస్ఈ, ఇన్టెల్ , ఫ్లిప్కార్ట్, అమోజాన్ వెబ్ సర్వీసెస్, డెలాయిట్, కలకత్తా ఎంజెల్స్ వంటి ప్రముఖ సంస్థల నిర్వహణకు అధికారులను అన్వేషించనున్నారు. ఈ కాన్ఫరెన్స్ ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న విద్యా వంతులకు ఉద్యోగ అవకాశాలను కల్పించటం కూడా జరుగుతుంది. కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ కాలేజీ స్థాయిలో తాము ఏ రంగ ంలో అయితే నిష్ణాతులై ఉన్నారో వారికి ఆయా రంగాల్లో ఉద్యోగ అవకా శాలను కల్పించ నున్నారు. వివిధ రంగాల్లో వారి అనుభవాలను చర్చించే ందుకు ఈ వేదిక ఉపయోగపడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టు బడిదారులను ఈ కార్యక్రమం ద్వారా కలుసుకుని వారి అనుభవాలను తెలుసుకునే అవకాశం కూడా ఉన్నది. దీని ముఖ్య ఉద్దేశం దేశంలో ఉన్న స్టార్టప్ కంపెనీలను ముందుకు తీసుకెళ్లడం, విద్యావంతులకు స్టార్టప్ల మీద అవగాహన కల్పించడమేనని పేర్కొన్నారు.

బులంద్షెహర్ కేసులో బీజేపీ యువమోర్చా నేత అరెస్టు

లక్నో: ఉత్తరప్రదేశ్లోని బులంద్షెహర్లో జరిగిన మూకదాడి కేసులో బీజేపీ యువ మోర్చా నేత శిఖర్ అగర్వాల్ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మూకదాడి కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న శిఖర్ను హాపూర్ నుంచి కస్టడీలోకి తీసుకున్నారు. బులంద్షెహర్ సమీపంలో పశువుల కళేబరాలు కనిపించిన తర్వాత అక్కడ గుమిగూడినవారిని శిఖర్ రెచ్చగొట్టారని భావిస్తున్నారు. దీంతో ఆ మూక జరిపిన దాడిలో ఇన్స్పెక్టర్ సుబోధ్ కుమార్ సింగ్, స్థానిక యువకుడు మృతి చెందారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన భజరంగ్ దళ్ నేత యోగేశ్ రాజ్ను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. అంతకు ముందు ఆర్మీ జవాను జీతు ఫౌజీని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

'హిందీ తప్పనిసరి' నిబంధన లేదు

ఎన్ఈపీ ముసాయిదాపై కేంద్రమంత్రి జవడేకర్ వివరణ

న్యూఢిల్లీ: నూతన విద్యా ప్రణాళిక(న్యూ ఎడ్యుకేషన్ పాలసీ-ఎన్ఈపీ)లో ఎనిమిదవ తరగతి వరకు హిందీ భాష తప్పనిసరి అనే నిబంధనను కమిటీ చేర్చినట్టు వచ్చిన వార్తలను కేంద్ర మానవ వన రుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవడేకర్ ఖండించారు. ఆ వార్తల్లో వాస్తవం లేదన్నారు. శాస్త్రవేత్త కస్తూరిరంగన్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ ఎన్ఈపీ ముసాయిదా నివేదికలో ఏ భాషనూ తప్పనిసరిగా బోధి ంచాలనే ప్రతిపాదన చేయలేదని ఆయన ట్విట్టర్లో వివరణ ఇచ్చారు.

హాస్టళ్లలో ఉండలేక పోతున్నాం

మౌలిక వసతులు కల్పించాలి

- కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో విద్యార్థుల ఆందోళన
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల భిక్షాటన
- ఎమ్మెల్యే శ్రీధర్బాబుకు వినతి



నవతెలంగాణ- జమ్మికుంట/ మంథని/దౌల్తాబాద్

"హాస్టళ్లలో కనీస సౌకర్యాలు లేవు.. ఇక్కడ ఉండలేక పోతున్నాం. భోజనం సరిగా పెట్టడం లేదు.. బాత్ రూములు, మరుగుదొడ్లు లేక ఆరుబయటకు వెళ్లాల్సొస్తోంది.. గురుకుల హాస్టళ్లలో అసలు పట్టించుకోవడం లేదు" అని కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట జిల్లాల్లో విద్యార్థులు గురువారం ఆందోళన చేశారు.

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని బీసీ హాస్టల్ల్లో భోజనం సరిగా పెట్టడం లేదని విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలు విధుల్లో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి అప్పని హరీష్వర్మ మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా విద్యార్థులు భోజనం సరిగా ఉండటం లేదని అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో భిక్షాటన చేస్తున్నట్టు చెప్పారు. సమాచారం తెలుసుకున్న బీసీ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ కరీంనగర్ జిల్లా అధికారి లక్ష్మణ్ విద్యార్థుల వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ వార్డెన్ను వెంటనే సస్పెండ్ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. పై అధికారులకు నివేదిక అందజేస్తాననీ, సస్పెండ్ చేయడం తన పరిధిలో లేదని అధికారులు తెలిపారు. అయితే, కలెక్టర్ వచ్చి హామీ ఇస్తేనే భిక్షాటన ఆపేస్తామని విద్యార్థులు స్పష్టం చేశారు. భిక్షాటన చేసిన డబ్బులు ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు.

ఎమ్మెల్యే శ్రీధర్బాబును కలిసిన విద్యార్థులు



మంథని మండలం గుంజపడుగులో మహాత్మజ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాల రెండేండ్ల కిందట మంజూరైంది. గుంజ పడుగులో భవనాలు లేకపోవడంతో వెంకటాపూర్లో ఖాళీగా ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో తాతాల్కికంగా పాఠశాలను ప్రారంభించారు. అక్కడ సరైన వసతులు లేక విద్యార్థులకు ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. బాత్ రూములు, మరుగుదొడ్లు లేక అమ్మాయిలు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి. కొద్ది రోజుల కిందట పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉద యం నుంచి సాయంత్రం వరకు విద్యార్థినులు ధర్నా చేసినా ఎలాంటి ప్రయోజనమూ లేకుం డా పోయింది. దీంతో తమ సమస్యలను పరిష్కరి ంచేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందజేశారు. నెల రోజులు ఓపికతో ఉండాలనీ, ఎన్నికల తర్వాత తానే స్వయంగా పాఠశాలను సందర్శించి అన్ని సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తాననీ ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరిస్తేనే పాఠశాలకు వెళ్తాం..

గురుకుల హాస్టల్లో ఉండలేకపోతున్నామని బీసీ విద్యార్థినులు పెద్దపల్లి జిల్లా మంథని ఎమ్మెల్యే శ్రీధర్బాబుకు మొరపెట్టుకున్నారు. వారంతా మంథనిలో శ్రీధర్బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. మూడు వందల మందికి మూడు బాత్రూములే ఉన్నాయనీ, ఉదయం 3 గంటలకే లేచి స్నానాలు చేయాల్సి వస్తోందనీ ఆవేదన వ్యక్తం చేశారు. పాడైన కూరగాయలు వండుతున్నారని చెప్పారు.

తల్లిదండ్రుల ఆందోళన

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తున్నామని సర్కార్ చెబుతున్నా ఆచరణలో అమలు చేయడం లేదని వాపోయారు. దానికి నిదర్శనం గురుకుల పాఠశాలలేనని చెప్పారు. మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సరైన భోజనం పెట్టకపోవడంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ సంబంధి అధికారులకు తెలియజేస్తే, సమస్య పరిష్కరిస్తామని ప్రిన్సిపాల్ చెప్పారని గుర్తు చేశారు. అయినా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. విద్యార్థుల గదులు అధ్వానంగా ఉన్నాయని చెప్పారు. సమస్య పరిష్కరించే వరకూ ఆందోళన కొనసాగిస్తామని సిద్దిపేట రహదారిపై బైటాయించారు. పోలీసులు సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

ప్రజా సమస్యలపై పోలీసు సర్వే

ఉన్నతాధికారులతో డీజీపీ సమీక్ష

- చిత్తశుద్ధితో జరిగేలా చూడాలని అన్ని జిల్లాల ఎస్పీలు, నగర సీపీలకు ఆదేశం



నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో పోలీసులకు సంబంధించి ఏదేని సమస్యలు ఉంటే తెలుసుకొని వాటిని పరిష్కరించే క్రమంలో పోలీసుల ఫెల్ట్నీడ్ సర్వే కొనసాగుతున్నది. ఈనెల 1నుంచి పోలీసు కమిషనరేట్లు మొదలుకుని జిల్లాల వరకు సర్వే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. గత పది రోజులుగా రాష్ట్రంలో ఏ మేరకు సర్వే సాగింది, ప్రజల నుంచి ఎలాంటి ఫీడ్ బ్యాక్ లభిస్తున్నది అన్నదానిపై పోలీసు ఉన్నతాధికారులతో రాష్ట్ర డీజీపీ ఎం.మహేందర్రెడ్డి సమీక్షించారు. ముఖ్యంగా గ్రామాలు, బస్తీలు, కాలనీలలో ప్రజల నుంచి వారి అభిప్రాయాలను, సూచనలను, ఏదేని ఫిర్యాదులు ఉన్న వాటిని ఓపికతో సేకరించాలని డీజీపీ అధికారులను కోరినట్టు తెలిసింది. ఏదో చేశామన్నట్టుగా గాక పోలీసుల పని విధానంలో ఇంకా ఎలాంటి మార్పులు కోరుకుంటున్నారు, అదే సమయంలో స్థానికంగా పోలీసుల విధులు ఇంకా ఏ విధంగా సాగాలి, ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పాదుకొల్పడానికి తీసుకోవలసిన చర్యల గురించి డీజీపీ ఆసక్తిని కనబరుస్తున్నారని తెలిసింది. అన్ని పోలీసు స్టేషన్ల పరిధులలో సెక్టర్ల వారిగా విభజించి సదరు సెక్టర్ ఇన్ఛార్జి ఎస్ఐ తో పాటు హెడ్కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, బ్లూకోల్ట్ గస్తీ పోలీసులు కలిపి స్థానిక ప్రజల నుంచి అభిప్రాయ సేకరణను సాగిస్తున్నారని డీజీపీకి అధికారులు వివరించినట్టు సమాచారం. మొత్తం మీద ఈనెల 15 నాటికి ఫెల్ట్నీడ్ సర్వేను పూర్తి చేయాలనే లక్ష్యాన్ని అన్ని జిల్లాల ఎస్పీలు, నగర సీపీలకు డీజీపీ నిర్దేశించారు. ఒక వేళ అవసరమైతే ఈ గడువును పొడిగించుకోవచ్చని ఆయన సూచించారని తెలిసింది. పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న కారణంగా అనేక గ్రామాలలో పోలీసులు బందోబస్తులో ఉన్నందున మరి కొంత సమయం కావాలని జిల్లాల అధికారులు కోరుతున్నట్టు తెలిసింది. కాగా ఈసర్వే పూర్తి చేశాఖ దానిని శాస్త్రీయంగా విశ్లేషించి పోలీసుల నుంచి ప్రజలు ఎలాంటి సేవలను కోరుకుంటున్నారు, వారి ఆకాంక్షలకు తగిన రీతిలో ఇంకా పోలీసింగ్లో ఎలాంటి మార్పులు తీసుకు రావాలి అనే కోణంలో డీజీపీ చర్యలు సాగనున్నాయని తెలిసింది. ముఖ్యంగా ఆయా పోలీసు స్టేషన్ల పరిధులలో పోలీసుల పరంగా పరిష్కరించాల్సిన సమస్యలను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసేలా ఒక చార్ట్నూ రూపొందించాలనే యోచనలో ఉన్నతాధికారులున్నారని తెలిసింది. ఈ విషయమై రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ జితేందర్ గురువారం నవ తెలంగాణతో మాట్లాడుతూ ఫెల్ట్నీడ్ సర్వే సమగ్రంగా కొనసాగుతున్నదని , వీటి ద్వారా ప్రజల నుంచి మంచి ఫీడ్బ్యాక్ తమకు లభిస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు.

రాహుల్ గాంధీకి ఎన్సీడబ్ల్యూ నోటీసులు

- సీతారామన్పై అనుచిత వ్యాఖ్యలకు వివరణ కోరిన కమిషన్

న్యూఢిల్లీ: రక్షణ మంత్రి నిర్మల సీతారామన్పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకుగాను నేషనల్ కమిషన్ ఫర్ విమెన్(ఎన్సీడబ్ల్యూ).. కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీకి నోటీసులు జారీ చేసింది. రాజస్థాన్లోని జైపూర్లో బుధవారం ఓ ర్యాలీలో ప్రసంగిస్తూ.. నరేంద్ర మోడీని 'మగాడి'లా ఉండాలని కోరారు. పార్లమెంట్లో రాఫెల్ ఒప్పందం అంశంపై తనను తాను కాపాడుకోలేని మోడీ, ఒక మహిళపై ఆధారపడ్డారని అన్నారు. లోక్ సభలో రాఫెల్ ఒప్పందంపై రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ మాట్లాడిన సంగతి తెలిసిందే. కాగా, 'పీఎం పరుగెత్తి తనను రక్షిం చేందుకు ఒక మహిళను సహాయం కోరారు' అన్న వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాల్సిందిగా రాహుల్ గాంధీకి ఎన్సీడబ్ల్యూ గురువారం నోటీసులు పంపింది. ఆయన వ్యాఖ్యలు మహిళలకు వ్యతిరేకంగా, అనుచితంగా ఉన్నాయని ఎన్సీడబ్ల్యూ చీఫ్ రేఖా శర్మ తెలిపారు. మహిళలు బలహీనులని ఆయన భావిస్తున్నారా? అని ప్రశ్నించారు. దేశానికి రక్షణ మంత్రిగా ఉన్న నిర్మల సీతారామన్పై ఈ వ్యాఖ్యలు చేయడం దిగ్భ్రాంతికరమని తెలిపారు. కాగా, ఈ విషయంపై రాహుల్ తన ట్విట్టర్ ఖాతాలో.. 'గౌరవనీయులైన మోడీగారు మన సంస్కృతిలో మహిళలపట్ల గౌరవం ఇంటినుంచే మొదలవుతుందని వివరించారు. ఒక పురుషుడిలా ప్రవర్తించి, నా ప్రశ్నకు సమాధానం ఇవ్వండ'ని పేర్కొన్నారు.



భోజనవేళలు దాటిపోతున్న చాలామంది ఆహారం తీసుకోరు. కారణం అడిగితే.. ఆకలి వేయడం లేదు అంటారు. స్కూలుకు వెళ్లే పిల్లలకు పెట్టిన టిఫిన్ బాక్స్ నిండుగా తిరిగి ఇంటికి వస్తుంది. కారణం అడిగితే తినాలనిపించలేదు. సాయంత్రం నాలుగైతున్నా లంచ్ గురించి మాట్లాడరు పెద్దవారు. కారణం ఆకలివేయడం లేదు.. ఇలా ఏ వయసువారిలోనైె కనిపించి అతి సాధారణమైన సమస్య ఆకలి వేయక పోవడం. తినడానికి ఇష్టపడరు, భోజనం మానేస్తుంటారు. ఇందుకు కారణాలు తెలుసుకుందాం..

ఆకలిగా లేదా..!

ఆహారం తీసుకోవడానికి సంబంధించిన అనారోగ్యాల్లో సాధారణమైన సమస్య ఆకలివేయక పోవడం. ఈ సమస్య వున్న వారు బాగా ఆకలితో మాడిపోతున్నపుడు కూడా ఆకలి లేదని అంటూ వుంటారు.

అజీర్ణం అనేది తరచూ గ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్ల క్స వ్యాధి (జి.ఆర్.డి.డి), పూతల లేదా పిత్తాశయ వ్యాధులకు సంకేతంగా ఉంటుంది.

లక్షణాలు:

చాలామందిలో ఆకలి లేకపోవడం ఉంటుంది. అయితే కొన్ని లక్షణాలు కనిపించినపుడు దీనిని అనారోగ్య సమస్యగా పరిగణించాలి.

- కడుపు లేదా ఎగువ ఉదరంలో బర్నింగ్
- పొత్తి కడుపు నొప్పి
- ఉబ్బరం (పూర్తి భావన)
- బెల్చింగ్, గ్యాస్
- వికారం, వాంతులు
- కడుపు ఉబ్బడం

ఈ లక్షణాలు ఒత్తిడి సమయాల్లో మరింతగా పెరుగుతాయి.

ఎవరిలో ఎక్కువగా ..

అన్ని వయసుల వారిలో ఆకలిలేకపోవడం అనేది ఉంటుంది. వృద్ధుల్లో ఇది చాలా సాధారణంగా కనిపించే సమస్య. కొంతమందిలో ఈ సమస్య రావడానికి ప్రత్యేకమైన కారణాలు ఉంటాయి.

- అధికంగా మద్యం తీసుకోవడం
- ఆస్ప్రిన్ , ఇతర నొప్పి నివారణ మందుల వాడకం
- పేగుల్లో అల్సర్స్ ఉంటే..
- ఆందోళన , ఒత్తిడి వంటి సమస్యలతో బాధపడేవారిలో ఆకలి లేకపోవడం కనిపిస్తుంది.

కారణాలు..

ఆకలి లేకపోవడం, అజీర్తికి అనేక కారణాలు ఉన్నాయి:


- ఎండోమెట్రియోసిస్ నొప్పితో బాధపడేవారిలో అజీర్తి సమస్యలు ఉంటాయి.
- కొన్ని రకాల వ్యాధులు అల్సర్స్, స్టమక్ క్యాన్సర్ (చాలా అరుదైన క్యాన్సర్),
- గ్యాస్ట్రోపరేసిస్ (కడుపు సరిగ్గా ఖాళీగా ఉండని స్థితి. ఇది తరచుగా డయాబెటిస్ ఉన్నవారిలో కనిపిస్తుంది)
- చికాకుపెట్టే ప్రేగు సిండ్రోమ్
- దీర్ఘకాలిక ప్యాంక్రియాటైటిస్
- థైరాయిడ్ వ్యాధి
- ప్రెగ్నెన్సీ వారిలోనూ ఆకలిమందగిస్తుంది.

- కొన్ని రకాల మందులు ఉదాహరణకు ఆస్పిరిన్, ఇబ్యుప్రొఫెన్ (మోట్రిన్, అడ్విల్), నప్రొక్సెన్ (నప్రోసిన్) వంటివి, ఈస్ట్రోజెన్ నోటి కాంట్రాసెప్టివ్స్, స్టెరాయిడ్ మందులు, కొన్ని యాంటీబయాటిక్స్, థైరాయిడ్ మందులు ఆకలి మందగించడానికి కారణం అవుతాయి.

లైఫ్‌స్టైయిల్:

ఇటీవల లైఫ్‌స్టైయిల్ లో వచ్చిన మార్పుల కారణం అనేక వ్యాధులు వస్తున్నాయి. వాటిలో ఆకలి లేకపోవడం కూడా సమస్యయే. చాలా ఎక్కువగా తినడం, చాలా వేగంగా తినటం, అధిక కొవ్వు పదార్థాలు తినటం , ఒత్తిడితో ఉన్నప్పుడు ఆహారం తీసుకోవడం వంటి కారణాలు కూడా ఆకలి మందగించడానికి దోహదం చేస్తాయి.

మద్యపానం, ధూమపానం, మానసిక ఒత్తిడి, అలసట కారణంగా



ఆహారాన్ని జీర్ణం చేసే యాసిడ్స్ ఎక్కువగా ఉత్పత్తి కావు. దీంతో ఆకలి మందగిస్తుంది.

తినేటప్పుడు అధిక గాలిని మింగడం వల్ల అనారోగ్యంతో ముడిపడివుండే లక్షణాలను పెంచుతుంది.

కొన్నిసార్లు ఆకలి మందగించడానికి ఏ కారణాలు కనిపించవు. ఈ రకమైన అజీర్తిని ఫంక్షనల్, లేదా నాన్-అల్సర్ డీస్పెప్సియా అని పిలుస్తారు.

చికిత్స..

అజీర్ణం లక్షణాలు ఎదుర్కొంటుంటే డాక్టర్ సలహా తీసుకోవడం తప్పనిసరి. మీరు ఎదుర్కొంటున్న అసౌకర్యం కచ్చితంగా వివరిస్తే సరైన వైద్యం అందించడంలో సహాయపడుతుంది. లక్షణాలను చెప్పేటప్పుడు, ఉదరభాగంలో కలిగే అసౌకర్యం గురించి తప్పక చెప్పాలి. మీ లక్షణాలను బట్టి అవసరమైన రక్త పరీక్షలు, అల్ట్రాసౌండ్ అబ్‌డామిన్, ఎండోస్కోప్ పరీక్షలు కూడా చేయించాలి.

ఆకలి మందగించడం, అజీర్ణం అనేది ఒక వ్యాధి కాదు.. ఇవి లక్షణాలు మాత్రమే. చికిత్స సాధారణంగా అజీర్ణం కలిగించే అంతర్లీన స్థితి మీద ఆధారపడి ఉంటుంది.

నివారణ..

అజీర్తి, ఆకలి మందగించడం నివారించడానికి ఉత్తమమైన మార్గం ఆహారంలో, జీవనవిధానంలో మార్పులు చేయడం. అజీర్ణం కలిగించే ఆహారాలను గుర్తించడం కోసం డైట్ డైరీ తయారుచేసుకోవాలి.

ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి. హడావుడిగా కాకుండా నెమ్మదిగా తినాలి. బాగా నమిలి మింగాలి. ఆహారం తీసుకునే సమయంలో ఎక్కువగా నీళ్లు తాగవద్దు. భోజనం చేసిన అర గంట తర్వాత నీళ్లు తాగాలి.

- అజీర్తి సమస్యతో బాధపడేవాళ్లు సిట్రస్ పండ్లు, టమోటాలు వంటి అధిక మొత్తంలో ఆమ్లాలను కలిగి ఉండే ఆహార పదార్థాలను తక్కువగా తీసుకువాలి.
- కెఫిన్ కలిగి ఉన్న ఆహారాలు , పానీయాలను తగ్గించాలి.
- ఆహారం తీసుకున్న తర్వాత వ్యాయామం చేయవద్దు. భోజనాకి ముందు లేదా భోజనం చేసిన గంట తర్వాత మాత్రమే వ్యాయామం చేయాలి.
- భోజనం చేయగానే పడుకోవద్దు. కనీసం మూడు గంటల తర్వాత నిద్రపోవాలి.
- తల మీ పాదాలకు కనీసం 6 అంగుళాల ఎత్తులో ఉండాలి. జీర్ణాశయంలో ఉత్పత్తి అయ్యే జీర్ణ రసాలు ప్రేగులలోకి ప్రవహించడానికి ఇది సహాయపడుతుంది.

డాక్టరును ఎప్పుడు సంప్రదించాలి?

అజీర్ణం మరింత తీవ్రమైన ఆరోగ్య సమస్యకు సంకేతం. కింది లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టరును సంప్రదించాలి..


- వాంతి అయినప్పుడు రక్తం పడితే వాంతి లో రక్తం (వాంతి కాఫీ మైదానాల్లో కనిపిస్తుంది)
- శరీర బరువు బాగా తగ్గిపోవడం
- ఆకలి అసలు లేకపోవడం
- ఎగువ కుడి ఉదరంలో తీవ్రమైన నొప్పి
- ఎగువ లేదా దిగువ కుడి ఉదరం నొప్పి

అజీర్తికి సంబంధించిన లక్షణాలు గుండె జబ్బులాగే ఉంటాయి. గాబరాపడకుండా డాక్టర్‌ను సంప్రదించాలి.

డాక్టర్ స్వామి అల్వాల్,
ఎం.బి.బిఎస్(ఉస్మానియా), ఎండీ(నేచరోపతి)
సీనియర్ మెడికల్ ఆఫీసర్, సీజీహెచ్ఎస్(రిటైర్డ్)
మల్లునరసింహా రెడ్డి స్మారక ప్రజా వైద్యశాల
ఎం.హెచ్.భవన్, అజామాబాద్,
హైదరాబాద్



బీపీ కంట్రోల్ ..!



ప్రపంచం జనాభాలో ఎక్కువ మంది అధిక రక్తపీడనంతో బాధపడుతున్నారు. కొంత మందిలో వారు చాలా రోజులుగా అధిక రక్త పీడనం కలిగి ఉన్నప్పటికీ వారిలో ఉన్న రక్తపోటు గురించి తెలుసుకోలేరు.

రక్తపోటును క్రమంగా చెక్ చేయించుకుంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవటం చాలా మంచిది. అకస్మాత్‌గా ఇది పెరిగితే.. తారా స్థాయికి చేరితే వివిధ రకాల వ్యాధులకు కారణం అవుతుంది. కొన్నిసార్లు ప్రాణాల మీదకు వస్తుంది. రక్తపోటు ను సైలెంట్ కిల్లర్ అనవచ్చు. ఇది ఎలాంటి లక్షణాలు లేకుండానే ప్రాణాపాయస్థితి తీసుకువస్తుంది. క్రమం తప్పకుండా చెకప్ చేయించుకోంటూ నార్మల్‌స్థాయిలో రక్తపోటును ఉంచుకోవటం ఆరోగ్యకరమాన జీవనానికి ఎంతో అవసరం. హైపర్‌టెన్షన్‌కు లోను కావడం అంటే అనారోగ్యసమస్యలను తెచ్చుకోవడమే.

UKలో ఉన్న NHS (నేషనల్ హెల్త్ సర్వీస్) ప్రకారం, హైపర్ టెన్షన్ కలిగి ఉన్నారో లేదో తెలుసుకోటానికి ఉన్న ఒకే ఒక మార్గం, రక్త పోటును బీపీయంత్రం (స్పిగ్నో మానోమీటర్) ద్వారా తెలుసుకోవచ్చు. ఈ పరీక్ష డాక్టర్ చేస్తారు. ఇటీవల అందుబాటులోకి వచ్చిన ఆధునిక స్పిగ్మోమానోమీటర్‌లో ఇంట్లోకూడా బీపీ చెక్ చేసుకోవచ్చు. బీపీ ఎక్కువగా ఉంటే కుటుంబ చరిత్ర, జీవన శైలి గురించి డాక్టర్ అడిగే ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పాలి. చాలావరకు బీపీ సమస్య హెరిడిటీగా వస్తుంది. లైఫ్‌స్టైయిల్ కారణంగా వస్తుంది.

ఎలాంటి సమయంలో చెక్ చేయాలి..

బీపీ చెక్ చేసుకోవడం చాలా సులువైన, ఎలాంటి నొప్పి కలిగించని పరీక్ష. ఈ పరీక్ష చేయించుకోవడానికి ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- బీపీ చూయించుకోవడానికి వెళ్లేడానికి అరగంట ముందు కాఫీ కానీ, సిగిరెట్ కానీ తాగవద్దు. చెకింగ్‌కు ముందు కాఫీ, పొగ తాగటం వలన శరీర రక్తపీడనం పెరిగే ప్రమాదం ఉంది.
- కొంతమందిలో పరీక్ష చేయించుకోటానికి ముందుగా యూరిన్ బ్లాడర్ నిండి ఉంటే ఒకవిధమైన రీడింగ్.. ఖాళీగా ఉంటే మరో విధమైన రీడింగ్ స్తుంది. మూత్రాశయం స్థితి రీడింగ్‌లలో మార్పులకు కారణం కావచ్చు.
- బీపీ చెక్ చేయించుకోవడానికి ముందు ఐదు నిమిషాల పాటు స్థిరంగా కూర్చోండి. అటు, ఇటు తిరుగుతూ ఉండటం వలన రక్త పీడన పరీక్ష ఫలితాలలో మార్పులు వస్తాయి.
- సాధారణంగా బీపీ పెద్దవారిలోనూ ఉంటుంది అనుకుంటారు. ఇది వాస్తవం కాదు. టీనేజ్ వారిలోనూ.. మూడేండ్ల నిండిన పిల్లల్లోనూ రక్తపోటులో మార్పులు ఉంటాయి. బ్లడ్‌ప్రెషర్‌కు వయసుతో సంబంధం లేదు. అయితే వయసు పెరుగుదలతో రక్త పీడనంలో మార్పులు వస్తాయి. పిల్లలో రక్తపోటులో వచ్చే హెచ్చు తగ్గుల వలన భయపడవలసిన అవసరం లేదు.

జాగ్రత్తలు తప్పనిసరి..

కుటుంబంలో ఎవరికైనా బీపీ ఉండే వారసత్వంగా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. హెరిడిటీ ఉన్నవారు క్రమం తప్పకుండా చెకప్ చేయించుకోవాలి. ఒకవేళ సాధారణం కన్నా ఎక్కువ బీపీ ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలి.

రక్తపోటులో వచ్చే మార్పులను పరిగణనలోకి తీసుకుని డాక్టర్ సూచించిన విధంగా డైట్‌ప్లాన్, లైఫ్‌స్టైయిల్ మార్చుకోవాలి. బీపీ ఉన్నవారు ఆల్కహాల్, పొగత్రాగటం వంటి అలవాట్లకు చాలా దూరంగా ఉండాలి. స్పైసీ ఫుడ్ తీసుకోవడం తగ్గించాలి.

ఎక్కువగా టెన్షన్ పడకుండా పాటిజివ్‌నెస్‌తో ఉండేవారిలో రక్తపోటు సాధారణ స్థితిలో ఉంటుంది. మానసిక పరిస్థితి రక్తపోటుపై ప్రభావం చూపిస్తుంది.

యోగా, మెడిటేషన్, వాకింగ్ వంటి శారీరక వ్యాయామాలు రక్తపోటును నియంత్రిస్తాయి.

బ్రెయిన్ ఫుడ్

రైల్వేస్టేషన్‌లో, బస్‌స్టాండ్‌లో చాలామంది టైమ్‌పాస్ కోసం పల్లీలు తినడం గమనిస్తుంటాం. అయితే ఇలా కాలక్షేపం కోసమే తిన్నా.. అవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వేయించిన పల్లీలతో వచ్చే ఆరోగ్య ప్రయోజనాల్లో ఎన్నో ఉన్నాయి. అందుకే వీటిని 'బ్రెయిన్ ఫుడ్' అని కూడా పిలుస్తారు. వీటిలో అధికంగా ఉండే విటమిన్‌బి3 ఇందుకు కారణం. ఈ పోషకం మెదడు చురుకుదనాన్ని పెంచడమే కాకుండా... జ్ఞాపకశక్తి మెరుగయ్యేలా చేస్తుంది.

మన మెదడులో స్రవించే సెరటోనిన్ అనే రసాయం వల్ల మన మూడ్స్ బాగుంటాయి. పల్లీలు తిన్నప్పుడు అందులోని ట్రిప్టోఫాన్ అనే అమైనోయాసిడ్ మెదడులోని సెరటోనిన్ వెలువడటానికి తోడ్పడుతుంది. దాంతో మూడ్స్ బాగుపడటంతో పాటు డిప్రెషన్ కూడా తగ్గుతుంది. అందుకే నిరాశలో, నిస్ప హలో ఉన్నవారు టైంపాస్ కోసం పల్లీలు తింటే మూడ్స్ బాగుపడి డిప్రెషన్ దూరమవుతుంది. వీటిలో విటమిన్ బికాంప్లెక్స్‌లోని ప్రధాన పోషకం బయోటిన్, ఫోలేట్ చాలా ఎక్కువ. అవి గర్భవతులకు ఎంతో



మేలుచేస్తాయి. ఇక విటమిబి3గా పిలిచే నియాసిన్ పుష్కలంగా ఉన్నందున ఇది గుండెజబ్బుల ముప్పును నివారిస్తుంది. సో.. టైమ్‌పాస్ కోసం తిన్నా పల్లీలు ఆరోగ్యానికి మంచివే..!

బ్యాక్టీరియాను నాశనం చేసే..

దాదాపుగా అందరి వంటింట్లో అందుబాటులో ఉండేవాటిలో వెల్లుల్లి ఒకటి. పచ్చడిలోనూ, పప్పులోనూ వాడే అలవాటు చాలామందికి ఉంటుంది. వెల్లుల్లి రెబ్బలను రోజూ తింటే శరీరంలో చేసే బ్యాక్టీరియాను నివారించవచ్చని ఇటీవల పరిశోధనల్లో స్పష్టమైంది. వెల్లుల్లిలో యాంటీబాక్టీరియల్ లక్షణాలు ఉన్న సంగతి తెలిసిందే. అయితే, యాంటీ బయోటిక్స్‌కు లొంగని సూపర్‌బగ్స్‌ను కూడా వెల్లుల్లితో సమర్థంగా అరికట్టవచ్చని ఒక తాజా పరిశోధనలో తేలింది. వెల్లుల్లిలో ఉండే 'అజోనే' అనే రసాయనం ఎలాంటి మొండిరకం బ్యాక్టీరియాలనైనా ఇట్టే నాశనం చేయగలదని డానిష్ శాస్త్రవేత్తల



ప్రయోగాల్లో తేలింది.

యాంటీబయోటిక్స్‌ను తట్టుకుని మరీ మనుషుల శరీరంలోని కణజాలానికి అంటిపెట్టుకుని ఉండే బ్యాక్టీరియా డీఎన్‌ఏను వెల్లుల్లిలోని 'అజోనే' అనే రసాయనం నాశనం చేయగలుగుతోందని తమ ప్రయోగాల్లో తేలినట్లు కోపెన్‌హాగెన్ వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ టిమ్ హోమ్ జాకబ్సన్ వెల్లడించారు. మొండి బ్యాక్టీరియా కారణంగా ఇన్‌ఫెక్షన్లు సోకిన వారికి యాంటీ బయోటిక్స్‌తో పాటు వెల్లుల్లి నుంచి సేకరించిన 'అజోనే'తో తయారు చేసిన ఔషధాలను ఇస్తే ప్రాణాంతక పరిస్థితుల నుంచి బయటపడవచ్చని కోపెన్‌హాగెన్ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

ఫిట్‌గా ఉండాలంటే..!

ఆరోగ్యంతో పాటు ఫిట్‌గా కనిపించాలన్న తపన నేడు అన్ని వయసువారిలో ఎక్కువగా కనిపిస్తుంది. మరి ఫిట్‌గా ఉండాలనుకోవడంతోనే సరిపోదు.. అందుకోసం మీరు ఏం చేస్తున్నారో ఒకసారి ఆలోచించండి. రోజంతా బిజీబిజీగా గడిపేస్తూ.. ఫిట్‌గా ఉండాలంటే మాత్రం సాధ్యం కాదు. మీ కోసం కాస్త సమయం కేటాయించుకుంటేనే మీరు ఫిట్‌గా ఉండగలుగుతారు. మంచి నిద్ర, ప్రతిరోజూ వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారపదార్థాలను తీసుకోవడం మీ ఫిట్‌నెస్‌పై ప్రభావం చూపిస్తుందంటున్నారు నిపుణులు.



7-8 గంటల నిద్ర

మనకు ప్రతిరోజు 7-8 నుంచి గంటల నిద్ర అవసరం. రాత్రి పడుకోవడానికి , ఉదయం లేవడానికి సరైన ప్రణాళికను తయారుచేసుకోండి. ఈ విధంగా సమయాన్ని పాటించడం మీ శరీరాన్ని దృఢంగా ఉంచడానికి ఎంతగానో సహాయపడుతుంది.

20-30 నిమిషాల వ్యాయామం

వారానికి మూడు లేదా నాలుగు రోజులు తప్పకుండా వ్యాయామం నడవడం, పరుగెత్తడం చేయాలి. దీనికి ఒక సరైన సమయాన్ని అంటే రోజూ ఉదయం లేదా సాయంత్రం మీకోసం 20-30 నిమిషాల పాటు కేటాయించుకోవాలి. క్రమం తప్పకుండా చేసే వ్యాయామం మిమ్మల్ని ఫిట్‌గా ఉంచుతుంది. రన్నింగ్, జాగింగ్, సైక్లింగ్ వంటి తేలికపాటి వ్యాయామాలు చేయడం వలన రక్తసరఫరా మెరుగవడమే కాకుండా హృదయ సంబంధవ్యాధులు దరి చేరవు. ఈ వ్యాయామాల వల్ల శరీరంలో ఉన్న అనవసర కొవ్వు తగ్గడమే కాకుండా ఎముకలు కూడా గట్టి పడుతాయి. వీలైతే వారినికొకసారి మీ ఆఫీసుకు నడిచివెళ్లండి. లిఫ్ట్‌మీద ఆధారపడకుండా మెట్లు ఎక్కడానికి ప్రయత్నించండి. ఇది కూడా ఒక మంచి వ్యాయామమే.

5లీటర్ల నీళ్లు

జంక్ ఫుడ్ తింటూ ఫిట్‌గా ఉండాలనుకోవడం సరికాదు. ఫిట్‌గా ఉండాలనుకునేవారు సమతుల ఆహారాన్నే తీసుకోవాలి. విటమిన్లు, పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారపదార్థాలను (పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు) తీసుకోవాలి. తక్కువ కొవ్వు ఉండే పదార్థాలను తీసుకోవాలి. పాలు, వెన్న, నెయ్యి, వేపుళ్లు వీలైనంత మట్టుకు తగ్గించాలి.

- బరువు తగ్గడానికి , శరీరం ఫిట్‌గా ఉండటానికి నీరు చాలా అవసరం. నీళ్లు ఎంత ఎక్కువగా తాగితే ఆరోగ్యానికి అంత మంచిది. కానీ అన్నం తిన్న గంట తర్వాత నీళ్లను తాగాలి. గంటలోపు తాగకూడదు.

మీకు తెలుసా..?

మీకేమైనా అనారోగ్య సమస్యలున్నాయా.. పరిష్కారం దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..?
మీ సందేహాలకు సమాధానాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం.
మీరు చేయాల్సిందల్లా ఈ కింది చిరునామాకు పోస్ట్‌కార్డు రాయడమే.

మా చిరునామా
'రక్ష' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్టీసీ కల్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020
raksha.nava2015@gmail.com

వరల్డ్ నం.1 అమ్మ

- అగ్రస్థానంలో దిగ్గజ బాక్సర్ మేరీకోమ్
- ప్రపంచ బాక్సింగ్ ర్యాంకింగ్స్



న్యూఢిల్లీ : దిగ్గజ బాక్సర్, బాక్సింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తిరుగులేని యోధురాలు ఎం.సీ మేరీకోమ్ మరో ఘనత అందుకున్నది. మాగ్నిఫిషియెంట్ విజయాలతో భారత్‌లో క్రికెటేతర సూపర్‌స్టార్‌గా ఎదిగిన మేరీకోమ్ తాజాగా వెల్లడించిన ప్రపంచ బాక్సింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం కైవసం చేసుకున్నది. నిరుడు నవంబర్‌లో న్యూఢిల్లీ వేదికగా జరిగిన మహిళల బాక్సింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో ఆరో స్వర్ణం నెగ్గి చరిత్ర సృష్టించిన మేరీకోమ్, 48 కేజీల విభాగంలో వరల్డ్ నం.1గా నిలిచింది. అమేచర్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్ (ఏఐబీఏ) విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో మేరీకోమ్ ఏకంగా 1700 పాయింట్లతో కొనసాగుతోంది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం దిశగా కసరత్తు మొదలుపెట్టిన మేరీకోమ్, ఇప్పుడు 51 కేజీల విభాగంలోకి మారుతోంది. ఒలింపిక్స్‌లో మేరీకోమ్ రెగ్యులర్ 48 కేజీల విభాగం లేదు. దీంతో మేరీ కాస్త బరువు పెరిగి, కొత్త విభాగంలో చరిత్ర తిరగరాసేందుకు సిద్ధమవుతోంది. 51 కేజీల విభాగంలో పింకీ జాంగ్ర ఎనిమిదో స్థానంలో నిలువగా, 57 కేజీల విభాగంలో సోనియా లాథర్ రెండో స్థానంలో కొనసాగుతోంది. 54 కేజీల విభాగంలో మనీషా ఎనిమిదో ర్యాంక్ సాధించింది. సిమ్రన్ జిత్ కౌర్ 64 కేజీల విభాగంలో నాల్గో స్థానంలో, ఇదే విభాగంలో సరితా దేవి 16వ స్థానంలో ఉన్నారు.

రెండు వన్డేల నిషేధం?


- హార్దిక్, రాహుల్‌లపై రాయ్ సిఫారసు
- లీగల్ సెల్ సలహా కోరిన ఎదుల్జీ



ముంబయి : టెలివిజన్ షోలో మహిళలపై చులకన భావంతో, వివక్ష పూరిత వ్యాఖ్యలు చేసి అన్ని వైపులా విమర్శలు ఎదుర్కొంటున్న యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్‌లు రెండేసి వన్డేల నిషేధం ఎదుర్కొనే అవకాశం కనిపిస్తోంది. కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా ఉన్న కాఫీ విత్ కరణ్ కార్యక్రమంలో పాండ్య, రాహుల్‌లు వ్యక్తిగత విషయాలు వెల్లడించే క్రమంలో నోరు జారారు. షోలో వీరిద్దరు అమ్మాయిల పట్ల చేసిన కామెంట్లపై సోషల్ మీడియా అగ్గి మీద గుగ్గిలం అయ్యింది. బీసీసీఐ షోకాజ్ నోటీసుకు ఇరువరూ సంజాయిషీ ఇచ్చుకోగా, పాండ్య సోషల్ మీడియాలో క్షమాపణలు చెప్పాడు. మరో క్రికెటర్ రాహుల్ మాత్రం సోషల్ మీడియా విమర్శలపై స్పందించాల్సి ఉన్నది. పాండ్య, రాహుల్ సంజాయిషీతో సంతృప్తి పడని పాలకుల కమిటీ చైర్మన్ వినోద్ రాయ్ వారిద్దరిపై రెండు వన్డేల నిషేధం విధించాలని సిఫారసు చేశారు. కానీ సీవోఏ సభ్యురాలు డయాన ఎదుల్జీ మాత్రం బీసీసీఐ లీగల్ సెల్ అభిప్రాయం తీసుకున్న తర్వాత తుది నిర్ణయం తీసుకోవాలని సూచించింది. అలాగే బోర్డు తాత్కాలిక అధ్యక్షుడు సి.కె ఖన్నా సహా కార్యదర్శి అమితాబ్ చౌదరి అభిప్రాయలను సైతం పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. ‘ పాండ్య వివరణతో నేను సంతృప్తి చెందలేదు. ఇద్దరు ఆటగాళ్లపై రెండు మ్యాచుల నిషేధం విధించాలని సిఫారసు చేశాను. అయినప్పటికీ డయాన ఎదుల్జీ అభిప్రాయం తర్వాత తుది నిర్ణయం తీసుకుంటాం’ అని వినోద్ రాయ్ తెలిపారు. బీసీసీఐ వార్షిక కాంట్రాక్టు నిబంధనల ప్రకారం ఆటగాళ్లపై నిషేధించే అవకాశం ఉంది. ఇదే సమయంలో మీడియాకు ఇంటర్వ్యూలకు సైతం బోర్డు అనుమతి తప్పనిసరైన పరిస్థితుల్లో, ఓ టెలివిజన్ షోకు ఎవరి అనుమతితో పాండ్య, రాహుల్ హాజరయ్యారని కార్యదర్శి అమితాబ్ చౌదరి ప్రశ్నించారు.

కొంత మందికి అదే పని!

- కోహ్లిసేనను విమర్శించేందుకు తహతహ
- టీమ్ ఇండియా చీఫ్ కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్య



సిడ్నీ (ఆస్ట్రేలియా)

భారత క్రికెట్ జట్టు చీఫ్ కోచ్ రవిశాస్త్రి మరోసారి విమర్శకులపై ఒంటికాలితో లేచాడు!. చారిత్రక విజయాలు సాధించినా, కొంత మంది కోహ్లిసేనను విమర్శించటమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించాడు. కోహ్లిసేనను కిందకు లాగాలని, కొంత మంది పని కట్టుకుని విమర్శలు చేస్తున్నారని శాస్త్రి అన్నాడు. 71 ఏండ్ల నిరీక్షణకు తెరదించుతూ 2-1తో కోహ్లిసేన ఆస్ట్రేలియాలో తొలి టెస్టు సిరీస్ విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో ఓ ఆంగ్లపత్రికతో రవిశాస్త్రి ముఖాముఖి మాట్లాడారు. ఆ వివరాలు..

● గొప్ప విజయమే, కానీ 1983 ప్రపంచకప్ కంటేనా? నిజంగా ఉద్దేశం అదేనా?

క్రికెట్ ప్రామాణిక ఫార్మాట్ టెస్టులు. 71 ఏండ్ల అడ్డుగోడ బద్దలైంది. దిగ్గజ క్రికెటర్లు ఇమ్రాన్ ఖాన్, వివ్ రిచర్డ్స్ వంటి వారే పొగిడారు. ఆస్ట్రేలియాలో సిరీస్ నెగ్గటం ఎంత కష్టమో వారికి తెలుసు. ఇక్కడ ప్రత్యర్థికి ఏదీ అంత సులువుగా రాదనే విషయం తెలుసు. 1983 ప్రపంచకప్ శిఖర స్థానంలోనే ఉంటుంది, అలాగే 1985 సైతం!. కానీ నేను చెప్పినదానికి కట్టుబడి ఉన్నాను. ఇది స్వచ్ఛమైన క్రికెట్ ఫార్మాట్, ఇది నిజమైన క్రికెట్. కోహ్లిసేన యువ బృందం, ఇంతటి చరిత్ర సృష్టించారంటే ఈ ఘనత వారిది. కోహ్లిసేన చరిత్ర తిరగరాసింది.

● భారత్ విజయాన్ని మిచెల్ జాన్సన్ ‘స్వచ్ఛమైన బంగారం’ అనటంపై..?

ఆస్ట్రేలియా ఇప్పుడు కేవలం బోర్డర్-గవాస్కర్ సిరీస్ గురించే మాట్లాడుతోంది. ఆస్ట్రేలియాలో సిరీస్ విజయం విలువ మిచెల్ జాన్సన్‌కు తెలుసు. అదే విధంగా కోహ్లిసేన విజయంపై నిట్టూరుస్తున్న వారికీ తెలుసు. ఈ విజయానికి కోహ్లిసేన ఎంతో కష్టపడింది, అంతిమంగా సాధించింది.

● ఓ ఏడాది ఆశాజనంగా ముగిసింది, మరో ఏడాది గొప్పగా ఆరంభమైంది. తర్వాతి గురి ప్రపంచకప్‌పైనే అనుకోవాలా?

అవును, మా మదిలో మెదులుతోన్న విషయం ప్రపంచకప్ ఒక్కటే. మానసికంగా మేం అప్పుడే ఎర్ర బంతి నుంచి తెల్ల బంతికి మారిపోయాం. ఎడతెరిపి లేని క్రికెట్ ఆడుతున్న ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చాం. బుమ్రాకు మంచి విశ్రాంతి లభించనున్నది. ఇదే సమయంలో ఆసీస్, కివీస్‌లతో వన్డే సిరీస్‌లు కీలకం. ఈ మ్యాచుల్లో మా ప్రాధాన్యత ప్రపంచకప్ కాంబినేషన్లను సరిచూసుకోవటంపైనే, గెలుపోటములు పట్టించుకోం. ప్రపంచకప్ బృందాన్ని ఎంచుకునేందుకు ఈ సిరీస్‌లను వినియోగించుకుంటాం.

● మార్చిలో ఐపీఎల్ ఆరంభం కానున్నది. ప్రపంచకప్ ముంగిట ఐపీఎల్‌లో ఆడటంపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి?

ఈ విషయంపై బీసీసీఐ, సీవోఏలతో సంప్రదిస్తున్నాం. మా వద్ద కొన్ని ప్రణాళికలు ఉన్నాయి, వాటిని అమలు చేసేందుకు చూస్తున్నాం. నిజానికి ఐపీఎల్ జరిగే రెండు నెలలు నాకు విశ్రాంతి రోజులు. హాయిగా కూర్చొని, క్రికెట్‌ను ఆస్వాదిస్తాను. కానీ ఈ సారి ప్రపంచకప్ నేపథ్యంలో భారత ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాల్సి ఉంది. సహాయక కోచ్, ఫిజియోలు, ట్రైనర్, కెప్టెన్, బోర్డుతో నిత్యం సంప్రదింపులు జరపాల్సి ఉంటుంది.

● టాస్‌తో కోహ్లి ఇబ్బంది పడుతున్నట్టు కనిపిస్తున్నాడు. కానీ కోహ్లి టాస్ నెగ్గితే టెస్టులనూ నెగ్గుతున్నాడు?

నిజమే, నాటింగ్‌హామ్‌ను మినహాయిస్తే.. జొహనెస్‌బర్గ్, ఆడిలైడ్, మెల్‌బోర్న్‌లలో కోహ్లి తొలుత టాస్ నెగ్గి, తర్వాత టెస్టు గెలిచాడు. భారత్ టాస్ నెగ్గిన ప్రతీసారి, మ్యాచ్ గెలిచింది. అదృష్టం సైతం కలిసిరావాలి, ఎందుకంటే మన చేతుల్లో లేని విషయాల్లో టాస్ ఒకటి. ఇక టాస్ ఓడినా.. కేప్‌టౌన్, ఎడ్జ్‌బాస్టన్ సహా ఇంగ్లాండ్ చివరి రెండు టెస్టుల్లో విజయానికి చేరువగా వచ్చాం.

● దక్షిణాఫ్రికా పర్యటన నుంచి పేసర్లు భీకరంగా ఆడుతున్నారు?

అద్భుతంగా రాణిస్తున్నారు. ఇషాంత్, షమి, బుమ్రా అమోఘమైన కాంబినేషన్. కొన్నేండ్ల కిందట షమి తరచుగా గాయాల పాలయ్యేవాడు. కానీ అతడు ఫిట్‌నెస్ మెరుగుపర్చుకొని, ఇప్పుడు సత్తా చాటుతున్నాడు. యోయో ఫిట్‌నెస్ పరీక్ష, రోజువారీ శిక్షణతోనే ఇది సాధ్యమైంది. ఇషాంత్ శర్మ సైతం కఠోర సాధకుడు. పేస్ దళానికి వెన్నెముక బుమ్రా. ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ గుండెల్లో గుబులు పుట్టించిన పేస్ త్రయం ఇది. ఇయాన్ చాపెల్ అంతటోడే ఆస్ట్రేలియాకు వచ్చిన అత్యుత్తమ పేస్ దళమిదేనని కితాబిచ్చాడు. అంతకమించి ఏం కావాలి, వీరిని చూసి గర్వపడుతున్నాను.

● ఎన్నో ప్రతికూల విమర్శలు సైతం వినిపిస్తున్నాయి, దీనిపై ఏమంటారు?

ఇక్కడ కొంత మంది కేవలం కోహ్లిసేనను విమర్శించటమే పనిగా పెట్టుకున్నారు. నిత్యం విమర్శలు చేస్తూనే ఉంటారు. సోసల్ మీడియా విమర్శలు సరే, కానీ ప్రత్యేకించి కొంత మంది కావాలనే విమర్శలు చేస్తున్నారు, జట్టును కిందకు లాగే ప్రయత్నంలో ఉన్నారు. సిడ్నీ టెస్టు తర్వాత ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఒక విషయాన్ని చెప్పాను. టీమ్ డైరెక్టర్‌గా జట్టుతో చేరినప్పుడు టెస్టుల్లో భారత్ ర్యాంక్ 5-6 అనుకుంటా. ఈ మూడేండ్లలో భారత్ వరల్డ్ నం.1గా నిలిచింది. విమర్శలు చేసేవారు వారి పనిని కొనసాగిస్తూనే ఉంటారు. కానీ వారి విమర్శలకు విలువ లేదని త్వరలోనే తెలుసుకుంటారు!.

● తుది జట్టు కూర్పులో ఓ సారి రహానెను, మరోసారి పుజారను సైతం పక్కనపెట్టడంపై?

అన్ని కాంబినేషన్లను ప్రయత్నించటం చాలా ముఖ్యం. అందులో కొన్ని సఫలమవుతాయి, మరికొన్ని విఫలమవుతాయి. కానీ అదంతా మంచి పాఠాలు నేర్పుతుంది. కొంత మంది అరంగేట్రంలోనే అవకాశాలు దక్కించుకుని, సద్వినియోగం చేసుకున్నారు. మరికొంత మందికి అవకాశాలు ఇచ్చినా, మెరువలేదు. కొత్త కాంబినేషన్లను ప్రయత్నించేందుకు ఈ జట్టు ఏమాత్రం భయపడటం లేదు అది గొప్ప విషయం. కొత్తగా ప్రయత్నించిన ప్రతిసారీ కోహ్లిసేన బలంగానే తిరిగొస్తుంది!.

వక్ఫ్ భూముల్లో కబ్జాకారు..!

మామిడిపల్లిలో రూ.కోట్ల విలువైన భూమిపై పాగా

- అధికార పార్టీ ఎమ్మెల్యే బంధువు..!
- స్వాధీనానికి జంకుతున్న అధికారులు



నవతెలంగాణ- సిటీబ్యూరో

ప్రభుత్వ, వక్ఫ్ భూముల కబ్జాల పరంపరం కొనసాగుతూనే ఉంది. ఇందులో అధికారం, పరపతి రెండూ చేతులు కలుస్తున్నాయి. కోట్ల విలువైన వక్ఫ్ భూమిని కబ్జా చేసిన అధికార పార్టీ ఎమ్మెల్యే బంధువు.. అందులో భవనాలు, ఫాంహౌస్‌లు నిర్మిస్తున్నారు. ఆ భూముల్లో సర్వే చేసిన అధికారులు వక్ఫ్ భూములుగా నిర్ధారించి నోటీసులు జారీ చేశారేగానీ స్వాధీనానికి వెనుకడుగు వేస్తున్నారు. హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల్లోని కోట్ల విలువ చేసే వక్ఫ్ భూముల కబ్జాలపై ప్రత్యేక కథనం..

తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆధీనంలో 77,538 ఎకరాల భూములున్నాయి. హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న మణికొండ, హుస్సేన్‌షావలి దర్గా, గోపన్‌పల్లి, ఖాజాగూడ, గచ్చిబౌలి, టోలిచౌకి, షేక్‌పేట, నార్సింగి, గండిపేట, హిమాయత్‌సాగర్, ఉప్పర్‌పల్లి, రాజేంద్రనగర్, బడంగిపేట, అల్మాస్‌గూడ, శేరిగూడ, తుక్కుగూడ, లింగంపల్లి తదితర ప్రాంతాల్లో రూ.కోట్ల విలువైన భూములున్నాయి. వాటిని పరిరక్షణకు వక్ఫ్‌బోర్డు కానీ, ప్రభుత్వం కానీ సరైన చర్యలు తీసుకోకపోవడంతో చాలా చోట్ల కబ్జాకు గురవుతున్నాయి.

ఇదీ.. కబ్జాల పర్వం

హైదరాబాద్‌లోని మౌలాలి, మీర్‌మహ్మద్ పహాడీ, టోలిచౌకి తదితర ప్రాంతాల్లో ఉన్న వేల కోట్ల విలువైన వక్ఫ్‌భూములు కబ్జాకు గురైనట్టు ఐదు నెలల కిందట వెలుగులోకి వచ్చింది. కానీ సంబంధిత అధికారులు నేటికీ స్పందించలేదు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఆనుకుని ఉన్న హుస్సేన్ షావలి దర్గాకు విలువైన భూములున్నాయి. ఈ ప్రాంతంలో ఎకరం రూ.100 నుంచి రూ.200 కోట్ల వరకు పలుకుతోంది. దీనిపై కన్నేసిన పాలక పార్టీకి చెందిన ఓ బడా నేత రూ.కోట్ల విలువైన భూమిని కబ్జా చేసి మల్టీలెవల్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నాడు. ఈ విషయం గురించి వక్ఫ్ అధికారులకు సమాచారం అందించినా స్పందించడం లేదన్న ఆరోపణలున్నాయి. తాజాగా అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే బంధువు అదే ప్రాంతంలో 12.10 ఎకరాల వక్ఫ్ భూమిని కబ్జా చేశారు. అయితే ఈ విషయంపై స్థానికులు, దర్గా కమిటీ సభ్యులు వక్ఫ్‌బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాల్సిన సంబంధిత అధికారులు సదరు కబ్జాదారునికి కేవలం నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నట్టు ఆరోపణలున్నాయి.

నగర శివారులోని బాలాపూర్ మండలం మామిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సైఫ్ నవాజ్ జంగ్ దర్గాకు చెందిన సుమారు 228 ఎకరాల భూమి ఉంది. ఇందులో సింహభాగం భూమి ఇప్పటికే ఆక్రమణకు గురైంది. ఇటీవల మిగిలిన 12.10 ఎకరాల భూమిని కూడా కొందరు కబ్జా చేశారు. అంతేకాదు ఈ ప్రాంతంలో అనుమతి లేకుండా ఫాంహౌస్ నిర్మిస్తున్నారు. ఈ విషయం వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ సంస్థ నిరూపించింది. భూమి కబ్జాకు గురైనట్టు ఫిర్యాదులు అందిన తర్వాత ఆలస్యంగా మేల్కొన్న వక్ఫ్‌బోర్డు అధికారులు మామిడిపల్లికి వెళ్లి భూమిని సర్వే చేసి వక్ఫ్‌భూమిగా నిర్ధారించారు. ఈ భూమిని 2016లో ఓ మహిళ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించినట్టు ఆరోపణలున్నాయి. వక్ఫ్‌బోర్డు, రెవెన్యూ రికార్డులు, గెజిట్‌లోనూ వక్ఫ్‌బోర్డు భూమిగా నమోదై ఉంది. ఈ విషయంపై అక్టోబర్‌లో వక్ఫ్‌బోర్డు అధికారులు కబ్జాదారునికి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. కానీ నేటి వరకు ఆ భూమిని తమ ఆధీనంలోకి తీసుకోలేదు. ఈ భూమిని కబ్జా చేసింది అధికార పార్టీ శాసన సభ్యుడి బంధువు కావడం వల్లే వక్ఫ్‌బోర్డు అధికారులు స్వాధీనం చేసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నట్టు సమాచారం. సదరు ఎమ్మెల్యే అధికారులు బెదిరించినట్టు కూడా ఆరోపణలొస్తున్నాయి. ఇవి మచ్చు కొన్ని ఉదాహరణలు మాత్రమే.. హైదరాబాద్ చుట్టుపక్కలతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ భూముల పరిస్థితీ ఇలాగే ఉంది.



వర్సిటీలలలో ఎస్సీ, ఎస్టీ కోటాపై ఆ వేగమేది..?

- ఈ పార్లమెంట్ సమావేశాల్లోనూ మొండిచేయి



(ఫైల్)

న్యూఢిల్లీ: అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్ కల్పిస్తూ తీసుకొచ్చిన బిల్లును పార్లమెంట్‌లో ఆగమేఘాల మీద ఆమోదించుకున్న మోడీ సర్కారు.. అదే వేగాన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఎస్సీ, ఎస్టీ అధ్యాపకుల రిజర్వేషన్‌ల కోటాపై మాత్రం చూపలేకపోతున్నది. ప్రతిపాదిత బిల్లు ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర విద్యాలయాలలో రిజర్వేషన్ కల్పిస్తున్నది. 2018 మార్చికి ముందు ఉన్నత విశ్వవిద్యాలయాలలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ఉండగా.. అలహాబాద్ కోర్టు తీర్పుతో దానిని రద్దు చేశారు. యూనివర్సిటీలలో కాకుండా సంబంధిత విభాగాలలో వారికి రిజర్వేషన్‌ను కల్పిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. కాగా, గతంలో మాదిరిగానే తమకు రిజర్వేషన్లను పునరుద్ధరించాలని గత కొంతకాలంగా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కోరుతున్నారు. ఇది అమలైతే, దేశవ్యాప్తంగా కేంద్ర విశ్వవిద్యాలయాలలో దాదాపు 5 వేల మంది ప్రొఫెసర్ల నియామకాన్ని చేపట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇవి ఖాళీగా ఉన్నాయి. దీంతో, విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నా కేంద్రం మాత్రం దీనిపై దృష్టి సారించకపోవడం గమనార్హం. ఇదిలాఉంటే కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ (హెచ్ఆర్డీ) ఇప్పటికే ఈ బిల్లును కేంద్ర క్యాబినెట్‌కు పంపించింది. ఈ శీతాకాల సమావేశాలలో ఇది పార్లమెంట్ ముందుకు వస్తుందని ఆశించినా మోడీ సర్కారు మాత్రం దీనికి పచ్చజెండా ఊపలేదు. ఏదేమైనా, రాజకీయంగా తమకు లాభం చేకూర్చే బిల్లును ఆమోదింపజేసుకున్న మోడీ సర్కారు.. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రిజర్వేషన్‌లు కల్పించే బిల్లును అటకెక్కించిందని కాదనలేని వాస్తవం.

ఆరెస్సెస్ కార్యాలయంలో ఆయుధాలు, బాంబు సామాగ్రి

- కేరళ పోలీసుల తనిఖీతో వెలుగులోకి..



(ఫైల్)

తిరువనంతపురం: శబరిమల అంశాన్ని ఉపయోగించుకుని కేరళలో పాగా వేయాలని భావిస్తున్న ఆరెస్సెస్, బీజేపీ.. ఆ దిశగా అక్రమాలకు పాల్పడుతున్నాయి. తిరువనంతపురంలోని ఆరెస్సెస్ కార్యాలయంలో ఆయుధాలు, బాంబుల తయారీకి ఉపయోగించే సామాగ్రి బయటపడటం దీనికి మరింత ఊతమిస్తోంది. ఈనెల 2న కేరళకు చెందిన ఇద్దరు మహిళలు అయ్యప్పను దర్శించుకున్న మరుసటి రోజు నుంచి కాషాయ మూక ఆందోళనలు చేస్తూ అక్కడ భయానక వాతావరణాన్ని సృష్టిస్తోంది. జనవరి 3న నెడుమంగడ్‌లో ఆరెస్సెస్ చేపట్టిన కార్యక్రమం హింసకు దారితీసింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌పై గుర్తుతెలియని వ్యక్తులు బాంబులు విసిరారు. సీసీటీవీ ఫుటేజీల ద్వారా పోలీసులు దుండగులను గుర్తించారు. ఆరెస్సెస్ కార్యకర్త ప్రవీణ్‌తో పాటు మరోవ్యక్తి ఈ దుశ్చర్యకు ఒడి గట్టారని వీడియోలో తేలింది. దీంతో, అతడిని అదుపులోకి తీసుకునే క్రమంలో.. తిరువనంతపురంలోని ఆరెస్సెస్ కార్యాలయంలోనూ పోలీసులు తనిఖీలు చేపట్టారు. అక్కడ నిషేధించబడిన ఆయుధాలు, నాటుబాంబులను తయారుచేయడానికి ఉపయోగించే సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.